


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




మంగళవారం | 17-3-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 332 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా. 3.25 తదుపరి దశమి; నక్షత్రం: మూల ఉ. 11.47 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ. 10.08-11.47, రా. 9.52-11.33; దుర్ముహూర్తం: ఉ. 8.49-9.37, రా. 10.19-11.06; అమృతఘడియలు: శే. ఉ. 6.52 వరకు; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 6.22 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

# అయితే.. మాకేంటి!

## ఎస్ఈసీ ఆదేశాలకు సీఎంవో మోకాలడ్డు

స్థానిక ఎన్నికలను రాష్ట్ర కమిషన్ వాయిదా వేసింది!

'అధికారం... మీదా, మాదా' అని రాష్ట్ర ప్రభుత్వం నిలదీసింది.

అక్రమాలపై ఆగ్రహించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ పలువురు అధికారులను బదిలీ చేయాలని ఆదేశించింది.

'ఇలాగైతే... నేనెందుకు. ఎస్ఈసీయే వచ్చి పాలించుకోవచ్చు' అని స్వయానా సీఎం గర్జించారు.

ప్రభుత్వానికీ, ఎస్ఈసీకీ మధ్య 'పెద్ద పంచాయితీ' నడుస్తోంది. నిజానికి... స్థానిక ఎన్నికల విషయంలో ఎస్ఈసీ నిర్ణయమే అంతిమం! కమిషన్ ఆదేశాలను అమలు చేయాల్సిందే! కానీ... వాటిని అమలు చేయకపోవడంతో పరిణామాలు రాజ్యాంగ సంక్షోభం దిశగా కదులుతున్నాయి. ఇక... కోడ్ ఉండగా ఎస్ఈసీ ఆదేశాలను అమలు చేయడం తప్ప, ప్రశ్నించడం, ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశమే లేదు. కానీ... 'ఎన్నికలు యథాతథంగా జరపండి' అంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ ఎస్ఈసీకి లేఖ రాయడమూ చర్చనీయాంశంగా మారింది.

- ఒక్క అధికారినీ బదిలీచేయని ప్రభుత్వం
- పట్టించుకోవాల్సిన పనిలేదనే సంకేతాలు
- రాజ్యాంగబద్ధ సంస్థ ఉత్తర్వులకే బ్రేక్
- ఎన్నికల సందర్భంలో ఈసీయే సుప్రీం
- సీఎస్, యంత్రాంగమంతా ఆ పరిధిలోకే
- నాడు సీఎంకు చెప్పకుండా సీఎస్ మార్పు
- రాజ్యాంగ సంక్షోభమంటున్న నిపుణులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

స్థానిక ఎన్నికలను వాయిదా వేయడంతో పాటు... నామినేషన్లు, ఉపసంహరణల సందర్భంగా అరాచకాలు, అక్రమాలు, బెదిరింపులు బహిరంగంగానే జరిగిన చిత్తూరు, గుంటూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇద్దరు డీఎస్పీలను, మరికొందరు సీఐలను బదిలీ చేయాలని... మాచర్ల సీఐని సస్పెండ్ చేయాలని కూడా ఆదేశించింది. ఈ ఆదేశాలు వెలువడి 24 గంటలు దాటినా... వాటి అమలు దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. దీంతో ఎస్ఈసీ ఆదేశాలను ధిక్కరించినట్లయింది. నిజానికి... ఎస్ఈసీ ఆదేశాలను అమలు చేయాల్సింది ప్రభుత్వ యంత్రాంగమే. కానీ... ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కార్యాలయం ఆ ఆదేశాలను పట్టించుకోనక్కర్లేదంటూ సంకేతాలు ఇవ్వడంతో అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఎన్నికల కోడ్

మిగతా 7వ పేజీలో...



సోమవారం పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న సీఎం జగన్, మంత్రులు

## ఎన్నికలు ఆపొద్దు

కమిషన్ వైఖరి రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకు రాష్ట్ర సర్కారు 11

## యథావిధిగా జరపండి

కరోనా కట్టడి రాష్ట్రప్రభుత్వం బాధ్యత.. ఎస్ఈసీకి సీఎస్ నీలం లేఖ

## కమిషనర్‌ను తీసేయడమెలా?

అభిశంసనపై మాజీ ఎస్ఈసీ రమాకాంత్‌రెడ్డి వద్ద జగన్ ఆరా

బెంగాల్, మహారాష్ట్రలో స్థానికం వాయిదా 9



నాకు తెలిసి ఒక వైరస్ విషయంలో ప్రపంచ దేశాలు ఇంత ఆందోళనకు గురైన సందర్భం లేదు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా మొద్దు నిద్ర వదిలి కరోనాపై దృష్టి పెట్టాలి. ఎన్నికలపై ఉన్న శ్రద్ధలో పదో వంతు కూడా ఆయనకు ఈ వైరస్‌పై ఉన్నట్లు కనిపించడం లేదు.

\- చంద్రబాబు

తనపై జగన్ పత్రిక రాసిన నారాసుర రక్త చరిత్ర కథనాన్ని చూపిస్తున్న చంద్రబాబు

## తప్పు దిద్దుకోకుండా.. మూర్ఖంగా

# ఎదురుదాడి

- దేశమంతా కరోనా అటెన్షన్
- జగన్‌కు మాత్రం ఎన్నికల టెన్షన్

- మీ బాధ్యతారాహిత్యానికి ప్రజలను బలి పెడతారా?
- విదేశాల నుంచి 6 వేల మంది రాష్ట్రంలోకి వచ్చారు
- ఎంత మందిని పరీక్షించారు.. అసలు పట్టించుకున్నారా?
- కోర్టులూ విచారణలు తగ్గించుకుంటున్నాయి
- ఎన్నికలకు 3 కోట్ల మంది బయటకు వస్తే వ్యాప్తి పెరగదా?
- మిగతా రాష్ట్రాలకు తెలివిలేకే అన్నీ నిలిపివేస్తున్నాయా?
- ఫ్రాన్స్‌లో ఎన్నికల వల్లే ఒక్క రోజులో 900 కేసులు
- 20 మంది చనిపోయారు.. చంద్రబాబు ఆగ్రహం
- కరోనాతో ఇబ్బంది లేదని సీఎస్ లేఖ రాయడం ఘోరం

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేశమంతా కరోనా వైరస్ వ్యాప్తిపై ఆందోళనకు గురవుతుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఎన్నికలు ఆగిపోయాయన్న టెన్షన్‌తో నలిగిపోతున్నారని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు. కరోనా వైరస్‌పై తన వ్యాఖ్యలతో జగన్ దేశవ్యాప్తంగా నవ్వుల పాలయ్యారని తప్పు దిద్దుకోవాల్సింది పోయి మూర్ఖుల మాదిరిగా ఎదురుదాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ నేతలు అచ్చెన్నాయుడు, వర్ల రామయ్యలతో కలిసి సోమవారమిక్కడ మంగళగిరిలోని

మిగతా 10వ పేజీలో...

## ఎన్నికలను రీషెడ్యూల్ చేయాలి



కేంద్ర బలగాలతో మళ్లీ నిర్వహించాలి

బీజేపీ అధ్యక్షుడు కన్నా డిమాండ్ 10



**బూత్‌లో సీసీ కెమెరాలు**

పెట్టడానికి నిధులు మేమే ఇస్తాం

ఎస్ఈసీకి టీడీపీ నేత జేసీ వినతి



## రమేశ్‌కుమార్.. తమాషా చేస్తున్నారా?

కరోనా వైరస్సా..

కమ్మ వైరస్సా: స్పీకర్ తమ్మినేని 11



## కుల గజ్జి వెధవ

రాష్ట్రానికి డబ్బులు రాకుండా చేస్తారా?

ఎస్ఈసీపై ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజం 11



## టీడీపీతో కుమ్మక్కు

కరోనా వైరస్ కుంటిసాకు: మంత్రి వనిత 11







## విద్యుత్‌లో మాకూ

# వాటా!

### పోలవరంపై కేంద్రం మెలిక

- తుది అంచనా వ్యయంలో భారీ కోత
- 47,725 కోట్లకు ఆర్థిక శాఖ కమిటీ ఆమోదం
- రాష్ట్రం ప్రతిపాదించింది 55,656 కోట్లు
- తాజాగా 8 వేల కోట్లు కోసేసిన ఆర్థిక శాఖ
- ఇందులో భూసేకరణ వ్యయం బాగా తగ్గింపు!
- జగన్ ప్రభుత్వం సరేననక తప్పని పరిస్థితి

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం సాగు నీటి ప్రాజెక్టు వ్యయాన్ని తామే పూర్తిగా భరిస్తున్నందున.. రాష్ట్రప్రభుత్వం నిర్మిస్తున్న జల విద్యుత్కేంద్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో తనకూ వాటా ఇవ్వాలని కేంద్రం తాజాగా మెలిక వేసింది. అలాగే 2017-18 ధరల ప్రకారం రాష్ట్రం ప్రతిపాదించిన తుది అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లలోనూ భారీగా కోత విధించింది. అంచనా వ్యయం రూ.47,725.74 కోట్లేనని పేర్కొంటూ

మిగతా 2వ పేజీలో...

## ఆంధ్ర ఉద్యోగులను రానివ్వం

- రిలీవై వెళ్లినవారిని అడ్డుకున్న తెలంగాణ విద్యుత్ సిబ్బంది
- విద్యుత్‌సౌధలో తీవ్ర ఉద్రిక్తత
- ఏపీ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



3

## గరిష్ఠ ఫీజు రూ.69 వేలే

ఇంజనీరింగ్ ఫీజుల్లో కోత.. నేడు సర్కారుకు సిఫారసులు

నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ఏడాదికే పరిమితం

కమిషన్ రెగ్యులేషన్స్‌కు సవరణ 2

నిర్మానుష్యంగా తిరుమలలోని వైకుంఠం-2 కాంప్లెక్స్ పరిసరాలు



## షట్‌డౌన్ దిశగా

# భారత్!

9

- 15 రాష్ట్రాలకు విస్తరణ... 114 కేసులు
- మహారాష్ట్రలో అత్యధికంగా 39 మందికి!
- ఐరోపా, బ్రిటన్, టర్కీవాసులకు నో ఎంట్రీ
- బడులు, జిమ్‌లు, స్విమింగ్ పూల్స్ అన్నీ క్లోజ్
- ఢిల్లీలో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, మత సమావేశాలపై నిషేధం
- ముంబై సిద్ధివినాయక కోవెల మూసివేత
- కేరళలో 5150 మంది విదేశీయులపై నిఘా

# కరోనా కలకలం

## రోజురోజుకూ పెరుగుతున్న అనుమానితులు

- విశాఖ ఏజెన్సీలో విదేశీయులకు నో ఎంట్రీ
- తిరుపతి రుయాలో ఐదుగురికి నెగిటివ్
- దుబాయ్ నుంచి వచ్చిన మహిళ మృతి
- రిపోర్టులో కొవిడ్-19 నెగిటివ్ అని వెల్లడి
- పట్టణ ప్రాంతాల్లో వైరస్ నిరోధానికి చర్యలు
- మంత్రి బొత్స నేతృత్వంలో అధికారుల భేటీ

- హైకోర్టులో అత్యవసర కేసులే విచారణ
- లాయర్లు, కక్షిదారులు జ్వరంతో రావొద్దు
- 2 వారాలు అమలు.. కింది కోర్టుల్లో కూడా

### బడికి సెలవులపై డైలమా!

- 18 రాష్ట్రాల్లో విద్యా సంస్థలు బంద్
- రాష్ట్రంలో మూసివేతకు సీఎం నిరాసక్తి
- రిస్క్ తీసుకోవడం అవసరమా..
- సెలవులిస్తేనే మేలంటున్న అధికారులు

7

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా కరోనా అనుమానిత కేసులు పెరుగుతున్నాయి. గుంటూరు, కృష్ణా, కడప, కర్నూలు, తిరుపతి, విశాఖల్లో కరోనా అనుమానిత కేసులు కలకలం రేపుతూనే ఉన్నాయి. దీంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఏ మాత్రం అనుమానం ఉన్నా.. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జర్మనీ నుంచి వారం రోజుల క్రితం గుంటూరు వచ్చిన యువకుడికి కరోనా అనుమానిత లక్షణాలు ఉండడంతో సోమవారం జీజీహెచ్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. శాంపిల్స్‌ను స్విమ్స్‌కు పంపించారు. ఇటీవల కువైత్ నుంచి వచ్చిన కడప జిల్లా పుల్లంపేట మండలానికి చెందిన యువకుడు రెండు రోజులుగా

మిగతా 10వ పేజీలో...



కువైత్ నుంచి వచ్చిన వ్యక్తిని కడప రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

## మార్కెట్ మళ్లీ ధమాల్



8

'బేర్'మన్న షేర్లు

రూ. 7.62 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఖతం

- 2,713 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్
- 9,200 పాయింట్ల దిగువకు నిఫ్టీ



పరంజ్యోతి



## ప్రాణాయామంతో మనసుకు పగ్గం

*వాయురోధనాత్ లీయతే మనః*
*జాల పక్షివత్ రోధ సాధనం*

ప్రాణవాయువును నియంత్రించడం వల్ల మనసు.. వలలో చిక్కిన పక్షిలాగా లయమైపోతుంది. ఇదే మనసును అరికట్టే ఉపాయమని దీని అర్థం. రమణమహర్షి రచించిన 30 శ్లోకాల 'ఉపదేశ సారం'లోని 11వ శ్లోకమిది. ముందు చెప్పిన 10 శ్లోకాల్లోని తొలి మూడు శ్లోకాల్లో కర్మయోగం గురించి, తర్వాత ఏడు శ్లోకాల్లో భక్తి యోగం గురించి చెప్పిన రమణులు.. చంచలమైన మనసును నియంత్రించే ప్రక్రియలతో కూడిన రాజ యోగం గురించి ఈ శ్లోకంతో మొదలుపెట్టి చెప్పారు. సద్గురువు చెప్పిన వేదాంత బోధను చక్కగా అర్థం చేసుకోవాలంటే మనసు ఎటువంటి అలజడులు, ఆందోళనలు లేకుండా ప్రశాంతంగా ఉండాలి. కర్మలను ఈశ్వరార్పితంగా చేస్తే చిత్తశుద్ధి కలిగి ముక్తికి మార్గమవుతుంది. ఇది కర్మయోగం. అలాగే భక్తి యోగం ద్వారా మనసును పరిపరి విధాల పరుగులు తీయకుండా చేసుకోవచ్చు. ఈ రెండే కాక.. యోగ, జ్ఞానాలు హృదయస్థానంలో మనసును నిలుపుతాయని రమణులు చెప్పారు. యోగమార్గం అంటే.. రాజయోగం. మనసెప్పుడూ చంచలంగా ఉంటుంది. కదలడం దాని స్వభావం. ఎప్పుడూ ఏదో ఒక ఆలోచన చేస్తూనే ఉంటుంది. మనకు సుఖాన్నిచ్చే వస్తువుల గురించి, భోగాలను గురించి, భవిష్యత్ ప్రణాళికల గురించి, గతించిపోయిన విషయాల గురించి, వర్తమానంలోని కర్తవ్యాల గురించి ఎప్పుడూ ఆలోచనలు సాగిపోతూనే ఉంటాయి. కానీ, అలా ఉంటే.. మనసు లేనట్లే. అలాగని మనసును గుప్పెటలో పెట్టుకోవాలని ప్రయత్నిస్తే అది గాలిలాగా ఎగిరిపోతుంది. అందుకే భగవద్గీతలో అర్జునుడు "మనసు చంచలమైనది, గయ్యాళిది, గట్టిది. దాన్ని నిగ్రహించడం అంటే గాలిని మూటకట్టడంలాంటిదే" అన్నాడు. భగవానుడు కూడా ఆ విషయాన్ని అంగీకరిస్తూ.. 'ఓ అర్జునా.. మనసు చంచలమైనది, నిగ్రహించడం చాలా కష్టం అనే మాటలో ఎలాంటి సంశయం లేదు. అయినప్పటికీ.. అభ్యాసం, వైరాగ్యం అనే రెండు ఆయుధాలతో దాన్ని వశపరచుకోవాలి" అని చెప్పాడు. అంతకష్టమైన మనో నిగ్రహాన్ని సాధించడానికి రమణులు ఒక ఉపాయాన్ని చెప్పారు. అదే.. 'వాయురోధనాత్..' అంటే ప్రాణవాయువును నియంత్రించే పద్ధతి. దీన్నే ప్రాణాయామం అంటారు. ఇందులో శ్వాసను అదుపులో ఉంచడాన్ని అభ్యాసం చేస్తారు. మనసును నిగ్రహించడం ఎందుకింత కష్టం? అంటే.. మనసును నిగ్రహించాల్సింది మనసే కావడం ఇందుకు కారణం. అందుకు ప్రాణాయామం ఉపయోగపడుతుంది. అయితే అది పతంజలి మహర్షి చెప్పిన ప్రాణాయామం కాదు. దాన్ని గురువు వద్ద ప్రత్యక్షంగా నేర్చుకుని, గురువుల పర్యవేక్షణలో సాధన చేయాలి. నేర్చుకోకుండా స్వయంగా చేస్తే ప్రమాదకరం. రమణులు చెప్పిన ప్రాణాయామం.. ప్రత్యేకమైనది. దాన్ని 'ప్రాణేక్షణ' అంటారు. దాన్ని ఎవరైనా చేయొచ్చు. గురువుతో పని లేదు. అందులో చేయవలసిందంతా ఏమిటంటే.. మనసును మన ఉచ్ఛ్వాస, నిశ్వాసలపై లగ్నం చేయడమే. రోజూ ఇలా చేస్తుంటే మనసులో ప్రశాంతత పెరుగుతుంటుంది. అలాంటి ప్రశాంతత మళ్లీమళ్లీ కావాలని మనసు ఆరాటపడుతుంది. ప్రాణాయామం సహజంగా జరిగిపోతూ.. మనసు హృదయస్థానంలో నిలిచిపోవడానికి (హృత్స్థలే మనః) సాధనమవుతుంది.

- దేవిశెట్టి చలపతిరావు, care@srichalapathirao.com

# గోదావరి శుద్ధికి 2178 కోట్లు

- అర్బన్ వ్యర్థాలతో నదీ జలాలు కలుషితం
- ఏపీలోని 5 నదుల్లో కలుషిత ప్రాంతాల గుర్తింపు
- టీడీపీ ఎంపీ కనకమేడల ప్రశ్నకు కేంద్రం జవాబు

న్యూఢిల్లీ, అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో కలుషితమైన గోదావరి జలాలను శుద్ధి చేసేందుకు జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక(ఎన్‌ఆర్‌సీపీ) కింద రూ.2178.60 కోట్లు మంజూరు చేసినట్టు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రతన్‌లాల్ కటారియా చెప్పారు. ఈ నిధుల ద్వారా 30 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురికినీటి శుద్ధి ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. రాజ్యసభలో టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సోమవారం లిఖిత పూర్వకంగా జవాబిచ్చారు. నగరాలు, పట్టణ ప్రాంతాల మురుగు, రసాయన వ్యర్థాలతో దేశంలోని అనేక నదులు కలుషితమవుతున్నాయన్నారు. ఏపీలోని గోదావరి, కృష్ణా, నాగావళి, తుంగభద్ర, కుందు నదుల్లో నీటి కలుషిత ప్రదేశాలను గుర్తించినట్టు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్రాల కాలుష్య నియంత్రణ మండళ్లు, కాలుష్య నియంత్రణ కమిటీల పర్యవేక్షణలో నదుల్లో నీటి నాణ్యతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) 2018 సెప్టెంబరులో సమర్పించిన నివేదిక ప్రకారం దేశంలో మొత్తం 323 నదులు ఉండగా, వాటిలో కాలుష్యం కలిసే 351 ప్రాంతాలను గుర్తించినట్లు వివరించారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు నదీజలాలను శుద్ధి చేస్తున్నామన్నారు.

### కృష్ణా, గోదావరి క్లీనింగ్ మిషన్‌కు డీపీఆర్

'ఏపీ మిషన్ ఫర్ కృష్ణా, గోదావరి కెనాల్స్ క్లీనింగ్'కు డీపీఆర్‌లు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ మిషన్ నిర్వహణకు అవసరమైన డీపీఆర్‌ల తయారీకి రూ.10కోట్లు, మిషన్ ప్రాథమిక పనులకు రూ.1.24 కోట్లు విడుదల చేస్తూ సోమవారం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఇతర శాఖల సహకారంతో ఈ మిషన్‌ను నిర్వహించనున్నారు.

# భూములిచ్చిన పాపానికి జైల్లో పెడుతున్నారు

- సామాజిక వర్గమనే నిందలేస్తున్నారు
- సీఎం అసమర్థతను కప్పిపుచ్చేందుకే కుల ప్రస్తావన
- అమరావతి రైతుల ధ్వజం
- 90వ రోజు కొనసాగిన ఆందోళనలు
- పారాసిటమల్, బ్లీచింగ్ పౌడర్‌తో నిరసన

గుంటూరు, తుళ్లూరు, తాడికొండ, మంగళగిరి, మార్చి 16: ముఖ్యమంత్రి జగన్ తన అసమర్థతను కప్పి పుచ్చుకోవటానికి అన్నిటికీ కులాన్ని ఆపాదిస్తున్నారని అమరావతి ప్రాంత రైతులు మండిపడ్డారు. అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలంటూ రైతులు, రైతుకూలీలు చేస్తున్న ఆందోళనలు సోమవారం 90వ రోజుకు చేరాయి. తుళ్లూరు, మందడంలో మహాధర్నాలు, వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, యర్రబాలెం, తాడికొండ అడ్డరోడ్డు, పెదపరిమి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు కొనసాగించారు. 'అమరావతి అభివృద్ధి చెందితే ఒకే సామాజిక వర్గం అభివృద్ధి చెందుతుందని దుష్ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు అదే కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలను మీ పార్టీలో ఎందుకు చేర్చుకుంటున్నారు?' అని మహిళలు, రైతులు సీఎం జగన్‌ను ప్రశ్నించారు. అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతిని పురస్కరించుకొని దీక్ష శిబిరాల్లో సోమవారం ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తిగా అమరావతి కోసం పోరు చేస్తామని ప్రతినబూనారు. రాయపూడి పుష్కర ఘాట్ వద్ద శివాలయానికి 108 బిందెలతో కృష్ణా జలాలను తీసుకొచ్చి మహిళలు జలాభిషేకం నిర్వహించారు. అలాగే, కరోనాపై సీఎం వ్యాఖ్యలను తప్పుపడుతూ బ్లీచింగ్ ప్యాకెట్లు, పారాసిటమల్ ట్యాబ్లెట్లు చూపుతూ మహిళలు నిరసన తెలిపారు. వెలగపూడి, మందడం రాయపూడి, పెదపరిమి, తుళ్లూరు ధర్నా శిబిరాలను జాతీయ కిసాన్ సంఘ్ సభ్యులు సందర్శించి సంఘీభావం తెలిపారు. రైతుల ఆందోళనలను జాతీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని సంఘ్ జాతీయ కార్యదర్శి భద్రి నారాయణ చౌదరి చెప్పారు. రైతుల దీక్షలకు టీడీపీ నేతలు నన్నపనేని రాజకుమారి, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు సంఘీభావం తెలిపారు.





రాయపూడిలో 108 బిందెలతో కృష్ణా జలాలను తీసుకొస్తున్న మహిళలు.. పారాసిటమల్, బ్లీచింగ్ పౌడర్‌తో నిరసన

### దీక్ష శిబిరానికి 10 ఫ్యాన్లు వితరణ..

ఎండాకాలం రానున్న నేపథ్యంలో పెదపరిమిలో తాటాకుతో కొత్త శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వికలాంగుల సంఘం మాజీ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరావు ఈ శిబిరానికి 10 సీలింగ్ ఫ్యాన్‌లను అందజేశారు. మందడం, వెలగపూడి దీక్షా శిబిరాల్లో సీపీఐ నేత రామకృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్ శాడిస్టుగా మారుతున్నారని విమర్శించారు.

### 20 రోజులు జైల్లో మగ్గిన రాజధాని రైతులు

- డ్రోన్ కేసులో ఎట్టకేలకు విడుదల

గుంటూరు, మార్చి 16: రాజధాని ప్రాంతంలోని మందడం గ్రామంలో ఇళ్లపై డ్రోన్ ద్వారా వీడియో చిత్రీకరణను అడ్డుకున్న కేసులో అరెస్టయిన రైతులు ఎట్టకేలకు సోమవారం విడుదలయ్యారు. ఈ కేసులో 46 మంది రైతులు జైలుపాలు కాగా.. కొందరు ఇదివరకే విడుదలయ్యారు. సోమవారం జిల్లా జైలు నుంచి విడుదలైనవారిని జైలు వద్ద జేఏసీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ముప్పాళ్ల నాగేశ్వరరావు, మన్నవ సుబ్బారావు, గద్దె తిరుపతిరావు, డాక్టర్ నందకిశోర్, లాల్ వజీర్ తదితరులు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు.

## లోకం తీరు




### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 38.0 | 22.4 |
| కర్నూలు | 37.3 | 23.3 |
| గుంటూరు | 35.5 | 24.2 |
| విజయవాడ | 34.8 | 22.6 |
| హైదరాబాద్ | 33.1 | 21.1 |
| విశాఖపట్నం | 33.2 | 23.0 |
| శ్రీకాకుళం | 32.0 | 25.0 |

### ఉత్తర కోస్తాకు వర్షసూచన

విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న ఇరవై నాలుగు గంటల్లో ఛత్తీస్‌గఢ్ దానికి ఆనుకుని వున్న ఉత్తర కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం వుందని, దక్షిణ కోస్తా, రాయలసీమలో మాత్రం పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. తరువాత రెండు, మూడు రోజుల పాటు ఉత్తర కోస్తాలో ఉరుములతో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. కాగా సోమవారం కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత కొనసాగింది. అనంతపురంలో 37.5, కర్నూలులో 37 డిగ్రీలు నమోదైంది.



### పాశ్చాత్య ధోరణి ప్రమాదకరం

ఆధునికత ముసుగులో పాశ్చాత్య ధోరణిని ఆమోదించడం సమాజానికి ప్రమాదకరం. ఆధునికత, పాశ్చాత్య ధోరణిలో తేడాను గుర్తించాలి. కుటుంబ పద్ధతులు, పర్యావరణం, నీటి వినియోగం, చెట్ల పెంపకం, ప్లాస్టిక్‌ను తగ్గించడంపై ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణా తరగతులు నిర్వహిస్తుంది.

- సురేశ్ జోషి, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి



### నవాజ్ షరీఫ్ భారత్‌పై మాట పడనీయలేదు

భారత్‌పై మాట పడనీయకుండా నాటి పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ చూశారు. కులభూషణ్ యాదవ్‌కు వ్యతిరేకంగా పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా కట్టడి చేశారు. షరీఫ్‌కు భారత్‌తో వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. అందుకే ఆయన భారత్‌కు అనుకూలంగా వ్యవహరించారు.

- తస్నీమ్ అస్లమ్, పాకిస్థాన్ మాజీ రాయబారి

### కష్టకాలపు జీవితఘట్టాలే భవిష్యత్తుకు ప్రాతిపదిక

లండన్, మార్చి 16 : జీవితం అన్న తర్వాత కష్టాలు, సుఖాలు అన్నీ ఉంటాయి!! అయితే కష్టనష్టాలు, బాధ, మానసిక ఒత్తిడి, అసమానత, ఆర్థిక సమస్యలు, కుటుంబపరమైన అంశాలతో ముడిపడిన ప్రతీ జీవితఘట్టం భవిష్యత్తులో మన జీవనగతిపై ప్రభావం చూపిస్తుందని బ్రిటన్‌లోని ఈస్ట్ ఆంగ్లియా వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రధానంగా రాబోయే రోజుల్లో మన శారీరక ఆరోగ్యం, మానసిక స్థితిగతులు రూపుదిద్దుకునేందుకు ఈ జీవిత అనుభవాలే ప్రాతిపదికలుగా నిలుస్తాయని తెలిపారు. 7,555 మందిపై అధ్యయనం అనంతరం ఈవిషయాన్ని వెల్లడించారు.




### టైప్-1 మధుమేహం ఒకటి కాదు.. రెండు రకాలు!!

లండన్, మార్చి 16 : టైప్-1 మధుమేహుల్లో రెండు వేర్వేరు రకాల ఆరోగ్య స్థితిగతులు కలిగిన వారు ఉంటారని బ్రిటన్‌లోని ఎక్సెటర్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఏడేళ్లలోపు మధుమేహుల్లో ఇన్సులిన్ ఉత్పత్తి అసలు జరగదని.. పైగా ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలు త్వరగా నశిస్తుంటాయని తాజా అధ్యయనంలో గుర్తించారు. ఇందుకు పూర్తి భిన్నంగా 13 ఏళ్లకు పైబడిన మధుమేహుల్లో కనీసం అప్పుడప్పుడైనా ఇన్సులిన్ ఉత్పత్తి అయ్యే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఏడేళ్లలోపు మధుమేహులు ఎదుర్కొనే స్థితిని టైప్1 డయాబెటిస్ ఎండోటైప్1(టీ1డీఈ1)గా.. 13 ఏళ్లకు పైబడిన మధుమేహుల స్థితికి టైప్1 డయాబెటిస్ ఎండోటైప్2(టీ1డీఈ2)గా పేరుపెట్టారు.

## ఇంజనీరింగ్ గరిష్ఠ ఫీజు రూ.69 వేలే

- నేడు సర్కారుకు సిఫారసులు
- నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ఏడాదికే పరిమితం
- కమిషన్ రెగ్యులేషన్స్‌కు సవరణ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ఫీజులకు సంబంధించిన సిఫారసులను ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. 2019-20 విద్యా సంవత్సరానికి మాత్రమే వర్తించేలా ఈ సిఫారసులు ఉండనున్నాయి. తాజాగా సీఎం వద్ద జరిగిన సమావేశం తర్వాత ప్రతిపాదిత ఫీజుల్లో పలు మార్పులు చేశారు. కనిష్ఠ ఫీజుగా రూ.35 వేలలో మార్పు లేకపోయినా కాలేజీల సంఖ్యను మాత్రం భారీగా పెంచారు. గరిష్ఠ ఫీజును తొలుత రూ.99 వేలుగా, తర్వాత రూ.75 వేలుగా, ఇప్పుడు రూ.69 వేలుగా తగ్గించి సిఫారసు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అమల్లో ఉన్న ఫీజులపై భారీగా కోతలు పెట్టి మరీ ఫీజులను ప్రతిపాదించారు. రాష్ట్ర వ్యాప్తంగా 287 ఇంజనీరింగ్ కాలేజీలకు ఫీజులు నిర్ణయించాల్సి ఉండగా.. 281 కాలేజీలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం.. 183 కాలేజీలకు రూ.35 వేలు, 37 కాలేజీలకు రూ.35 వేలు-రూ.45 వేలు, 30 కాలేజీలకు రూ.45వేలు-రూ.55 వేలు, 11 కాలేజీలకు రూ.55 వేలు-రూ.65 వేలు, 20 కాలేజీలకు అత్యధికంగా రూ.65 వేలు-రూ.70 వేల మధ్య ఫీజును ప్రతిపాదించినట్లు తెలిసింది. వాస్తవానికి 2019-22 విద్యా సంవత్సరం వరకు అంటే మూడేళ్లకు ఫీజులు సిఫారసు చేయాల్సి ఉండగా.. ఉన్నత విద్య కమిషన్ కేవలం 2019-20 వరకే సిఫారసు చేస్తోంది. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధం కావడంతో.. 'కమిషన్ రెగ్యులేషన్స్-2020'కి సవరణ చేస్తూ ఉన్నత విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### జేఈఈ గ్రాండ్ టెస్ట్ సొల్యూషన్స్ ఫ్రీ!

ఐఐటీ-జేఈఈ ఫోరం, ప్రముఖ ఐఐటీ శిక్షణా సంస్థలు సంయుక్తంగా రూపొందించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2020 గ్రాండ్ టెస్ట్, కీ, సొల్యూషన్స్‌ని విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు ఫోరం కన్వీనర్ కె.లలిత్‌కుమార్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 9849016661కు 'ఏడీ గ్రాండ్ టెస్ట్' అని టైప్ చేసి వాట్సాప్ మెసేజ్ చేయాలని కోరారు.

### పోలవరం నిర్మాణానికి 8,514 కోట్లిచ్చాం

- ఇరిగేషన్ ఖర్చంతా మాదే: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటివరకు రూ.8,514.16 కోట్ల మేరకు ఆర్థిక సహాయం అందించామని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రతన్‌లాల్ కటారియా వెల్లడించారు. గత ఫిబ్రవరి నెలలో నాబార్డు ద్వారా ఇచ్చిన రూ.1,860 కోట్లు కూడా ఇందులో ఉన్నట్లు తెలపారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సాగునీటి పారుదలకు అయ్యే వ్యయాన్నంతా కేంద్రమే భరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాగా.. 2017-18 ధరవరలను(ప్రైస్ లెవెల్) పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టు తుది అంచనా వ్యయం రూ.55,548.87 కోట్లుగా ప్రతిపాదించినట్లు టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్‌కు కటారియా తెలిపారు. దీనిని జలసంఘం ఆధ్వర్యంలోని టీఏసీ ఆమోదించిందన్నారు. ప్రాజెక్టును 2021 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

### సీఎం ప్రెస్‌మీట్‌కు అడ్డుకోవడం సరికాదు

- ఖండించిన జర్నలిస్టు సంఘాలు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో జగన్ తొలిసారి నిర్వహించిన మీడియా సమావేశానికి కొన్ని పత్రికలు, టీవీ చానళ్ల ప్రతినిధులను అడ్డుకోవడాన్ని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(ఏపీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ) సంఘాల నేతలు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, అంబటి ఆంజనేయులు, సోమ సుందర్, ఆలపాటి సురేశ్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. సమాచారశాఖ అధికారుల వైఖరి గర్హనీయమని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత సమాచారశాఖ అధికారులపై ఉందని, ఈ విషయంలో ప్రభుత్వ వైఖరి మారకపోతే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయక తప్పదని పేర్కొన్నారు.

# విద్యుత్‌లో మాకూ వాటా!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఆర్థికశాఖ నియమించిన కమిటీ ఆ మొత్తానికి ఆమోదముద్ర వేయడం గమనార్హం. సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగానే పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు భవన నిర్మాణం (టర్బయిన్లు మినహా) పనులు ఉన్నాయి. వీటి ఖర్చును కూడా హెడ్‌వర్క్స్‌లో భాగంగానే కేంద్రం భరిస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో ఒకసారి కేంద్రం జల విద్యుత్‌లో వాటా కావాలని డిమాండ్ చేసింది. రాష్ట్రప్రభుత్వం అంగీకరించలేదు. మళ్లీ ఇప్పుడు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి అయ్యే 960 మెగావాట్లలో తనకూ వాటా ఉంటుందని ఇటీవల సూత్రప్రాయంగా రాష్ట్రం వద్ద ప్రతిపాదించింది. దీంతో రాష్ట్రప్రభుత్వం ఇరకాటంలో పడింది.

### 2017-18 ధరలకు ఓకే..

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2017-18 ధరల ప్రకారం తుది అంచనా వ్యయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ కమిటీ ఆమోదించింది. రూ.47,725.74 కోట్లలో సాగుకు రూ.35,950.16 కోట్లు (భూసేకరణతో కలిపి), నీటి సరఫరాకు (కాలువల నిర్మాణం) రూ.7,214.67 కోట్లు, జల విద్యుత్ కోసం రూ.4,560.91 కోట్లకు ఆమోదం తెలిపింది. వాస్తవానికి కేంద్ర జలసంఘం సాగు నీరు, నీటి సరఫరా కోసం రూ.51,095.96 కోట్లకు ఆమోదం తెలిపింది. ఆర్థికశాఖ కమిటీ మాత్రం రూ.43,164.83 కోట్లకే పరిమితం చేసింది. భూసేకరణ వ్యయాన్ని బాగా తగ్గించేసింది. తొలి నుంచీ భూ సేకరణ వ్యయం అధికంగా ఉందని కేంద్రం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉంది.

**వివిధ సంవత్సరాల్లో ధరవరలు ఇలా.. (రూ.కోట్లలో)**

| కాంపోనెంట్ | 2010-11 ప్రాజెక్టు అంచనా | 2013-14 కేంద్ర జల సంఘం అంచనా | 2013-14 కేంద్ర ఆర్థిక శాఖ సిఫారసు | 2017-18 కేంద్ర జల సంఘ సిఫారసు | 2017-18 కేంద్ర ఆర్థిక శాఖ కమిటీ సిఫారసు |
|---|---|---|---|---|---|
| ఇరిగేషన్ | 9307.54 | 26158.04 | 20398.61 | 51095.96 | 35950.16 |
| నీటి సరఫరా | 2986.86 | --- | 4068.43 | --- | 7214.67 |
| విద్యుత్ | 3716.05 | 4560.91 | 4560.91 | 4560.91 | 4560.91 |
| మొత్తం | 16010.45 | 30718.95 | 29027.95 | 55656.87 | 47725.74 |

### జగన్ సర్కారు స్వయంకృతమే!

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టు తుది అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లుగా పేర్కొంటూ కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదనలు పంపింది. దీనిని కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) పరిశీలించి ఆమోదించింది. అయితే కమీషన్ల కోసమే చంద్రబాబు ప్రభుత్వం తుది అంచనా వ్యయాన్ని భారీగా పెంచిందని నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపణలు చేశారు. కానీ తాను అధికారంలోకి వచ్చాక.. ఇదే మొత్తాన్ని తుది అంచనా వ్యయంగా ఆమోదించాలని కేంద్రాన్ని కోరడం గమనార్హం. అయితే కేంద్ర ఆర్థికశాఖ దీనిపై కమిటీని నియమించింది. ఏకంగా రూ.7931.13 కోట్లకు కోతపెట్టింది. ఇంత భారీగా కత్తెరవేసినందుకు రాష్ట్రం అభ్యంతరం వ్యక్తం చేయాలి. కానీ జగన్ ప్రభుత్వం దీనికే ఆమోదం తెలపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది జగన్ సర్కారు స్వయంకృతమేనని జలవనరుల నిపుణులు అంటున్నారు. విపక్షంలో ఉన్నప్పుడు లేనిపోని ఆరోపణలు చేశారని.. ఇంత భారీగా అంచనాలు ఎలా పెంచుతారని కేంద్రానికి పదే పదే ఫిర్యాదులు చేశారు. ఇప్పుడు అదే కేంద్ర కమిటీ అంచనా వ్యయాన్ని తగ్గించేయడంతో.. ఈ నిధులతోనే సరిపుచ్చుకోవలసిన దుస్థితి నెలకొందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# సిమెంటు ధరలు తగ్గింపు

- పీపీసీ బస్తా 225.. సాధారణం 235
- ప్రభుత్వ పనులు, పేదల ఇళ్లు, పోలవరం ప్రాజెక్టు పనులకు..
- కంపెనీల ప్రకటన.. సీఎంతో భేటీ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనులు, పేదలకు ఇళ్ల నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులకు సిమెంటు ధరలను తగ్గిస్తున్నట్లు సిమెంటు కంపెనీలు ప్రకటించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారమిక్కడ ఆయా కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా ఆయన చేసిన విజ్ఞప్తి మేరకు ధరలు తగ్గిస్తున్నామని ప్రతినిధులు తెలిపారు. సిమెంటు(పీపీసీ) బస్తా ధర రూ.225, ఓపీసీ సిమెంటు బస్తా రూ.235కి ఇస్తామని.. గత నాలుగేళ్లతో పోలిస్తే ఈ ధరలు తక్కువని చెప్పారు. ప్రస్తుత మార్కెట్‌లో సిమెంటు బస్తా ధర రూ.380 వరకు ఉందని, ఈ పనులకు మాత్రం తగ్గించి ఇస్తామని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ పనులు, పేదల ఇళ్లకు అవసరమయ్యే సిమెంటు లెక్కలను అధికారులు వారికి తెలియజేశారు. గృహనిర్మాణ శాఖకు 40 లక్షల మెట్రిక్ టన్నులు, పంచాయతీరాజ్ శాఖకు 25 లక్షల మెట్రిక్ టన్నులు, జలవనరుల శాఖకు 16.5 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని పేర్కొన్నారు. తక్కువ ధరలతో ఇచ్చే సిమెంటు బస్తా ప్రత్యేక రంగులో ఉండాలని.. ప్రభుత్వ విభాగాలు తమ అవసరాలను సంబంధిత జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాయని, కలెక్టర్ ద్వారా ఈ సిమెంటు పంపిణీ అవుతుందని సీఎం తెలిపారు. సమావేశంలో జువారి, భవ్య, సాగర్, కేసీపీ, రైన్, భారతి, అల్ట్రాటెక్, జేఎస్‌డబ్ల్యూ, శ్రీచక్ర, ఇండియా, మైహోం, రాంకో, పెన్నా, దాల్మియా, ఆదిత్య బిర్లా, చెట్టినాడ్, పాణ్యం, పరాశక్తి, ఎన్‌సీఎల్ సిమెంటు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సిమెంట్ కంపెనీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం జగన్

### రాజ్యసభ నామినేషన్లు అన్నీ ఆమోదం

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఖాళీ అయ్యే నాలుగు స్థానాలకు ఈనెల 26వ తేదీన పోలింగ్ జరగనుంది. అధికార వైసీపీ తరపున మంత్రులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణారావు, పారిశ్రామికవేత్తలు అయోధ్యరామిరెడ్డి, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ సన్నిహితుడు పరిమళ్ నత్వాల్ బరిలో ఉన్నారు. వైసీపీకి 151 శాసనసభా స్థానాలు ఈ నాలుగు స్థానాలూ ఈ నలుగురికీ ఏకగ్రీవం అవుతాయని భావించారు. కానీ 23 శాసనసభా స్థానాలు కలిగిన తెలుగుదేశం పార్టీ ఆకస్మికంగా వర్ల రామయ్య అభ్యర్థిగా రంగంలోకి దింపింది. సోమవారం ఈ నామినేషన్ల పరిశీలించి అన్నింటినీ ఆమోదించినట్లుగా అసెంబ్లీ కార్యదర్శి, రిటర్నింగ్ అధికారి బాలకృష్ణమాచార్యులు వెల్లడించారు. అయితే ఈ నెల 18 వరకూ నామినేషన్ల ఉపసంహణకు గడువు ఉంది.

### లే అవుట్ రికార్డు కోసమే అడిగాం

- కరిజ్మా ఆల్బమ్‌పై సర్వే డైరెక్టర్ వివరణ.. 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పేదల ఇంటిస్థలాల లే అవుట్‌లను భద్రపరిచేందుకే కరిజ్మా ఆల్బమ్ సైజ్‌లో సాఫ్ట్‌కాపీని రూపొందించాలని జిల్లా అధికారులను కోరినట్లు సర్వే, సెటిల్‌మెంట్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది కేవలం రికార్డుకోసమే తప్ప ఎలాంటి ఆల్బమ్‌లను తయారు చేయమని ఆదేశించలేదని వివరణ ఇచ్చారు. పేదల ఇంటిస్థలాల లే అవుట్‌లను ఫొటోలు తీసి కరిజ్మాఆల్బమ్‌లను తయారు చేయాలన్న ఆదేశాలను ప్రస్తావిస్తూ 'కాసులు లేకున్నా.. కళాపోషణ' పేరిట 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించింది. దీనిపై సర్వే డైరెక్టర్ వివరణ ఇస్తూ ఆల్బమ్‌లను రూపొందించమని చెప్పలేదన్నారు. వాటి సాఫ్ట్‌కాపీలను పంపించమని మాత్రమే కోరినట్లు తెలిపారు. ఇది కేవలం రికార్డుల కోసమేనని పేర్కొన్నారు.



విద్యుత్‌సౌధలో నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ ఉద్యోగులు

## ఆంధ్ర ఉద్యోగులను రానివ్వం

- రిలీవై వెళ్లినవారిని అడ్డుకున్న తెలంగాణ విద్యుత్ సిబ్బంది
- విద్యుత్‌సౌధలో తీవ్ర ఉద్రిక్తత
- ఏపీ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ డీఎం ధర్మాధికారి ఉత్తర్వులతో ఆంధ్రప్రదేశ్ నుంచి రిలీవై.. తెలంగాణలో రిపోర్టు చేయడానికి వచ్చిన 655 మంది ఏపీ ఉద్యోగులను తెలంగాణ విద్యుత్ సంస్థల సిబ్బంది అడ్డుకున్నారు. వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ రానిచ్చేది లేదని స్పష్టం చేశారు. ఉద్యోగుల విభజనలో 655 మంది ఏపీ ఉద్యోగులను తెలంగాణకు కేటాయించడాన్ని నిరసిస్తూ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, తెలంగాణ విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారమిక్కడి విద్యుత్ సౌధ ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శన చేపట్టారు. ఇదే క్రమంలో తెలంగాణ విద్యుత్ సంస్థల్లో రిపోర్టు చేయడానికి వచ్చిన ఏపీ ఉద్యోగులను గేటు వద్దే అడ్డుకున్నారు. పరిస్థితి చేజారిపోతుండడంతో పోలీసులు ఏపీ ఉద్యోగులను అదుపులోకి తీసుకుని.. అక్కడి నుంచి తరలించారు. అంతకుముందు తెలంగాణవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులు, కార్మికులు తరలిరావడంతో విద్యుత్ సౌధ వద్ద కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏపీ స్థానికత కలిగిన ఆంధ్రా ఉద్యోగులను తెలంగాణ విద్యుత్ సంస్థలు ఎట్టి పరిస్థితుల్లోనూ విధుల్లోకి తీసుకోవద్దని, జస్టిస్ ధర్మాధికారి తీర్పును పునఃసమీక్షించాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. 'మా రాష్ట్రానికి రావద్దు... మీ రాష్ట్రానికి వెళ్లిపోండి.. విద్యుత్ ఉద్యోగుల విభజన స్థానికత ప్రాతిపదికనే జరగాలి. ఆంధ్ర ఉద్యోగులారా... ఎంత వద్దన్నా తెలంగాణకు వస్తున్నారు.. సిగ్గులేదా..' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. మంగళవారం నుంచి ఈ నెల 31 వరకు తెలంగాణలోని అన్ని జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యదర్శి సదానందం ప్రకటించారు. అయినా స్పందన రాకపోతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

## 'మద్యం సీసాల' నిందితులు అరెస్టు

తెనాలి అర్బన్, మార్చి 16: గుంటూరు జిల్లా తెనాలి నాలుగో వార్డు టీడీపీ అభ్యర్థి ఇంటిలో మద్యం సీసాలు పెట్టిన కేసులో ఇరువురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సీఐ బి.శ్రీనివాసరావు ఈ వివరాలు వెల్లడించారు. గాంధీనగర్‌లోని అడుసుమల్లి వెంకటేశ్వరరావు గృహంలోకి నిందితులు అక్రమంగా ప్రవేశించి ఈ నెల 13న ఒక కేసు మద్యం సీసాలను పెట్టారు. సీసీ ఫుటేజ్ పరిశీలించి విచారించగా కఠెవరం గ్రామానికి చెందిన మేకతోటి భానుప్రకాశ్, కోట రవికుమార్‌లను గుర్తించి అరెస్టు చేశామన్నారు.

## శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.1.11 కోట్ల విరాళం



టీటీడీ ఈవోకు విరాళం డీడీ అందిస్తున్న సుధాకరరెడ్డి దంపతులు

తిరుపతి సిటీ, మార్చి 16: టీటీడీ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి హైదరాబాదుకు చెందిన సుధాకరరెడ్డి, నీరజరెడ్డి దంపతులు సోమవారం రూ.1.11కోట్లు విరాళంగా అందించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో వారు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను కలిసి ఈ మొత్తానికి సంబంధించిన డీడీ అందజేశారు.

## 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 25న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఈ సందర్భంగా ఆరోజున ఉదయం జరిగే అష్టదళ పాదపద్మారాధన సేవను రద్దు చేశారు.

## కౌలురైతు ఆత్మహత్య

వట్టిచెరుకూరు, మార్చి 16: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులో కౌలు రైతు చీరబోయిన సుబ్బారావు (40) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. మిర్చిసాగు చేసిన సుబ్బారావుకు రూ.10 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ఈ ఏడాది ఐదెకరాల్లో మిరప సాగు చేయగా పంట దిగుబడి, నాణ్యత లేకపోవడంతో ధర రాలేదు. దీంతో సుబ్బారావు మనస్తాపానికి గురై ఈనెల 10వ తేదీన పురుగు మందు తాగగా...గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వట్టిచెరుకూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఈ ఏడాది ఇద్దరికి గొల్లపూడి పురస్కారాలు

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక గొల్లపూడి శ్రీనివాస్ జాతీయ పురస్కారానికి 2019 సంవత్సరానికి గాను ఇద్దరు నూతన దర్శకులు ఎంపికయ్యారు. హిందీ చిత్రం 'ఉరి' దర్శకుడు ఆదిత్యదార్, మలయాళ చిత్రం 'కుంబలంగి నైట్స్' దర్శకుడు మధు సి.నారాయణన్‌లను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు గొల్లపూడి శ్రీనివాస్ మెమోరియల్ ఫౌండేషన్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు 12వ తేదీన పురస్కార ప్రధానోత్సవం జరుగుతుంది. ప్రతి ఏటా ఉత్తమ నూతన దర్శకుడికి అందజేసే ఈ అవార్డుకు వివిధ భాషల నుంచి 22 నామినేషన్లు వచ్చాయి. గొల్లపూడి శ్రీనివాస్ తండ్రి, ప్రముఖ నటుడు, రచయిత మారుతీరావు లేకుండా జరుగనున్న తొలి అవార్డు కార్యక్రమం ఇదే.

# రాష్ట్రంలో పొలిటికల్ టెర్రరిజం

- నేలకొరిగిన 'మూల స్తంభాలు'
- న్యాయవ్యవస్థ కూడా కూలితే రాచరికమే
- ఎన్నికల కమిషనర్‌కు కులం ఆపాదించడం దుర్మార్గం
- రాజ్యాంగ సంస్థలను అపహాస్యం చేస్తున్నారు
- విజయసాయి బెయిల్‌ను సీబీఐ కోర్టు రద్దు చేయాలి
- కండిషన్ బెయిల్‌పై ఉన్న నిందితుడు రాజ్యాంగ వ్యవస్థలను బెదిరిస్తారా?
- టీడీపీ ప్రజాప్రతినిధుల విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వర్ల, సోమిరెడ్డి, దేవినేని

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): "రాష్ట్రంలో ప్రస్తుతం పొలిటికల్ టెర్రరిజం నడుస్తోంది. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ఈ టెర్రరిజం కాలరాస్తోంది. మాట వినని వారిని బెదిరించడం, భయపెట్టడం.. అప్పటికీ వినకుంటే దాడులు చేయడం, కొట్టడం, తప్పుడు కేసులను బనాయించడం... అంతిమంగా ఆర్థిక మూలాలను దెబ్బతీయడం వంటి ఘోరాలకు పాల్పడుతున్నారు" అని టీడీపీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జరగుతున్న ఉల్లంఘనలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. వైసీపీకి ఏకగ్రీవమైన స్థానాలకు రీ నోటిఫికేషన్ ఇచ్చి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు తీసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. జగన్ అధికారంలోకి వచ్చాక శాసన, కార్యనిర్వాహక, పత్రికా వ్యవస్థలు నేలకొరిగాయన్నారు. ఆశాదీపంలా నిలిచి ఉన్న న్యాయవ్యవస్థ కూడా నేలకూలితే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కనుమరుగై రాచరికమే మిగులుతుందన్నారు. అప్పుడు జగన్మోహన్‌రెడ్డి రాజుగా, మంత్రులంతా సామంతుల్లా, జమీందారుల్లా, పాలెగాళ్లలా కొనసాగుతారని దీపక్‌రెడ్డి అన్నారు. "విజయసాయి రెడ్డి కండిషన్ బెయిల్‌పై ఉన్న నిందితుడు. ఆయన రాజ్యాంగ వ్యవస్థలను నిందిస్తూ విలేకరుల సమావేశాలు ఎలా నిర్వహిస్తారు? ఈ నేరానికి ఆయనకు ఇచ్చిన బెయిల్‌ను సీబీఐ కోర్టు రద్దు చేయాలి" అని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. కండిషన్ బెయిల్‌పై ఉన్న వ్యక్తి వ్యవస్థలను శాసిస్తున్నారనీ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను భయపెట్టాలని చూస్తున్నారనీ విమర్శించారు. బెయిల్ నిబంధనలను ధిక్కరించినందుకు విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని, బెయిల్ రద్దు చేయడంతో పాటు ఎన్నికల కమిషనర్‌పై బెదిరింపులకు దిగినందుకు వెంటనే అరెస్టు చేయాలని వర్ల డిమాండ్ చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డికి కూడా ఇదే సూత్రం అమలవుతుందని వర్ల అన్నారు. రాజమహేంద్రవరంలో టీడీఎల్పీ ఉపనేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడారు. ఎన్నికల సంఘాన్ని శాసించే హక్కు తనకు లేదన్న విషయం జగన్మోహన్‌రెడ్డికి ఎందుకు అర్థం కావడం లేదని ప్రశ్నించారు. రెండు వేల ఎంపీటీసీలు ఏకగ్రీవమయ్యాయంటే ఎన్నికలను ఎంత దుర్వినియోగం చేశారో అర్థమవుతుందన్నారు. వైఎస్ హయాంలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా చేసిన నిమ్మగడ్డ రమేశ్ ఇప్పుడు ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారని అన్నారు. ఎన్నికల వాయిదాను రాజకీయం చేస్తూ ఆయన కులం గురించి మాట్లాడడం దారుణమన్నారు. దేశ చరిత్రలో వ్యవస్థలను నాశనం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని మరో ఎమ్మెల్సీ బీ చెంగల్రాయుడు అన్నారు. కులం పేరు చెప్పి స్వతంత్రంగా నడుచుకొనే ఎన్నికల కమిషన్‌ను నిలువరించాలని చూడడం సీఎంకు సరికాదన్నారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి, పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకోవడానికి అవసరమైనపుడల్లా కులాల ప్రస్తావన తీసుకురావడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. మాఫియా సామ్రాజ్యం చేతిలో రాష్ట్రంలో పాలన నడుస్తోందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థకు కమిషనర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై సీఎం హోదాలో జగన్ ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. మరో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నెల్లూరులో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో పోలీసులు, అధికారులు ప్రవర్తించిన తీరు ఒక విధంగా ఉంటే సీఎం జగన్ తీరు మరింత దారుణంగా ఉందన్నారు. ప్రక్రియ మొత్తం అయిపోయిందని, కేవలం ఎన్నిక తేదీనే వాయిదా పడిందనీ, దీనికే ఇంత ఫ్రస్టేషన్ ఎందుకని ఆయన జగన్‌ని ప్రశ్నించారు. సీఎం స్థాయిలో ఇలా దిగజారిపోయి మాట్లాడడం, ప్రవర్తించడం రాష్ట్రానికే మంచిది కాదని సోమిరెడ్డి అన్నారు. మరో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడితో కలిసి విజయవాడలో మాట్లాడారు. సీఎం జగన్ రెడ్డి రాగద్వేషాలకు అతీతంగా పనిచేస్తానని ప్రమాణం చేసి, ఇపుడు రాజ్యాంగ సంస్థలను అపహాస్యం చేస్తూ మాట్లాడుతున్నారని విమర్శించారు. కరోనా వైరస్‌పై సీఎం బాధ్యతారాహిత్యంతో మాట్లాడుతున్నారన్నారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు... కరోనాను పారద్రోలటానికి పారసెటమాల్ టాబ్లెట్, బ్లీచింగ్ పౌడర్ చాలని చెప్పడాన్ని ఎద్దేవా చేశారు. తన రాజకీయ జీవితంలో ఇంత దౌర్భాగ్యపు ఎన్నికలను చూడలేని విశాఖలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ హక్కులను ప్రశ్నించిన సీఎం త్వరలో హైకోర్టు కూడా అక్కర్లేదని అంటారేమోనని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి అనుమానం వ్యక్తం చేశారు.

# కోడ్ ఉంటే.. నాకేంటి?

వలంటీర్లతో మంత్రి జయరాం సమావేశం.. ఎన్నికల పనులు, ప్రత్యర్థుల బలాబలాలపై చర్చ!

- ఎన్నికలపై రెండ్రోజుల్లో ఆదేశాలు వస్తాయని వెల్లడి
- టీడీపీ ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఆర్‌వో

కర్నూలు, కాకినాడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా కర్నూలు జిల్లాలో మంత్రి జయరాం ఏకంగా నివాసంలోనే గ్రామ వలంటీర్లతో సమావేశం పెట్టారు! ప్రత్యర్థుల బలాబలాలు, ఎన్నికల్లో చేయాల్సిన పనులు, అభ్యర్థుల సమస్యలపై మంత్రి మాట్లాడినట్లు సమాచారం. ఆ సమావేశానికి సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతోంది. ఎన్నికలు వాయిదా పడ్డా.. డీలా పడవద్దని, రెండ్రోజుల్లో తిరిగి ఎన్నికల కమిషనే ఈ వాయిదాను రద్దు చేయనుందని సమావేశంలో పాల్గొన్న వారికి చెప్పుకొచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ సమావేశం, కోడ్ ఉల్లంఘనపై స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారికి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఫిర్యాదును తీసుకోవడానికి ఆర్‌వో నిరాకరించినట్లు సమాచారం. రుజువుల కోసం ప్రశ్నించగా సమావేశం వీడియో క్లిప్పింగులను నాయకులు చూపించారు. దీంతో... తెలియక తప్పు చేసుంటారని, ఫిర్యాదును వెనక్కు తీసుకుంటే తానే వ్యక్తిగతంగా ఆ ఉద్యోగులను మందలిస్తానని ఆర్‌వో చెప్పడం గమనార్హం.



ఎన్నికల ప్రచారంలో వలంటీర్ గురుమూర్తి

## ఇళ్ల స్థలాలపై సీఎం కార్యదర్శి సమీక్ష

మరోవైపు ఇళ్ల స్థలాల పంపిణీపై సోమవారం తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో సీఎం కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి రహస్యంగా సమీక్ష నిర్వహించడం చర్చనీయాంశమైంది. కలెక్టర్ మురళీధర్‌రెడ్డి, జేసీ, జేసీ 2, రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోలతో ధనుంజయరెడ్డి సమీక్ష నిర్వహించి ఇళ్ల స్థలాలకు భూమి సేకరణపై దిశా నిర్దేశం చేశారు. సమీక్ష అనంతరం మీడియాకు ప్రకటన జారీచేసి, ఆ తర్వాత సమాచార శాఖ నాలుక కరుచుకుంది. సమీక్ష వార్త రాయొద్దంటూ విజ్ఞప్తి చేసింది.

## వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ), మార్చి 16: గ్రామ, వార్డు వలంటీర్లలో 90శాతం మంది మనవాళ్లే ఉన్నారు... కొద్దిరోజుల క్రితం విశాఖపట్నంలో ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్య ఇది! వలంటీర్లను వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకుంటోంది... ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ ఇది! ఈ రెండూ నిజమేనని విజయవాడలో జరిగిన ఎన్నికల ప్రచారం నిరూపించింది. సెంట్రల్ నియోజకవర్గంలో 60వ డివిజన్ నుంచి వైసీపీ అభ్యర్థి సూర్యమణి భర్త బెవర నారాయణతో కలిసి డివిజన్ వలంటీర్ సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. నిన్న మొన్నటి వరకూ తెర వెనుక ఉండి ఎన్నికల ప్రచారం నిర్వహించిన వలంటీర్లు... ఎన్నికలు ఆరు వారాలు వాయిదా పడటంతో అభ్యర్థులతో తిరగడం కనిపించింది. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు టీడీపీ, సీపీఎం అభ్యర్థులు తెలిపారు.

# ఏం జరిగిందో చెప్పండి

- 'మాచర్ల'పై వాంగ్మూలం కోసం బుద్దా, ఉమాలకు నోటీసులు
- విచారణ అధికారిగా గురజాల డీఎస్పీ
- మమ్మల్ని హత్య చేసేందుకు ఇది మరో కుట్ర
- రాలేమని టీడీపీ నేతల స్పష్టీకరణ

గుంటూరు, మార్చి 16: మాచర్లలో ఈ నెల 11న టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది కిషోర్‌లపై జరిగిన దాడిపై నిష్పక్షపాత విచారణ జరుపుతున్నట్లు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ జె.ప్రభాకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజీపీ ఆదేశాల మేరకు కేసు విచారణ నుంచి గురజాల సీఐ ఓ.దుర్గాప్రసాద్‌ను తప్పించి గురజాల డీఎస్పీ శ్రీహరి బాబుకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. సంఘటన జరిగిన సమయంలో గురజాల డీఎస్పీ స్పందించిన తీరుపై బాధితులు విశ్వాసం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆ అధికారి ద్వారానే విచారణ జరిపించడం వలన మరింత పకడ్బందీగా నేర నిర్ధారణ చేయవచ్చని భావించి గురజాల డీఎస్పీని నియమించామన్నారు. విచారణకు హాజరయ్యే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తే తగిన రక్షణ కల్పించే బాధ్యత పోలీస్‌శాఖదే అన్నారు. అప్పటికీ అభ్యంతరాలు ఉంటే బాధితులు ఉన్న ప్రాంతానికే విచారణ అధికారి వచ్చి వారి వాంగ్మూలం నమోదు చేస్తారన్నారు. కాగా కేసు విచారణలో భాగంగా వాంగ్మూలం నమోదు చేయాల్సి ఉందని, ఆధారాలతో మంగళవారం తన కార్యాలయానికి రావాలంటూ గురజాల డీఎస్పీ సోమవారం విజయవాడ వచ్చి బుద్దా వెంకన్న, బొండా ఉమామహేశ్వరరావులకు నోటీసులు జారీ చేశారు. వీటిపై టీడీపీ నేతలు స్పందిస్తూ అక్కడి పోలీసులపై నమ్మకం లేదని, తాము రాలేమని, కోర్టులోనే వాంగ్మూలం ఇస్తామని స్పష్టం చేశారు. 'మా మీద దాడి జరిగినప్పుడు పోలీసులు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఎలాగైతే సమాచారం ఇచ్చారో.. ఇప్పుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలీసులతో ఈ నోటీసును పంపించి మమ్మల్ని హతమార్చాలని చూస్తున్నారు. మాకు ఆంధ్రా పోలీసుల మీద నమ్మకం లేదు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసి పోలీసులు నిజాయితీని నిరూపించుకోవాలి. లేని పక్షంలో మేము హైకోర్టు ద్వారా ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరతాం. ఈ నెల 11న నా మీద దాడి జరిగిన తర్వాత డీజీపీ మా ఫోన్‌లను టాప్ చేయించి.. కాల్ డేటా తీసి.. మేం ఎవరెవరితో మాట్లాడుతున్నామో ఎంక్వైరీ చేసి.. మాపై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారు. తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదు. మాకు ప్రాణహాని ఉందని మాచర్ల ఘటనతో తేలిపోయింది. ఇప్పటికైనా పోలీసులు మాకు రక్షణ కల్పించి నిజాయితీని నిరూపించుకోవాలి' అని బుద్దా ఒక ప్రకటనలో తెలిపారు. 'పోలీసులపై మాకు నమ్మకం లేదు. మాపై దాడి చేసినోళ్లపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా వదిలేశారు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం' అని బొండా ఉమ స్పష్టం చేశారు.

## 'మూడు రాజధానుల' లేఖ అందింది

- టీడీపీ ఎంపీ కనకమేడలకు ప్రధాని జవాబు

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయంపై టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ రాసిన లేఖ తనకు అందిందని ప్రధాని మోదీ ఆయనకు తెలియజేశారు. ఈ మేరకు 12వ తేదీన తిరుగులేఖ రాశారు. దానిపై మోదీయే స్వయంగా సంతకం చేయడం గమనార్హం. విభజన చట్టం-2014 ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం గతంలో కేంద్రం అనుమతితో అమరావతిని రాష్ట్ర రాజధానిగా నిర్ణయించిందని.. కొత్తగా వచ్చిన జగన్ ప్రభుత్వం దానిని కాదని పరిపాలనా వికేంద్రీకరణ ముసుగులో మూడు రాజధానులుగా వర్గీకరించి, మూడు ప్రాంతాల్లో నెలకొల్పాలని ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని కనకమేడల ప్రధానికి రాసిన లేఖలో వెల్లడించారు. 13 జిల్లాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమరావతి రాజధాని కోసం స్వచ్ఛందంగా 33 వేల ఎకరాలను ఇచ్చిన రైతుల నుంచి వస్తున్న వ్యతిరేకతను, వారు చేస్తున్న ఆందోళనలను కూడా బేఖాతరు చేస్తూ రాష్ట్రప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆందోళనకారులపై పోలీసులు అమానుషంగా వ్యవహరిస్తూ, దాడులకు పాల్పడుతూ, మహిళలని కూడా చూడకుండా అక్రమ కేసులు బనాయిస్తూ, భయభ్రాంతులను చేస్తున్న వైనాన్ని ప్రధానికి వివరించారు. చట్టం ప్రకారం ఒకసారి రాజధాని నిర్ణయం జరిగి.. సాక్షాత్తూ ప్రధానమంత్రే శంకుస్థాపన చేసినప్పటికీ.. జగన్ తన స్వార్థ ప్రయోజనాల కోసం అమరావతి రాజధానిని మూడు ముక్కలు చేయడానికి యత్నించడం, సీఆర్‌డీఏ చట్టం రద్దు, మూడు రాజధానుల ఏర్పాటు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించడం.. వాటిని శాసనమండలి వ్యతిరేకించడంతో దానిని కూడా రద్దుచేయాలని అసెంబ్లీలో తీర్మానించడం తదితర పరిణామాలన్నీ ప్రధాని దృష్టికి తీసుకొచ్చారు. రూ.10వేల కోట్ల వ్యయంతో అనేక రకాల భవనాలు నిర్మించిన తర్వాత ఇపుడు మళ్లీ రాజధాని మార్పుపై ప్రభుత్వానికి నిర్ణయం తీసుకునే అధికారం లేదని స్పష్టం చేశారు.


శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారి దేవస్థానము
యాదగిరిగుట్ట -508 115, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ
ఆర్.సి.నం.బి5/01/2020 తేది.16.03.2020
ఇ-ప్రొక్యూర్‌మెంట్/సీల్డు టెండరు-కం-బహిరంగ వేలం ప్రకటన
దేవస్థానము నందు తేది:01.04.2020 నుండి తేది.31.03.2021 వరకు ఒక సంవత్సర కాలపరిమితికి భక్తులు సమర్పించిన తలనీలాల(కొనుగోలు) ప్రోగు చేసుకొను లైసెన్స్ హక్కుకు సంబంధించి సీల్డు టెండరు, బహిరంగవేలం మరియు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలువబడుచున్నవి.
ప్రారంభం తేది.17.03.2020 చివరి తేది.30.03.2020 మ.గం.2.00ల వరకు
వివరములకు www.eprocurement.gov.in Telangana endowments department marketing సందర్శించగలరు. పూర్తి వివరముల కొరకు ఫోన్ నం.8333994021, 9059191775 నకు కార్యాలయ వేళలలో సంప్రదించగలరు.
సం/- డిప్యూటీ కలెక్టర్ / కార్యనిర్వహణాధికారి





# చిత్తశుద్ధి లేని వాదనలు

బ్యాంకు రుణాలు భారీగా ఎగవేసిన మొదటి యాభైమంది బడాబాబులెవరో తెలుసుకోవాలని రాహుల్‌గాంధీకి అనిపించింది. 'భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది, బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలిపోతున్నది. మరిన్ని బ్యాంకులు మూతబడే దిశలో ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం బ్యాంకు సొమ్మును కొందరు పెద్దలు దోచుకోవడమే. ప్రధానమంత్రి ఏవేవో హామీలు ఇస్తుంటారు. కానీ, నా ప్రశ్నకు సరైన సమాధానం మాత్రం రాలేదు' అని రాహుల్ ఆగ్రహించారు. బ్యాంకు రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగవేసినవారి జాబితా బయటపెట్టాలని సోమవారం పార్లమెంటులో ఆయన ప్రభుత్వాన్ని నిలదీసినప్పుడు, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ అక్కడ ఉండికూడా సహాయమంత్రి సమాధానం చెప్పినందుకు రాహుల్‌కు మరింత కోపం వచ్చింది. పైగా స్పీకర్ ఒకే అనుబంధ ప్రశ్నను అనుమతించి, ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ముగించేసినందుకు ఆవేదన కలిగింది. సభలో గందరగోళం రేగడంతో కాంగ్రెస్ వాకౌట్ చేసింది. బ్యాంకుల నిరర్థక ఆస్తుల సమస్య మన నాయకులను ఏమాత్రం బాధించడం లేదనీ, అది వారికి ఓ రాజకీయాస్త్రం మాత్రమేనని సభలో రభస నిదర్శనం.

కాంగ్రెస్ తన హయాంలో బ్యాంకులను ముంచేసి, ఇప్పుడు ఎన్డీయేని తప్పుబట్టడానికి సిద్ధపడుతున్నదని ఆర్థికశాఖ సహాయమంత్రి ఆరోపణ. మోదీ ప్రభుత్వం దాదాపు ఐదులక్షలకోట్ల రుణాలను ముక్కుపిండి మరీ వసూలు చేసిందన్నారు ఆయన. యస్‌బ్యాంకును సంక్షోభం నుంచి తమ ప్రభుత్వం ఎలా కాపాడుకొచ్చిందో వివరిస్తూ, కాంగ్రెస్ పాలకులు బ్యాంకులను చిత్తంవచ్చినట్టు వదిలేయడమే కాక, చివరకు వాటితో బలవంతంగా పెయింటింగ్స్ కూడా కొనిపించారన్నారు. ప్రియాంకవాద్రా పెయింటింగ్ ఒకదానిని యస్‌బ్యాంకు అధినేత రాణా కపూర్ భారీ ధరకు కొన్నారన్న ఆరోపణను ఆయన ఇలా పరోక్షంగా ప్రస్తావించడంతో రచ్చరేగడం, చర్చ ముగియడం సహజం. భారీ ఎగవేతదారులు ఎవరో చెప్పాలని ప్రభుత్వానికి నిజంగా ఉండివుంటే ఈ కొంటెమాటలతో అది విపక్షాన్ని రెచ్చగొట్టేది కాదు. తెలుసుకోవాలని ఉండివుంటే రాహుల్ ఇలా రెచ్చిపోయి వాకౌట్ చేసేవారూ కాదు. ప్రభుత్వ రంగబ్యాంకుల్లో మొండిబాకీలు తగ్గాయని ప్రభుత్వం చెబుతున్నది. 2020 మార్చినాటికి ఎన్పీఏలు 8శాతానికి తగ్గిపోతాయని క్రిసిల్ కూడా లెక్కలు వేస్తున్నది. సంతోషించాల్సిన విషయం ఇది. కానీ, రిజర్వు బ్యాంకునుంచి సమాచారహక్కు ద్వారా సేకరించిన వివరాలు ఓ దిగ్భ్రాంతికరమైన వాస్తవాన్ని చెప్పాయి. 2014నుంచి ఇప్పటివరకూ బ్యాంకులు అక్షరాలా ఆరు లక్షల అరవైవేల కోట్ల రుణాలను రద్దుచేశాయట. మొండి బాకీలు, నిరర్థక ఆస్తులు ఇత్యాది ఏ పేర్లతో పిలిచినా ఈ వసూలు కాని రుణాల విషయంలో బ్యాంకులు చివరకు చేస్తున్నదల్లా వాటిని ఖాతాపుస్తకాల్లో చెరిపేయడమే. ఈ విధంగా బ్యాంకులు తమ మొత్తం మొండిబాకీల్లో రద్దుచేసి పారేసింది దాదాపు సగభాగం. 2018–19 ఆర్థిక సంవత్సరంలోనే రెండున్నర లక్షల కోట్లవరకూ రద్దయ్యాయి. 2013 మొదలు 2019వరకూ ఈ మొండిబాకీలు విపరీతంగా హెచ్చాయి. 2013–14 ఆర్థిక సంవత్సరంలో రెండులక్షలకోట్లున్న నిరర్థక ఆస్తులు మొన్నటి ఆర్థిక సంవత్సరం నాటికి సుమారు 12లక్షల కోట్లకు చేరుకున్నాయి. బ్యాంకులు రద్దు చేసుకుంటున్న మొత్తం కూడా ఇదేకాలంలో పెరుగుతూ, వాటిని మోసం చేసినవారి సంఖ్య కూడా హెచ్చింది.

బ్యాంకుల నిరర్థక ఆస్తులు ఏటా పెరిగిపోతున్నందున, తదనుగుణమైన స్థాయిలో వాటిని రద్దుచేయడం జరిగిపోతున్నది. తాము తెచ్చిన కొత్తచట్టాలతో రుణాల వసూలు భారీగానే సాగుతున్నదని ప్రభుత్వం చెబుతున్న మాటా నిజమే కావచ్చును కానీ, పెద్దల పాలవుతున్న సొమ్ముతో పోల్చితే బ్యాంకులు తిరిగి రాబట్టుకోగలుగుతున్నది మాత్రం అతిస్వల్పం. నిజాయితీ పరుల పక్షాన నిలబడతామని, ఆశ్రిత పెట్టుబడిదారులతో కఠినంగా ఉంటామని ప్రధాని తరచు చెబుతుంటారు. కానీ, పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు బ్యాంకులను ఎంత పీల్చిపిప్పి చేశాయో ఈ డేటా చెబుతున్నది. బ్యాంకింగ్ రంగంపై ఆర్బీఐ నియంత్రణ ఏ స్థాయిలో ఉన్నదో యెస్ బ్యాంకు నిర్వాకం మనకు తెలియచెబుతున్నది. కూలుతున్న ఈ ప్రైవేటు బ్యాంకును కాపాడటం కోసం ప్రభుత్వరంగ బ్యాంకు రంగంలోకి దిగవలసి వచ్చింది. బ్యాంకింగ్ రంగానికి సంబంధించినంత వరకూ ఏవో తాత్కాలిక ఉపశమనాలే తప్ప రోగనివారణ చర్యలు కనిపించడం లేదు.

## మూడో కన్ను




© సతీష్ ఆచార్య

> *భారతదేశ సంస్కృతిని, ఇతిహాసాన్ని అర్థం చేసుకున్న అనేకమంది సూఫీ తత్వజ్ఞులు ఈ నేలా, ఈ గాలిలో విలసిల్లుతున్న సర్వ మానవ సౌభ్రాతృత్వం గురించి ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నారు. 15వ శతాబ్దంలో భక్తి ఉద్యమాన్ని ప్రేరేపించి, హిందూ ముస్లింలిరువురికీ కబీర్ ఆరాధ్యుడయ్యాడు. ఆ పరంపరకు చెందిన సూఫీలు ఇవాళ కశ్మీర్‌లో సూఫీతత్వాన్ని ప్రబోధించడం ద్వారా శాంతియుత వాతావరణం ఏర్పర్చడానికి ముందుకు రావడం ముదావహం.*

# కశ్మీరంలో సూఫీగానం

సత్యకాలమ్



■ వై. సత్యకుమార్

గత ఆదివారం కొంతమంది సూఫీ సాధువులు హోంమంత్రి అమిత్ షాను కలుసుకుని కశ్మీర్ లోయలో ఇంటింటికీ సూఫీతత్వాన్ని తీసుకువెళ్లాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. భారతీయ జనతా పార్టీని మతతత్వ పార్టీగా, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షాలను మతతత్వవాదులుగా అభివర్ణిస్తూ ప్రజల మనసులను కలుషితం చేసేందుకు నిత్యం ప్రయత్నించే కాంగ్రెస్, వామపక్ష వాదులు, కుహనా లౌకిక వాదులు ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. భారతదేశ సంస్కృతిని, ఇతిహాసాన్ని అర్థం చేసుకున్న అనేకమంది సూఫీ తత్వజ్ఞులు ఈ నేలలో ఇంకిపోయిన సర్వ మానవ సౌభ్రాతృత్వ లక్షణాల గురించి ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నారు. 15వ శతాబ్దపు కబీర్ హిందూ భక్తి ఉద్యమాన్ని ప్రేరేపించి, హిందూ ముస్లిలిద్దరికీ ఆరాధ్యుడయ్యాడు. ఆ పరంపరకు చెందిన సూఫీలు ఇవాళ కశ్మీర్‌లో సూఫీతత్వాన్ని ప్రబోధించడం ద్వారా శాంతియుత వాతావరణం ఏర్పర్చగలమని హోంమంత్రికి చెప్పడం విశేషం. కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు తర్వాత సయ్యద్ నసీరుద్దీన్ చిష్తీ నేతృత్వంలోని అనేకమంది సూఫీలు ఆ రాష్ట్రంలో పర్యటించి భారత రాజ్యాంగం పరిధిలో సాధికారిత పొందడం ద్వారానే పరిస్థితులు మెరుగు కాగలవని, ఉగ్రవాదుల వలలో చిక్కుకుపోవద్దని అక్కడి యువకులకు ప్రబోధిస్తూ వచ్చారు. వారే అయోధ్య తీర్పుకు ముందు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌తో కలిసి, తీర్పు తర్వాత ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూసేందుకు సమావేశాలు నిర్వహించారు. అమిత్ షాను కలిసిన కొందరు సూఫీ సాధువులు కాషాయం కూడా ధరించారు. 'ఇదేమిటి, మీరు కాషాయం ధరించారని కొందరు ప్రశ్నించినప్పుడు దాదాపు 8 శతాబ్దాల క్రితం భారత దేశంలో సూఫీ ఇస్లాంను ప్రారంభించిన ఖ్వాజా మొయినుద్దీనే హిందూత్వ వాదానికి ప్రతిబింబమైన కాషాయాన్ని సూఫీలు కూడా స్వీకరించాలని చెప్పినట్లు సయ్యద్ నసీరుద్దీన్ చిష్తీ గుర్తు చేశారు. కశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడుతోందని, సూఫీ బోధనలను ఇంటింటికీ తీసుకు వెళ్లడం ద్వారా మరింత శాంతిని నెలకొల్పగలమని ఆయన అన్నారు. ఢిల్లీ అల్లర్లపై నిష్పాక్షికమైన దర్యాప్తు జరిపించి, ఎవరు హింసాకాండ నిర్వహించారో తేల్చాలని సూఫీ సాధువులు అమిత్ షాను కోరారు.

నిజానికి ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో కశ్మీర్‌లో ఉగ్రవాద చర్యలు ఎంత తీవ్ర స్థాయికి చేరుకున్నాయంటే అక్కడ సర్వమత భావనను ప్రతిబింబించే ఏ సంస్కృతికీ చోటు లేకుండా చేశారు. అనేక మంది కశ్మీరీ పండిట్‌లను ఊచకోత కోసి, వారి కుటుంబాలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని దేశంలో ఇతర ప్రాంతాలకు తరలివెళ్లేలా చేశారు. అన్నిటికన్నా ముఖ్యంగా కశ్మీర్ సూఫీ సంస్కృతినే విధ్వంసం చేశారు. అక్కడ సూఫీ సంస్కృతిని ఏ మాత్రం పరిరక్షించినా, హిందువులు, ముస్లింలు అక్కడ కలిసిమెలిసి జీవించేవారు. నిజమైన కశ్మీరియత్ అక్కడ వెల్లివిరిసేందుకు అవకాశం ఉండేది.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రస్తుతం ఆకాంక్షిస్తున్నది ఇలాంటి వసుధైక కుటుంబ భావనే. ఈ ఉద్దేశంతోనే ఢిల్లీలోని హుమాయూన్ సమాధి వద్ద మొఘల్ చక్రవర్తి ఔరంగ జేబు సోదరుడు దారా షికో సమాధి ఎక్కడున్నదో తెలుసుకునేందుకు మోదీ ప్రభుత్వం ఏడుగురు నిపుణులతో కమిటీని ఏర్పర్చింది. 16వ శతాబ్దంలో ఔరంగ జేబు తన తండ్రి షాజహాన్ అస్వస్థుడైన తర్వాత తన సోదరుడైన దారాషికోను ఓడించి వధించి గద్దెనెక్కాడు. పర్షియన్ సూఫీ సర్మాక్ కషానీ శిష్యుడైన దారా షికో హిందూ ముస్లిం ఆధ్యాత్మిక వాదాన్ని జీర్ణించుకుని నిజమైన హిందూస్థానీగా గుర్తింపు పొందారు. భారతీయ ఇస్లామిక్ సంస్కృతిలో భాగమైన కళలను సాహిత్యాన్ని జీర్ణించుకున్నారు. రెండు మతాలను పోలుస్తూ విశ్లేషించారు. ఉపనిషత్తుల సారాన్ని వివరించే ప్రయత్నం చేశారు. ముస్లిం మతోన్మాదిలా వ్యవహరించిన ఔరంగ జేబు స్థానంలో దారాషికో కనుక చక్రవర్తి అయి ఉంటే భారతదేశ పరిస్థితులు భిన్నంగా ఉండేవని చరిత్రకారులు అంటారు. అందుకే ఆ బోధనలను మళ్లీ ప్రాచుర్యంలోకి తెచ్చే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం ఆయన జ్ఞాపకాలను సజీవం చేసే ప్రయత్నం ప్రారంభించింది.



సూఫీ సాధువులు ఆశిస్తున్న విధంగానే కశ్మీర్‌లో ఒకప్పుడు నెలకొన్న విలువలను పునఃస్థాపన చేసి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నట్లు తాజాగా హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనలను బట్టి స్పష్టమవుతోంది. కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించే చర్యలు తీసుకుంటామని, నిర్బంధంలో ఉన్న రాజకీయ నేతలందర్నీ విడిచిపెడతామని అమిత్ షా తనను కలిసిన ఒక రాజకీయ ప్రతినిధి వర్గానికి చెప్పారు. కశ్మీర్‌కు ఇతర ప్రాంతీయులను తరలించి అక్కడి జనాభా రూపురేఖల్ని మార్చాలని కూడా తాము భావించడం లేదని ఆయన స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కశ్మీర్‌లో బృహత్తరమయిన మార్పులు కనపడతాయని, జమ్మూకశ్మీర్ అంతా అభివృద్ధి జరగాలనే ప్రధానమంత్రి మోదీ భావిస్తున్నారని అమిత్ షా చెప్పారు. ఈ పరిణామాలను చూస్తుంటే కశ్మీర్ విషయంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితాలను ఇవ్వడం ప్రారంభమయినట్లు స్పష్టమవుతున్నది. శ్రీనగర్‌లో ప్రజాజీవనం సాధారణంగా కొనసాగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కశ్మీర్‌లో అంతరించిపోతున్న హస్తకళలను పునరుద్ధరించేందుకు అపారమైన కృషి చేసిన శ్రీనగర్‌కు చెందిన అర్వా జాన్ గత వారం రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారాన్ని స్వీకరించడం అక్కడ మారుతున్న పరిస్థితులకు నిదర్శనం. 2018లో అర్వా జాన్ స్థాపించిన అర్వా ఎంటర్‌ప్రైజెస్ శ్రీనగర్‌లో ఇవాళ వివిధ హస్తకళా ఉత్పత్తులను సరఫరా చేసే ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందింది. 370 అధికరణ రద్దు తర్వాత ఇంటర్నెట్ సేవలను కొంతకాలం నిలిపివేయడంతో తమ వ్యాపారం దెబ్బతిన్నదని, మళ్లీ ఇప్పుడు పుంజుకుంటున్నదని ఆమె ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చెప్పారు.

విచిత్రమేమంటే బీజేపీ విస్తరణ ద్వారా తమ ఉనికిని కోల్పోతామని భయం ఉన్నవారే పౌరసత్వ చట్టం గురించి, ఢిల్లీ అల్లర్ల గురించి తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతుల్ని చేస్తున్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న కె.చంద్రశేఖర్ రావు లాంటి వారు కూడా తాను ఎప్పుడు పుట్టానో తనకు తెలియదని అసెంబ్లీలో ప్రకటించారు. తన పౌరసత్వం ప్రశ్నార్థకమవుతుందని బూటకపు భయాన్ని నటించారు. కేవలం ముస్లిం ఓట్లకోసమే కేసీఆర్, మమతా బెనర్జీతోపాటు దేశంలో అనేకమంది ప్రతిపక్ష నేతలు పనికిమాలిన భయాల్ని ప్రజల్లో కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. జనాభా లెక్కల కార్యక్రమాన్ని తమ రాష్ట్రాల్లో నిర్వహించబోమని ప్రకటిస్తూ ఎన్నడూ లేని విధంగా జన గణనను రాజకీయం చేస్తున్నారు. పౌరసత్వ చట్టాన్నీ, జాతీయ జనాభా రిజిస్టర్‌నూ, జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌కూ ముడిపెట్టి ఈ దేశంలో మైనారిటీలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారు. ఇది ప్రమాదకరమైన పరిణామమని చెప్పక తప్పదు. అందుకే 'ఈ దేశ హోంమంత్రిగా నేను చెబుతున్నాను. ఎవరి పౌరసత్వమూ సందేహాస్పదం కాదు' అని అమిత్ షా అనవలిసి వచ్చింది.

'ఇవాల్టి కాంగ్రెస్‌కూ ఒకప్పటి కాంగ్రెస్‌కూ ఎంతో తేడా ఉన్నది'.. అని యువకుడైన జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌తో తన చిరకాల అనుబంధాన్ని తెంచుకుని బిజెపిలో చేరారంటే, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి మరీ ఆ పార్టీతో తెగతెంపులు చేసుకుంటున్నారంటే ఎవరి విశ్వసనీయత ఏ విధంగా ఉన్నదో అర్థమవుతుంది. ఇప్పటికైనా కేసీఆర్, మమతా బెనర్జీ వంటి ప్రతిపక్ష నేతలు ఓటు బ్యాంకు రాజకీయాలకోసం పాతకాలపు కుత్సితపు చర్యలకు పాల్పడడం మానుకోకపోతే వారు కూడా కాంగ్రెస్ మాదిరి చరిత్ర చెత్తబుట్టలో కలిసిపోక తప్పదు. వారే అసలైన మతతత్వవాదులని ప్రజలు గ్రహించే రోజులు ఎంతో దూరం లేవు.

*(బిజెపి జాతీయ కార్యదర్శి)*

# మహమ్మారుల కాలంలో మన కర్తవ్యం




కరోనా వైరస్‌తో ప్రబలిన అంటువ్యాధి ప్రపంచ వ్యాప్త మహమ్మారిగా పరిణమించింది. ఆ విష క్రిమి తొలుత విజృంభించిన చైనాలో వ్యాధిగ్రస్తుల, మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. అయితే ఇటలీ, ఇరాన్, స్పెయిన్ మొదలైన దేశాలలో కరోనా మరణాల సంఖ్య పెరుగుతోంది. ప్రజల ఆరోగ్యానికి వాటిల్లుతున్న పెనుముప్పుతో పాటు ప్రపంచ వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలూ కరోనా వైరస్‌తో అల్లకల్లోలమవుతున్నాయి. పర్యాటక, ఆతిథ్య, విమానయాన రంగాలను అది ఇప్పటికే దుర్బలపరిచింది. కనీవినీ ఎరుగని స్థాయిలో ఆర్థిక విధ్వంసానికి కారణమవుతున్నది. అసలే పతనమవుతున్న చమురు ధరలకు కరోనా కల్లోలం తోడవడంతో భారత్‌తో సహ ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. ఆరోగ్య రంగం ఏక కాలంలో రెండు తీవ్ర ఒత్తిళ్లతో సతమతమవుతున్నది. ఒకటి కరోనా కేసుల పెరుగుదల; రెండు మహమ్మారి నిరోధానికి అత్యవసరమైన మందులు, వైద్య సామగ్రి కొరత. ఈ ఆవశ్యక ఔషధాల ప్రధాన సరఫరాదారు చైనా కావడంతో సరఫరాల పరంపరకు తీవ్ర అవరోధమేర్పడింది. ప్రజారోగ్య భద్రత దృష్ట్యా ఈ రెండు ఒత్తిళ్ళు చాలా తీవ్రమైనవి. కరోనా, భావి మహమ్మారుల నెదుర్కోవడంలో ఇవి, ముఖ్యంగా మన దేశానికి మేలు కొలుపు కావాలి.

కరోనా సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ పలు చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో ప్రయాణీకులకు విధిగా వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది; వీసా ఆంక్షలను జారీ చేసింది; ప్రభుత్వాసుపత్రులలో కరోనా వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వార్డులనేర్పాటు చేసింది; స్వీయ ఏకాంత నిర్బంధానికి(సెల్ఫ్ క్వారంటైన్) మార్గదర్శక సూత్రాలను జారీ చేసింది; తరచు చేతులు కడుక్కోవడం మొదలైన పరిశుభ్రతా సూత్రాలు పాటించేలా ప్రజలను ప్రోత్సహిస్తోంది; సామాజిక సమావేశాలపై ఆంక్షలు విధించింది; కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టే లక్ష్యంతో ఈ అత్యవసర చర్యలను చేపట్టారు. ఈ శతాబ్ది తొలి దశకంలో ప్రబలిన సార్స్, ఏవియన్ ఇన్‌ఫ్లూయెన్జా, స్వైన్ ఫ్లూ మొదలైన మహమ్మారుల నెదుర్కోవడంలో సంచితమైన అనుభవాల నేపథ్యంలో ఆరోగ్య భద్రతా వ్యవస్థలో చోటు చేసుకున్న మార్పుల ఫలితమే ఈ అప్రమత్త చర్యలు.

అంటు వ్యాధులను సమర్థంగా ఎదుర్కొనేందుకు 2004లో నాటి వాజపేయి ప్రభుత్వం ప్రపంచబ్యాంకు సహకారంతో ఆరోగ్య భద్రతా వ్యవస్థలో సంస్థాగత మార్పులకు పూనుకున్నది. వీటిలో భాగంగా 'ఏకీకృత వ్యాధి నిఘా కార్యక్రమం (ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ –ఐడిఎస్‌పి)' ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఎక్కడైనా సరే అంటు వ్యాధులు ప్రజ్వరిల్లడాన్ని సకాలంలో కనిపెట్టి, వాటి వ్యాప్తిని నిరోధించేందుకు తక్షణమే పటిష్ఠంగా ప్రతిస్పందించే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఐడిఎస్‌పి లక్ష్యం. సూక్ష్మ జీవ శాస్త్రవేత్తలు, అంటు వ్యాధి శాస్త్రవేత్తలు, కీటక శాస్త్ర వేత్తలను సమష్టిగా వ్యాధి నిరోధానికి నియోగించడం ఈ కార్యక్రమంలో ఒక ప్రధాన భాగం. వుహాన్‌లో కరోనా వలే, మన దేశంలో ఎక్కడైనా సరే ఏ అంటు వ్యాధి ప్రబలినా దాన్ని చురుగ్గా అరికట్టేందుకు ఐడిఎస్‌పి విశేషంగా తోడ్పడుతుంది. ఈ ప్రతిస్పందనా వ్యవస్థను పటిష్ఠ పరచడమే ప్రస్తుత కరోనా మహమ్మారి మనకు నిర్దేశిస్తున్న మొదటి కర్తవ్యం. సమృద్ధ నిధులు, తగిన సిబ్బందిని సమకూర్చడం ద్వారా ఐడిఎస్‌పి నిరంతరం క్రియాశీలంగా వుండేలా ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి. ప్రతి రాష్ట్రం, ప్రతి జిల్లాలోనూ అంటువ్యాధుల నిఘా విభాగం వుండి తీరాలి. ఈ విభాగాలన్నీ తప్పనిసరిగా కేంద్ర నిఘా విభాగంతో అనుసంధానమై వుండాలి. ఈ విభాగాలకు నేతృత్వం వహించే సీనియర్ అధికారులు కనీసం నెలకొక సారి సమావేశమవ్వాలి. అంటు వ్యాధుల కల్లోల కాలంలో అయితే అవసరం ఏర్పడినప్పుల్లా వారు విధిగా సమావేశమవ్వాలి. దురదృష్టవశాత్తు గత కొద్ది సంవత్సరాలుగా రాష్ట్ర, జిల్లా విభాగాలు పనిచేయడం లేదు. జిల్లా విభాగాలయితే సిబ్బంది కొరతను కూడా తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. ఆరోగ్య రంగంలో ప్రభుత్వ మదుపులు సమృద్ధంగా వున్నప్పుడు మాత్రమే ప్రజారోగ్య భద్రతా వ్యవస్థ చురుగ్గా వుండి, ప్రతి ఒక్కరికీ ఆరోగ్యభద్రతా భరోసా సమకూరగలదని కేరళలో ఇటీవల నిపా అంటువ్యాధి నియంత్రణ తీరుతెన్నులు స్పష్టం చేశాయి. జిల్లా ప్రభుత్వాసుపత్రులను ప్రైవేట్ రంగానికి అప్పగించేందుకు ప్రభుత్వం ఇటీవల పూనుకోవడం ఎంతైనా శోచనీయం. దీనివల్ల ఐడిఎస్‌పి బలహీనపడుతుంది. కరోనా కల్లోలం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఆస్పత్రులను ప్రైవేట్ రంగానికి అప్పగించాలన్న నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

ఔషధ తయారీ రంగం (ఫార్మాస్యూటికల్ సెక్టార్) రూపు రేఖలు, పని చేస్తున్న తీరుతెన్నులను సమీక్షించాలి. ఇది, మన రెండో కర్తవ్యం. కరోనా కల్లోల్లాన్ని సమర్థంగా ఎదుర్కోవడంలో ఈ కర్తవ్యాల పాలన అత్యవసరమూ అతి ముఖ్యమూనూ. చైనా నుంచి అత్యవసర మందులు లేదా క్రియాశీల ఔషధ తయారీ పదార్థాల(ఎపిఐ ల సరఫరాలకు తీవ్ర అవరోధ మేర్పడినందున ఫార్మాస్యూటికల్ రంగం వ్యవహారాలను పునఃసమీక్షించి తీరాలి. ప్రపంచ దేశాలకు తయారైన మందుల సరఫరాదారులలో భారత్ అగ్రగామిగా వున్నది. అయితే బల్క్ డ్రగ్ సరఫరాలకు మన దేశం చైనాపై ఆధారపడడం ఒక వైపరీత్యం. పారాసిటమాల్, మెట్ఫార్మాన్ మొదలైన అత్యవసర ఔషధాలు, యాన్టీబయాటిక్స్‌ను కూడా మనం చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అత్యవసర మందులకు సైతం ఒక పొరుగుదేశంపై ఆధారపడడం పరిశ్రమకు మేలు చేస్తుందేమో గానీ ప్రజారోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదని నిపుణులు పదే పదే హెచ్చరిస్తున్నారు.

> *దేశ వ్యాప్తంగా ఎక్కడైనా సరే అంటు వ్యాధులు ప్రజ్వరిల్లడాన్ని సకాలంలో కనిపెట్టి, వాటి వ్యాప్తిని నిరోధించేందుకు తక్షణమే ప్రతిస్పందించే సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా 2004 ప్రారంభమైన ఐడిఎస్‌పి ని మరింతగా పటిష్ఠ పరచాలి. ప్రైవేట్ ఫార్మా సంస్థలకు పోత్సాహకాలు అందిస్తూనే ఐడిపిఎల్ లాంటి ప్రభుత్వ రంగ ఫార్మా సంస్థలను పునరుద్ధరించి తీరాలి.*

గత శతాబ్ది చివరి దశకాలలో భారతీయ ఔషధ తయారీ రంగం ఇతోధిక పురోగతికి 1971లో తీసుకువచ్చిన పేటెంట్ చట్టం విశేషంగా కృషి చేసింది. ఈ చట్టం, పేటెంట్ డ్రగ్స్ 'రివర్స్ ఇంజనీరింగ్'ను సుసాధ్యం చేయడం వల్లే భారతీయ ఫార్మా సంస్థలు విశేష ప్రగతి సాధించగలిగాయి. భారతీయ వైజ్ఞానిక, పారిశ్రామిక మండలి (సిఎస్ఐఆర్) ఆధ్వర్యంలో జరిగిన ఉత్కృష్ట పరిశోధనలు కూడా మన ఫార్మా రంగం పురోగతికి విశేషంగా తోడ్పడ్డాయి. తత్ఫలితంగానే ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మా స్యూటికల్స్ లిమిటెడ్ (ఐడిపిఎల్), హిందుస్థాన్ యాన్టీబయాటిక్స్ లిమిటెడ్ మొదలైన ప్రభుత్వ రంగ ఫార్మా సంస్థలు ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన మందులను సరఫరా చేశాయి. అయితే, 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తరువాత ఈ ప్రభుత్వ రంగ ఫార్మా సంస్థలను పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా అవి పూర్తిగా ఖాయిలా పడ్డాయి. 2000 సంవత్సరం తరువాత అమల్లోకి వచ్చిన కొత్త పేటెంట్ చట్టం వెసులుబాటుతో ప్రైవేట్ ఫార్మా సంస్థలు తక్కువ వ్యయంతో ఔషధాలను తయారు చేసి, విదేశాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేయడం ప్రారంభించాయి. దేశంలో పెద్ద ఎత్తున మందులను తయారుచేయడానికి ప్రాధాన్యమిస్తున్నందున ప్రభుత్వం నుంచి ప్రైవేట్ ఫార్మా సంస్థలు పలు రాయితీలను కోరుతున్నాయి. ప్రభుత్వమేమో కొన్ని ఎపిఐల ఎగుమతిపై నిషేధం విధించింది. ఏమైనా ఎగుమతి మార్కెట్లను సంరక్షించుకోవడమే కాకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యభద్రత సమకూర్చడమే లక్ష్యమైతే కొన్ని సంస్థాగత మార్పులను తప్పనిసరిగా సాధించవలసివున్నది. ఔషధ తయారీ రంగంలో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా భారత్ సంపూర్ణ స్వావలంబన సాధించవలసిన అవసరం ఎంతైనా వున్నది. ఇందుకు సిఎస్ఐఆర్ ల్యాబ్స్‌లో ఔషధాల సంబంధిత పరిశోధన, అభివృద్ధికి నిధులు మరింతగా సమకూర్చవలసిన అవసరమున్నది. ప్రైవేట్ ఫార్మా సంస్థలకు పోత్సాహకాలు అందిస్తూనే ఐడిపిఎల్ లాంటి ప్రభుత్వ రంగ ఫార్మా సంస్థలను పునరుద్ధరించి తీరాలి. నిత్యావశ్యక మందులను దేశంలోనే తయారు చేసి, వాటిని చౌక ధరలకు ప్రజానీకానికి అందుబాటులో ఉంచడమే లక్ష్యం కావాలి. ప్రజారోగ్య అవసరాలకు అనుగుణంగా దేశీయ ఫార్మా పారిశ్రామిక రంగాన్ని తీర్చిదిద్దేందుకు ప్రస్తుతం రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వున్న ఫార్మాస్యూటికల్స్ విభాగాన్ని ఆరోగ్య మంత్రిత్వ శాఖ నియంత్రణలోకి తీసుకురావాలి. ప్రాథమిక ఆరోగ్య భద్రతా వ్యవస్థను పటిష్ఠం చేయడం, దేశ ప్రజల ఆరోగ్య సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఔషధ తయారీ రంగాన్ని తీర్చిదిద్దడం భారత్ తక్షణ కర్తవ్యాలు అనే సత్యాన్ని కరోనా కల్లోలం స్పష్టం చేస్తున్నది.

◆ దినేశ్ సి శర్మ
(ది ట్రిబ్యూన్)

# అనుబంధాలు, ఆత్మీయతలే...

కుంచించుకు పోతున్న మానవ సంబంధాలు, వాటి ప్రాధాన్యతల గురించి ప్రపంచానికి గుర్తు చేసేదే 'అంతర్జాతీయ సోషల్ వర్క్ దినోత్సవం'. సోదరభావం, సమానత్వం, లౌకికత్వం, సహనం, జెండర్ సమానత్వం, మానవ హక్కులు, మైనారిటీల రక్షణ మొదలైన భావనలు పౌరులలో పెంపొందించడం 'సోషల్ వర్క్ డే' లక్ష్యం. 'ఇంటర్నేషనల్ ఫెడరేషన్ అఫ్ సోషల్ వర్కర్స్' ఆధ్వర్యంలో జరిగే ఈ దినోత్సవానికి చారిత్రక ప్రాధాన్యమున్నది. 'ప్రమోటింగ్ ది ఇంపార్టెన్స్ అఫ్ హ్యూమన్ రిలేషన్‌షిప్స్' అనేది 2020 సంవత్సర 'సోషల్ వర్క్ డే' థీమ్.

1990 దశకం తర్వాత మన సమాజంలో విపరీత మార్పులు చోటు చేసుకున్నాయి. నగరీకరణ అత్యంత వేగవంతంగా జరుగుతున్నది. అప్పటి వరకు పెద్దగా వాడుకలో లేని 'బిజీ' అనే పదం ప్రతి ఒక్కరి నోటి నుంచి విరివిగా విన్పిస్తోంది. ప్రపంచం కుగ్రామంగా మారింది. వ్యక్తుల మధ్య, కుటుంబాల మధ్య, సామాజిక సమూహాల మధ్య అప్పటివరకున్న సఖ్యత, సాన్నిహిత్యాలు మృగ్యమయ్యాయి. నగర, గ్రామీణ ప్రాంతాలు అన్న తేడాలేకుండా ఈ పరిణామం అందరిపై ప్రభావం చూపింది. వేషభాషలు, ఆహారపు అలవాట్లు, మానవ సంబంధాలలో విపరీత మార్పులు చోటుచేసుకున్నాయి. మన అన్న భావన తొలిగి నేను నాది అన్న సంకుచిత మనస్తత్వానికి బీజాలు పడ్డాయి. నైతిక విలువలు, మానవ బాంధవ్యాలు సన్నగిల్లసాగాయి, చదువు, సంపాదన పెరిగినప్పటికీ మానవ సంబంధాలు మసక బారడం మొదలయింది. అంతరిక్ష దూరాలను అవలీలగా జయించిన మనిషి పొరుగున ఉన్న మనిషిని మర్చిపోయాడు. సంబంధాలు సంకుచితమవ్వసాగాయి. సఖ్యత తరిగి మనుషుల మధ్య మానసిక దూరం పెరిగింది. తల్లిదండ్రులు, పిల్లల మధ్య జనరేషన్ గ్యాప్ ఎక్కువైంది. అడ్జెస్ట్‌మెంట్‌కు తావులేకుండా పోయింది. అన్ని విషయాల్లో 'అసహనం' పెరిగిపోయింది.

సంప్రదాయ వృత్తుల స్థానంలో ఆధునిక వృత్తులు అనేకం వచ్చి చేరాయి. ఆర్థికంగా ఎదిగే క్రమంలో మానవ సంబంధాల పరిధి కుంచించుకుపోసాగింది. ఆర్జనే లక్ష్యమైపోయింది. మానసిక ఒత్తిడి అనివార్యమయింది. ఆర్థిక స్థితిగతుల విషయమై 'ఇతరులతో పోలిక' మనుషుల మధ్య దూరాన్ని మరింత పెంచింది. కేవలం సంపాదన, పేరు ప్రతిష్ఠల వల్లే 'సంతోషం' సమకూరదని, అది కేవలం సామాజిక సంబంధాల వల్లనే వస్తుందని హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యయనం ఒకటి స్పష్టం చేసింది.

మనిషి సృష్టించిన సాంకేతికత మనిషినే శాసించే స్థాయికి చేరుకుంది. అన్ని రంగాల్లో తనదైన ముద్రను వేసి ముఖాముఖీ, ఆత్మీయ సంభాషణలకు మంగళం పలికి నిరంతరం టీవీకి అతుక్కుపోయేలా మనిషిని బానిసగా మార్చుకుంది. సోషల్ మీడియా పుణ్యమా అని మనిషి తీరిక లేకుండా గడిపేస్తున్నాడు. సంప్రదాయ ఆటలు అంతరించి వీడియో గేమ్స్, మొబైల్ గేమ్స్ మనుషులను ఆటాడిస్తున్నాయి. లైఫ్ స్టైల్ రోగాలు చిన్న వయసులోనే కబళిస్తున్నాయి. పిల్లల్ని వారించాల్సిన తల్లిదండ్రులే తమ బిడ్డలకు మొబైల్స్‌ను అలవాటు చేయడం పరిపాటిగా మారింది. ఈ సెల్‌ఫోన్ అతి వినియోగం వల్ల పిల్లల్లో క్రైమ్ రేటు పెరుగుతోందని వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి.

సంతులిత సామాజికీకరణను అందించడంలో కుటుంబ పాత్ర ఎనలేనిది. సమిష్టితత్వ భావన, పరస్పర ఆధారిత (Inter dependency) భావనలను కలిగించడంలో ఉమ్మడి కుటుంబం పాత్ర కీలకమైనది. నగరీకరణ పుణ్యమా అని నవతరం ఉమ్మడి కుటుంబ ఆప్యాయతానురాగాలకు నోచుకోలేకపోతున్నది. ఉమ్మడి కుటుంబాలు అంతరించి పోయి పిల్లలకు ప్రైవసీ ఎక్కువగా లభిస్తోంది. భార్యాభర్తలిద్దరూ పనిచేస్తే కానీ కుటుంబం జరగని పరిస్థితి నెలకొంది. ఇద్దరూ ఉద్యోగం చేయవలసి రావడంతో పిల్లల ఆలనాపాలన చూడలేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో సంతానాన్ని పరాయి వారి దగ్గర వదిలి పెట్టాల్సి వస్తుంది.

డబ్బు ప్రతి పనికి వెలగడుతోంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక చట్రంలో ఇరుక్కుపోయాయి. అమ్మలాలన, ఇల్లాలి ఆదరణ, పెద్దల పోషణ, నిస్సహాయుల ఆదరణ, కుటుంబ పాలన మొదలైనవన్నీ డబ్బు ద్వారా ఇతరుల చేత పొందుతున్నారు. విలువలు, బంధాలు మార్కెట్‌లో సరుకులయ్యాయి. మంచి చెడు, పవిత్రత, అపవిత్రత సరిహద్దు రేఖలు చెరిగిపోవడానికి డబ్బు కారణమయ్యింది. సృష్టిలోని సకల జీవల మధ్య సంబంధాలు పరస్పర పూరకాలు. అయితే, నేటి ఆధునిక భౌతికవాద ప్రపంచంలో డబ్బు పాత్రే ముఖ్యమైనది. డబ్బు కోసం ఎటువంటి పని చేయడానికైనా ఎవరూ వెనుకాడడంలేదు. విలువలు మరిచి ఎన్నో అఘాయిత్యాలకు ఒడిగట్టేలా కాసుల కక్కుర్తి మనిషిని పురికొల్పుతోంది. కల్తీ కల్లు, సారా అమ్మకాలు, మానవ అవయవాల దోపిడీ, బాలలపై అత్యాచారాలు, హ్యూమన్ ట్రాఫికింగ్, కిడ్నాపులు, వ్యభిచారం వంటి అకృత్యాలన్నీ షార్ట్ కట్ సంపాదనా మార్గాలైపోయాయి. డ్రగ్ సప్లై, దొంగతనాలు, కుట్రలు, కుతంత్రాలు. మర్డర్స్, కన్నవారిపై దాడులు, వరకట్న వేధింపులు, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లు, ఆసిడ్ దాడులు, పరువు హత్యలు మొదలైనవి మనిషిని పశువుగా మార్చేశాయి.

మానవ విలువల్ని పెంపొందించడంలో విద్య పాత్ర ఎనలేనిది. అయితే, బాధ్యతాయుతమైన పౌరుల్ని తయారు చేయడంలో మన విద్యావిధానం విఫలమవుతోంది. పిల్లల్ని డాలర్లు సృష్టించే యాంత్రాలుగా పరిగణించే పరిణామం నెలకొంది. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడే సామాజిక శాస్త్రాల అధ్యయనం తగ్గిపోతోంది. ఈ సబ్జెక్టులపై పాలకుల శీత కన్ను పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. సాంకేతిక విద్య తనదైన రీతిలో సమాజాన్ని శాసిస్తుంది. అందరూ ఇంజనీర్లు అయి, అమెరికా వెళ్లి డాలర్లు కూడబెట్టాలని కలలు కనేవారే. ఆన్‌లైన్ కోచింగులు గురువుల స్థానాన్ని ఆక్రమించాయి. ఏ మాత్రం విలువలు నేర్పని ఈ ఆర్టిఫిషియల్ గురువులు పిల్లల భవిషత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పిల్లల్ని చాలా అసహనశీలురుగా తయారు చేస్తున్నాయి. ఈ కారణంగా, ఏ చిన్న ఫెయిల్యూర్ ఎదురైనా ఎదుర్కొనలేని సత్తాలేనివారిగా, డిప్రెషన్‌కు లోనై, ఆత్మహత్యలకు పాల్పడే దుర్బలురుగా పిల్లలు తయారవుతున్నారు. విద్యార్థులను ప్రయోజకులుగా, సత్ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన మన విద్య విధానం అపసవ్య దిశలో సాగుతోంది. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. భావితరాలను తీర్చిదిద్దే పాఠ్య ప్రణాళికలు రూపొందించాలి. పిల్లల్ని సమాజంలో భాగంగా పెంచాలి. వ్యక్తి ఏకాకి కాదు. వ్యక్తులు ఒకరిపై ఒకరు ఆధారపడుతారన్న విచక్షణను పిల్లలకు అలవరచాలి.

> *వ్యక్తి ఎన్నడూ ఒంటరి కాదు. కుటుంబం అనే పునాది వేసుకొని, బంధాలు, అనుబంధాలు, అనురాగాలు, ఆత్మీయతలు, స్నేహసౌభ్రాతృత్వాలు, నైతిక విలువలనే ఇటుకలుగా చేసుకొని ప్రపంచమనే మహాసౌధాన్ని నిర్మించుకున్న మనిషి, ఇప్పుడు వర్చ్యువల్ ప్లానెట్ మాయాలోకంలో జీవిస్తూ ఒంటరి వాడై, నిరర్థకుడయ్యాడు. సమాజం అంటే మానవ సంబంధాల సమ్మిళితం. కృత్రిమ బంధాలు, క్విడ్ ప్రో కో సంబంధాలు నశించి కుటుంబ బంధాలు పెరగాలి. అపుడే వసుధైక కుటుంబం తిరిగి అవతరిస్తుంది. మనిషి శాంతియుతంగా, సుస్థిరంగా జీవించగలుగుతాడు.*



టెక్నాలజీ విస్తృతమై సౌకర్యాలన్నీ అందుబాటులోకి వస్తున్న కొద్దీ మనిషి ఒంటరి అవుతున్నాడు. కృతిమ వాతావరణం సృష్టించుకొని తోటి మనిషితో కానీ ప్రకృతితో కానీ, జంతుజాలంతో కానీ సంబంధాలు తెంచుకుంటున్నాడు. పరస్పరం ఆధారపడడమనేది వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుంది. కానీ, ప్రస్తుత తరం ఈ సత్యాన్ని గుర్తించే పరిస్థితిలో లేదు. సామాజిక పరివర్తన అనేది ఎపుడూ సానుకూల దిశలో సమాజ హితంగా జరగాలి. వ్యతిరేక దిశలో పయనిస్తే తగిన మూల్యం చెల్లించకోక తప్పదని మానవ సంబంధాల నిపుణుడు మేయో అన్నాడు. వ్యక్తి ఎన్నడూ ఒంటరి కాదు. వ్యక్తి అంటే వ్యవస్థ. కుటుంబం అనే పునాది వేసుకొని బంధాలు, అనురాగాలు, ఆప్యాయతలు, స్నేహాలు, అనుబంధాలు, ఆత్మీయతలు, నైతిక విలువలనే ఇటుకలుగా పేర్చి ప్రపంచమనే మహాసౌధాన్ని నిర్మించుకున్న మనిషి ఇప్పుడు వర్చ్యువల్ ప్లానెట్ మాయాలోకంలో జీవిస్తూ ఒంటరి వాడై, నిరర్థకుడై పోయాడు. సమాజం అంటే మానవ సంబంధాల సమ్మిళితం. అవి కరువైతే మానవ మనుగడకే ప్రమాదం. కృత్రిమ బంధాలు, క్విడ్ ప్రో కో సంబంధాలు నశించి కుటుంబ అనుబంధాలు పెరిగినపుడే వసుధైక కుటుంబం తిరిగి అవతరిస్తుంది. మనిషి శాంతియుతంగా, సంతోషాతిరేకాలతో సుస్థిరంగా జీవించగలుగుతాడు.

□ డాక్టర్ ఎం. స్వర్ణలత, కాకతీయ యూనివర్సిటీ
*(నేడు ఇంటర్నేషనల్ సోషల్ వర్క్ డే)*

# ఏమని చెప్పాలి?

మాది పేద కుటుంబం. ఇటీవలే నేను డిగ్రీ పూర్తి చేశాను. మా అమ్మానాన్నలది మతాంతర వివాహం. మా నాన్న పఠాన్ (ఓసీ), మా అమ్మ షేక్ (బీసీ-బీ). నా స్కూలు, కాలేజ్ సర్టిఫికేట్లలో బీసీ-బీ అనే ఉంది. నేను, నా చెల్లి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో మా కులం పెద్ద సమస్యగా మారింది. నా టీసీలో బీసీ-బీ (దూదేకులు) అని ఉంటే... రేషన్ కార్డులో, ఓటర్ ఐడీ కార్డుల్లో నాన్న పేరు పక్కన పఠాన్ అని ఉంది. ఇంటి పత్రాల్లోనూ ఇలాగే ఉంది. మునుముందు మాకు ఉద్యోగం వస్తే, మేము బీసీ-బీ కాదని ఉద్యోగం తీసేసే ప్రమాదం ఉందా? మాకు తెలిసిన వాళ్లను అడిగితే, మతాంతర వివాహం చేసుకున్న వారి పిల్లలకు తండ్రి కులమూ, మతమే వరిస్తున్నాయని చెబుతున్నారు. అయినా ఒక పక్కన ప్రభుత్వం కులాంతర, మతాంతర వివాహాలనూ ప్రోత్సహిస్తూనే... మరో పక్క ఈ లిటిగేషన్లు పెట్టడం ఏంటీ? కులాంతర, మతాంతర వివాహం చేసుకోవడం వారి ఇష్టం. కానీ, వారికి కలిగిన పిల్లలకు తమ తల్లితండ్రుల్లోని ఎవరో ఒకరి కులాన్నీ, లేదా మతాన్ని వాడుకునే స్వేచ్ఛ లేదా? చివరికి మేము ఓసీగా చెబుతూ ఉద్యోగ ప్రయత్నం చేయాలా? ఈ విషయాలు వివరంగా తెలియచేయండి.

-ఎస్.కె.హసీనా, కర్నూలు

లీగల్ కౌన్సెలింగ్



ఒక వ్యక్తి ఏ కులానికి సంబంధించిన వాడనే విషయం కేవలం రెవెన్యూ అధికారులు ఇచ్చే కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగానే నిర్ధారించడం జరుగుతుంది. మీ నాన్న పఠాన్ అనీ, మీ అమ్మ షేక్ అనీ తెలియచేశారు. మీ స్కూల్ రికార్డులన్నింటిలోనూ బీసీ-బి గానే పేర్కొన్నట్లుగా రాశారు. ఈ వివరాలు తెలియచేస్తూ మీరు తహసీల్దారుకు దరఖాస్తు చేసుకుంటే వారి రివెన్యూ ఇన్‌స్పెక్టర్ ద్వారా సంబంధిత విషయంలో విచారణ జరిపి, కుల ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఆ ధ్రువీకరణపత్రం ఆధారంగా ఏ ఉద్యోగానికైనా ఆ కుల ప్రాతిపదికగా అర్హత పొందవచ్చు. వాస్తవానికి మీ అమ్మగారిది షేక్ (బీసీ) కులం అయినప్పటికీ, చట్టరీత్యా మీకు మీ నాన్న (ఓసీ) కులమే వర్తిస్తుంది. ఏమైనా మీరు ఏ విషయమూ దాచకుండా, పూర్తి వివరాలను అంటే మీ నాన్నగారి కులం, మీ అమ్మగారి కులం వేర్వేరుగా పేర్కొంటూ సంబంధిత తహసీల్దారుకు కుల ధ్రువీకరణ పత్రానికై దరఖాస్తు చేసుకోండి. స్కూలు రికార్డులో నమోదైన సర్టిఫికెట్లను కూడా వారికి అందచేయండి. వారు విచారణ జరిపి మీకు ఏ కుల ధ్రువీకరణ పత్రం ఇస్తారో, ఆ పత్రం ఆధారంగా మీరు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవచ్చు. అలా మీరు ఉద్యోగం పొందితే మునుముందు ఏ విధమైన ఇబ్బందులూ ఉండవు.



• ఒడ్నాల శ్రీహరి
న్యాయవాది, హైదరాబాద్

---

పేరెంటచ్



ఎవరికి వారు చదువుకోవడం ఒక విధానం. అయితే, సామూహిక అధ్యయనం (గ్రూప్ స్టడీ)లో అంతకు పదింతల ప్రయోజనం ఉంటుంది. సమగ్రంగా అర్థం కావడానికి సామూహిక అధ్యయనం అనేది ఒక సానుకూల విధానం.

## అవగాహన పెరుగుతుంది!

- సామూహిక అధ్యయనంలో పది మంది ఒకే చోట కూర్చున్నా ముందు తమలో తామే చదువుకుంటారు. ఒక స్థాయి అవగాహన ఏర్పడిన తర్వాత మిత్రులంతా పరస్పరం పంచుకోవడానికి సిద్ధమవుతారు.
- పిల్లలు ఎవరికి వారు చదువుకునేటప్పుడు తనకు అర్థమయ్యిందే నూటికి నూరు శాతం కరెక్ట్ అన్న భావనకు లోనవుతారు. సామూహిక అధ్యయనంలో అలా ఉండదు. తనకు భిన్నంగా ఎదుటి విద్యార్థికి ఎలా అర్థమయ్యిందో తెలిసిపోతుంది.
- ఒకసారి రాయడం అంటే అది 10 సార్లు చదవడానికి సమానం అంటారు. అలాగే గ్రూప్ స్టడీ అనేది 10 సార్లు తనలో తాను చదువుకోవడానికి సమానం.
- సామూహిక అధ్యయనంలో అందరూ అన్నీ చదవాల్సిన అవసరం ఉండదు. ఒక్కొక్కరికి ఒక సబ్జెక్ట్ మీద పట్టు ఉన్నా దాన్ని మిగతవారు సులువుగా ఆకళింపు చేసుకునే అవకాశం లభిస్తుంది.

---



ఆదర్శం



**చిన్న వయసులోనే పెళ్ళి...**

**అత్తింట్లో అగచాట్లు...**

**ముగ్గురు ఆడబిడ్డల బాధ్యత...**

**తల్లితండ్రులు పెట్టిన భూదేవి అనే పేరును సార్థకం చేసుకుంటూ అన్నిటినీ భరించి నిలబడ్డారామె.**

**ఒంటరి పోరులో గెలిచి, అంతరిస్తున్న చిరుధాన్యం పంటలను ప్రోత్సహిస్తున్నారు,**

**మరోవైపు చిన్న పరిశ్రమలతో తోటివారికి ఉపాధి కల్పిస్తున్నారు.**

**'ఆదివాసీ బిడ్డగా నాకు ఆకలి విలువ తెలుసు!' అంటున్న భూదేవి నారీశక్తికి అచ్చమైన ప్రతిరూపం.**

# ఉలవలు తిని బతికా!

"గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీల జీవితాలు దయనీయంగా ఉంటాయి. సాటి మనిషిగా వారికోసం ఏదైనా చెయ్యాలని మా నాన్న చిన్నయ్య తపన పడేవారు. మాది శ్రీకాకుళం జిల్లా హిరమండలం పరిధిలోని కొండ చొర్లంగి ఆదివాసీ గ్రామం. మా నాన్న పాతపట్నం మండలం కొరసవాడలో విశాఖ గ్రామీణ బ్యాంకులో చిన్న ఉద్యోగం చేసేవారు. ఆదివాసీల శ్రేయస్సు కోసమే ఎప్పుడూ ఆలోచించే నాన్న గ్రామాల్లో ఉద్యమాలు చేసేవారు. దీనివల్ల ఆయన ఉద్యోగం వదులుకోవాల్సి వచ్చింది. ఆ తరువాత నాన్న 'ఆదివాసీ వికాస్ సంఘం' ఏర్పాటు చేసారు. అప్పట్లో నేను ఆరో తరగతి చదువుతున్నాను. నాన్న అడుగుజాడల్లో నడుస్తూ భూ పోరాటాల్లో పాల్గొనేదాన్ని. నాకు ఆయనే స్ఫూర్తి.

**చచ్చిపోదామనుకున్నా!**

నాది బాల్య వివాహం. అప్పుడు నాకు పదేళ్ళు. మా అమ్మ సోదరుడు అంటే నా మేనమామ నాగరాజుతో... లోకం అంటే ఏమిటో తెలియని రోజుల్లోనే నాకు పెళ్ళయిపోయింది. నాకు ముగ్గురు బిడ్డలు పుట్టారు. అందరూ ఆడపిల్లలే కావడంతో నా భర్తలో మార్పు వచ్చింది. నాతో ఉండనంటూ దూరంగా వెళ్ళిపోయారు. మరో వైపు అత్తింట్లో వేధింపులు మొదలయ్యాయి. ముగ్గురు చిన్న బిడ్డలను సాకుతూ, ఇంటి పనులు చేస్తూ, కడుపునిండా తిండి లేకుండా ఎన్నో రోజులు కష్టాలు పడ్డాను. రోజంతా వ్యవసాయ కూలి పనికి వెళితేనే తిండి దొరికేది. ముగ్గురు ఆడబిడ్డలతో చాలీచాలని తిండితిన్న రోజులు ఎన్నో! ప్రాణాలు నిలబెట్టుకోవడానికి ఉడికించిన ఉలవలు, జామకాయలు తిని బతికిన రోజులున్నాయి. ఆ రోజులు తలచుకుంటే, కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. ఒక రోజు ఈ జీవితం ఎందుకని విరక్తి కలిగింది. అర్ధరాత్రి ఇంట్లోంచి బయటకు వెళ్ళి చచ్చిపోదామనుకున్నాను. ఆ సంగతి నా తల్లితండ్రులకు తెలిసి, నన్ను మందలించారు. 'పిల్లలు అనాథలు అవుతారు కాబట్టి సర్దుకుపోవాల'ని నచ్చజెప్పారు.

**ఆ బాధలు మరొకరు పడకూడదని...**

మా అమ్మానాన్నల మాటలు నన్ను ఆలోచింపజేశాయి. మరోవైపు నా తోటి ఆదివాసీ మహిళలు పడుతున్న ఇబ్బందులు గుర్తుకువచ్చాయి. బాల్య వివాహాలు గిరిజన ప్రాంతంలో సహజం. తల్లిదండ్రులు ఆడబిడ్డలకు పెళ్లి చేసి బాధ్యత వదిలించుకోవాలని చూస్తున్నారు. నాలా ఎందరో బాలికలు పెళ్ళయ్యాక దుర్భర జీవితం అనుభవిస్తున్నారు. నేను ఒంటరి మహిళగా పడిన బాధలు ఇంకో మహిళకు రాకూడదని భావించాను. ఆ క్షణమే నాలో ఒక సంకల్పం ఏర్పడింది. ఆపదలో ఉన్న ఆదివాసీ మహిళలకు అండగా నిలవాలనుకున్నాను. మా నాన్న చిన్నయ్య ఆశయ సాధన కోసం 'చిన్నయ్య ఆదివాసీ వికాస్ సంఘా'న్ని ఏర్పాటు చేశాను. గిరిజనుల హక్కుల కోసం పోరాటాలు చేపట్టాను. ఒంటరి మహిళగా నేను పడుతున్న బాధలు మరో మహిళ పడకూడదు. వారు ఆర్థిక స్వావలంబన సాధించాలి అనుకున్నాను. దీనికోసం సీతంపేట సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) సహకారం తీసుకున్నాను. బిస్కెట్ల ఫ్యాక్టరీ, సుద్దముక్కల తయారీ, చిరు ధాన్యాలతో చిరుతిండ్లు, టైలరింగ్ యూనిట్ లాంటివి ఏర్పాటు చేశాను. వాటిలో ఇప్పుడు 239 మంది పని చేస్తున్నారు.

**గిరిజనులకు భరోసా**

ఇలా ఉండగా, మరో వైపు ఏజెన్సీలో చిరుధాన్యాల సాగు క్రమేపీ తగ్గిపోతోంది. కొన్ని గిరిజన గూడేల్లో రకరకాల చిరు ధాన్యాలు పండిస్తున్నా వాటిని తినేవారే లేరు. చిరు ధాన్యాల్లో పోషక విలువ గురించి ఆదివాసీలకు తెలీదు. వాటి సాగుకు ప్రోత్సాహం అందించడం కోసం రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని 2017లో ఏర్పాటు చేశాం. అందులో వెయ్యిమంది సభ్యులు ఉన్నారు. చిరుధాన్యాలను సేకరించి, రైతులకు మద్దతు ధర అందేలా నా వంతు ప్రయత్నం చేస్తున్నాను. ఈ రోజు ఆదివాసీలు పండించే రాగులు, కందులు, జొన్న, మినుములు వంటివి రసాయన ఎరువులు వినియోగించకుండా సాగు చేసినవే! సీతంపేట, హిరమండలం, కొత్తూరు, భామిని మండలాల్లో వందలాది ఆదివాసీ కుటుంబాలతో చిరు ధాన్యాల సాగు, మార్కెటింగ్ చేయిస్తున్నాం. సీతంపేటలో చిరు ధాన్యాలతో రకరకాల బిస్కెట్లు, కేక్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పి అనేకమంది ఆదివాసీలకు ఉపాధి కల్పిస్తున్నాం. అలాగే చిరు ధాన్యాల కొనుగోలుకు దోహదం చేయడం ద్వారా గిరిజనులకు ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాననే తృప్తి నాకుంది. మరోవైపు ఆదివాసీల్లో చైతన్యం కలిగించడం కోసం కార్యక్రమాలు చేపడుతున్నాను. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరిస్తున్నాం. కష్టాల్లో ఉన్న మహిళలకు మా సంఘం బాసటగా నిలుస్తోంది. అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు సాగుభూమి కల్పించాలనేది నా లక్ష్యం. అందులో భాగంగా వారికి పట్టాలు అందేలా కృషి చేస్తున్నాం. పోడు వ్యవసాయం చేసేవారి సమస్యలు పరిష్కరించడం, వారికి ఆర్థిక భద్రత కల్పించడం నాకు సంతోషంగా ఉంది. అలాగే పంచాయతీ రాజ్ చట్టాన్ని గిరిజన ప్రాంతాలకు వర్తింపజేసే 'పెసా' చట్టం ద్వారా గ్రామ సభల నిర్వహణకు ప్రోత్సహిస్తున్నాను. చెంచుల అభ్యున్నతి కోసం, రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కులు అందడం కోసం పని చేస్తున్నాను.

### సంతోషంగా ఉంది!

"చిన్నయ ఆదివాసీ వికాస్ సంఘం ద్వారా భూదేవి మంచి కార్యక్రమాలు చేపడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, బరువు తగ్గిన పిల్లలకు అదనపు పౌష్టికాహారం అందిస్తున్నారు. నారీశక్తి పురస్కారంతో ఆమె కృషికి గుర్తింపు దక్కింది."



**-పి. రంగలక్ష్మి,** సీతంపేట సిడిపివో

**రక్తహీనతపై పోరు**

ఆదివాసీ మహిళల్లో రక్తహీనత సమస్య అధికం. సరైన పోషక విలువలున్న ఆహారం తీసుకోని కారణంగా రక్తహీనత ఏర్పడి, ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖతో కలిసి గిరిజన పల్లెల్లో కాలిబాటన తిరిగి పౌషకాహారం గురించి మహిళల్లో అవగాహన కల్పించాం. "దీనికి పరిష్కార మార్గం మన దగ్గరే ఉంది. మనం పండించే చిరుధాన్యాలలో అనేక పోషక విలువలు ఉన్నాయి. వాటిని మనం తిన్న తరువాతే ఇతరులకు అమ్ముకోవాలి" అని గిరిజనులకు నచ్చజెప్పాం

**ఈ పురస్కారం ఎంతో ప్రత్యేకం!**

గిరిజన రైతుల సంక్షేమం కోసం నేను చేస్తున్న కృషికి గుర్తింపుగా ఎన్నో అవార్డులు వచ్చాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మకమైన 'నారీశక్తి' పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోవడం చాలా గొప్పగా అనిపిస్తోంది. ఇది కేవలం నా కృషి వల్ల వచ్చిందని అనుకోవడం లేదు. ప్రతి ఆదివాసీ మహిళకూ దీనిలో పాత్ర ఉంది. ఈ పురస్కారం నాలో ఆత్మస్థయిర్యాన్నీ, బాధ్యతనూ పెంచింది. మా నాన్న ఆశయ సాధనకు మరింత దగ్గరవుతున్నాననిపిస్తోంది. ఇప్పటికీ మా అమ్మ పార్వతమ్మ నాతోనే ఉంటోంది. మా పెద్దమ్మాయి మున్నా బీటెక్, రెండో అమ్మాయి విష బీఫార్మసీ చేస్తున్నారు. మూడో అమ్మాయి గౌతమి ట్రిపుల్ ఐటీలో చదువుతోంది. లక్ష్యాన్ని చేరుకోవాలనే తపనతో శ్రమించి, ధైర్యంతో ముందడుగేస్తే విజయం సొంతమవుతుందని నా పిల్లలకూ, తోటి ఆదివాసీ మహిళలకూ చెబుతూ ఉంటాను. అందుకు నా జీవితమే ఓ ఉదాహరణ."

• **పసుపురెడ్డి లోకేశ్వరరావు, వెంకట్,** శ్రీకాకుళం
ఫొటోలు: **మణికంఠ**

---

**ఎంత ఎత్తయిన పర్వతమైనా తాషి, నుంగ్షిమాలిక్‌ల ముందు చిత్తు కావాల్సిందే. ఈ కవలలిద్దరూ కలసి ఈ భూమ్మీద అత్యంత ఎత్తయిన ఏడు శిఖరాలపై పాదం మోపి, పర్వాతోరాహకుల 'గ్రాండ్‌స్లామ్' సాధించారు. ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన తొలి మహిళా కవలలుగా గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కారు.**

# కవలల కల నెరవేరిన వేళ!

రిటైర్డ్ కల్నల్ వీఎస్ మాలిక్ అందరి తండ్రుల్లాంటివాడు కాదు. ఆయన తన కూతుళ్లు తాషి, నుంగ్షిమాలిక్‌లను పై చదువులు చదవమని ఒత్తిడి చేయలేదు. ఇంటర్‌లో ఇద్దరూ 90 శాతానికి పైగా మార్కులు సాధించినా దూరవిద్యలో చదువుకుంటూ ఏదైనా నేర్చుకోమని వారికి సూచించాడు. అలా వాళ్లిద్దరూ జర్నలిజం, మాస్‌కమ్యూనికేషన్ వైపు అడుగులు వేశారు. సామాజిక సమస్యలు మీద రచనలు చేశారు. చదువు, రచన, డ్యాన్స్‌లో పట్టు సాధించారు.

**ట్విన్ ఎవరెస్టర్స్...**

తండ్రి వీఎస్ మాలిక్ ఈసారి తన కూతుళ్ల జీవితాన్ని ఊహించని మలుపుతిప్పారు. ఇద్దరు కూతుళ్లను 2009లో ఉత్తరకాశీలోని 'నెహ్రూ మౌంటెనీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో బిగినర్స్‌గా చేర్చారు. శిక్షణలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఈ ఇద్దరు వెనుకడుగు వేయలేదు. వారి శ్రమను చూసి శిక్షకులు ప్రోత్సహించారు. 'మీరిద్దరూ కచ్చితంగా ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కుతారు' అనేవారు. కోచ్‌లు వారిద్దరినీ 'ట్విన్ ఎవరెస్టర్స్' అని పిలిచేవారు. కఠిన శ్రమతో శిక్షణలో అన్ని స్థాయిల్లోనూ ఏ గ్రేడ్ సాధించారు. తాషి, నుంగ్షీలు ఇనస్ట్రక్టర్ గ్రేడ్‌లో ఉత్తీర్ణులయ్యారు. ముప్పై మంది శిక్షార్థుల్లో ముగ్గురికి మాత్రమే ఈ గ్రేడ్ వచ్చింది.

**అదే ఊపులో గ్రాండ్‌స్లామ్...**

"ఎవరెస్ట్ ఎక్కడానికి 2010లో ప్రయత్నాలు ప్రారంభించాం. 2013లో అనుకున్నది సాధించాం. అయితే అక్కడే మరో మహాప్రయత్నానికి పునాది పడింది. ఏడుఖండాల్లో ఎత్తైన శిఖరాలన్నింటినీ ఎక్కడాన్ని పర్వతారోహకుల 'గ్రాండ్‌స్లామ్' అంటారు. మాతోపాటు ఉన్న కొంతమంది పర్వతారోహకులు ఎవరెస్ట్ ఎక్కితే వారి లక్ష్యం పూర్తయి గ్రాండ్‌స్లామ్ సాధించినట్టే. అన్ని పర్వతాల్లోకి ఎవరెస్ట్ ఎక్కడమే కష్టం. 26 వేల అడుగుల ఎత్తైన శిఖరం మీద ఏ క్షణంలోనయినా ప్రాణానికి ప్రమాదం ఏర్పడొచ్చు. ఆక్సిజన్ అందదు. దీన్ని పర్వతారోహకులు 'డెత్ జోన్' అంటారు. మేము





స్ఫూర్తి

అప్పటికే కిలిమాంజారో పర్వతం ఎక్కాం. మా రెండో ప్రయత్నంగా ఎవరెస్ట్ ఎక్కే పనిలో ఉన్నాం. ఈ ప్రయత్నంలో గెలిస్తే భూమ్మీద ఎత్తైన ఏడు పర్వతాలను సులభంగా ఎక్కగలమని భావించాం. ఆ విధంగా 2013లో ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కాం" అని కవలలిద్దరూ నాటి సంగతులను గుర్తుచేసుకున్నారు.

**అంటార్కిటికా సాహస యాత్ర!**

అంటార్కిటికాలో విన్సన్ మాసిఫ్ పర్వత శిఖరాన్ని అధిరోహించడానికి తాషి, నుంగ్షీలు చాలా కష్టపడ్డారు. అక్కడ -7 నుంచి -40 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. రోజులో 22 గంటల పాటు తీక్షణంగా పరుచుకునే వెలుగు, ప్రమాదకరమైన మంచునదులు.. ఇలా ధ్రువాల్లో పలు ఇబ్బందులు ఎదుర్కొని మరీ 2014లో విన్సన్ మాసిఫ్ పర్వత శిఖరాన్ని ఎక్కారు. "చివరకు మా ప్రయత్నం అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్ మాసిఫ్ ఎక్కడంతో పూర్తయింది. 18 రోజులు అంటార్కిటికాలో సాహసయాత్రలా గడిచింది. పర్వతారోహణలో కీలకమైన సమయంలో పీరియడ్స్ రావడం చెప్పలేనంత బాధ కలిగిస్తుంది. అన్నింటినీ ఓర్చుకొని లక్ష్యాన్ని చేరుకున్నాం" అని తాషి, నుంగ్షిమాలిక్‌లు తాము పడిన కష్టాలను వివరించారు.

**నాన్న తోడుగా...**

"శిఖరాలు ఎక్కేటప్పుడు త్వరగా శరీర బరువును కోల్పోతాం. ఎవరెస్ట్‌ను ఎక్కే ప్రయత్నంలో మేమిద్దరం 12 కిలోల బరువు తగ్గాం. వెంటవెంటనే పర్వతాలను ఎక్కాల్సిరావడంతో శక్తిని పుంజుకోవడానికి స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఏరోబిక్స్ చేసేవాళ్లం. నాన్న మాకు కోచ్‌గా, న్యూట్రిషనిస్ట్‌గా ఉండడంతో మా పని సులువయింది. జీవితంలోనే కాదు గ్లాండ్‌స్లామ్ సాధించడంలోనూ నాన్నే మా వెన్నంటి ఉండి మమ్మల్ని నడిపించాడు" అన్నారు. ఆఫ్రికాలో టాంజానియాలోని 5895 మీటర్ల ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడంతో తాషి, నుంగ్షీల గ్రాండ్‌స్లామ్ పూర్తయింది. ఇలా ప్రపంచంలోనే తొలిసారి భూమ్మీద అత్యంత ఎత్తయిన ఏడు శిఖరాలను అధిరోహించిన తొలి మహిళా కవలలుగా 'గిన్నిస్‌బుక్'లోనూ చోటు దక్కించుకున్నారు. ఇటీవలే ఈ కవలలిద్దరూ రాష్ట్రపతి నుంచి 'నారీశక్తి' పురస్కారాన్ని అందుకున్నారు.

---

# క్యూట్ లుక్ కోసం...

రెడ్‌కార్పెట్ మీద సినీతారలు, సెలబ్రిటీలు కొత్తరకం దుస్తుల్లో, యాక్సెసరీలతో వయ్యారాలు పోతుంటే కళ్లప్పగించి చూస్తాం. ఈ మధ్య సెలబ్రిటీ యాక్సెసరీస్‌లలో చిన్ని హ్యాండ్‌బ్యాగ్ వచ్చి చేరింది. జేబులో పట్టేంతగా ఉండే ఇవి వివిధ రంగులు, సైజు, ఆకారాల్లో లభిస్తున్నాయి. ఈ చిన్ని బ్యాగులు సౌకర్యంగా, అందంగా ఉండడంతో వీటి వాడకం ఈ మధ్య ఎక్కువైంది. పెద్ద, చిన్న పూసలతో గులాబీ, పసుపు రంగుల్లో లభించే వీటికి డిమాండ్ పెరుగుతోంది. ప్రియాంకా చోప్రా, శిల్పాశెట్టి, అనన్యా పాండే వంటి సినీతారలు డ్రెస్సింగ్, మేకప్‌కి మ్యాచింగ్ ఉండే వాటిని ఎంచుకొని వయ్యారాలు ఒలికిస్తున్నారు. పార్టీలు, ఫంక్షన్లకు వెళ్లే కాలేజీ అమ్మాయిలు, ఉద్యోగినులకు ఈ చిన్ని బ్యాగులు క్యూట్‌గా ఉండి కొత్త లుక్ తెస్తాయి.

స్టయిల్



ఎగ్జామ్ ఫీవర్!

పరీక్షలు దగ్గరకొచ్చేకొద్దీ గుండెల్లో దడ పెరుగుతోందా?
ఆకలి, నిద్ర తగ్గిపోయి, తెలియని గుబులు ఆవరిస్తోందా?
ఎంత చదివినా, ఇంకా ఏదో మిగిలిపోయిందని అనిపిస్తోందా?
గండం గట్టెక్కగలమో, లేదో అనే ఆందోళన వేధిస్తోందా?
ఇలాంటి ఎగ్జామ్ ఫీవర్ పరీక్షల వేళ అత్యంత సహజం!
అయితే ఈ ఇబ్బందులన్నీ అర్థం లేనివనీ... వీటిని అధిగమించి
పరీక్షల్లో విజయం సాధించడం సులభమేననీ అంటున్నారు వైద్యులు!
వాళ్లు చెబుతున్న మెలకువలు ...

# పరీక్షేమీ కాదు!



పుస్తకాలతో గంటల తరబడి గడిపేసే పిల్లలు ఉంటారు. పరీక్షల ముందు మాత్రమే పుస్తకాల దుమ్ము దులిపే పిల్లలూ ఉంటారు. అయితే ఈ రెండు వ్యవహార శైలులూ సరైనవి కావు. చదువు విషయంలో అతి ఎంత అనర్థమో, ప్రణాళిక లేకుండా పరీక్షలకు సిద్ధపడడమూ అంతే అనర్థదాయకం. కాబట్టి పరీక్షల్లో మెరుగైన ఫలితం సాధించాలంటే కొన్ని నియమాలు పాటించాలి.

### మూడు 'పీత'లు!

విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యేటప్పుడు మూడు సూత్రాలు పాటించాలి. అవేమిటంటే... ప్రిపరేషన్, ప్లానింగ్, పర్‌ఫార్మెన్స్!

**ప్రిపరేషన్:** కొందరు పిల్లలు కష్టపడి చదివే క్రమంలో విపరీతమైన ఒత్తిడికి లోనవుతూ ఉంటే సమస్యగానే భావించాలి. ఇందుకు వారిలో పరీక్షల్లో నెగ్గలేమేమోననే భయం, ఆత్మవిశ్వాసం లోపించడం ప్రధాన కారణం. ఇలాంటి పిల్లలు చదివిందే పదే పదే చదువుతూ ఉంటారు. పరీక్షల వరకూ సమయం పెట్టుకుని, అప్పటిలోగా రివిజన్ పూర్తి చేయాలని ధ్యేయంగా పెట్టుకుంటారు. తీరా పరీక్షలు దగ్గరకొచ్చేసరికి కొంత పోర్షన్ మిగిలిపోతూ ఉంటుంది. అవి అంతకుముందు పట్టు ఉన్న పాఠాలే అయినా, లెక్క ప్రకారం చదవలేకపోయారు కాబట్టి, ఆ పాఠాలు తమకు ఒంటపట్టలేదనే భావనలో ఉండిపోతారు. ఇలా ఆందోళనకు లోనవకుండా ఉండాలంటే పరీక్షలకు ఎంతో ముందుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధపడాలి. అలాగే ఒకసారి ప్రిపేర్ అయి ఉంటే, అంతకు మించి మరో ప్రిపరేషన్ అవసరం లేదు. ఇలా చేస్తే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.

**ప్లానింగ్:** కష్టమైన సబ్జెక్టును చివరికి నెట్టేసి, తేలికైన సబ్జెక్టును ముందు చదివేస్తూ ఉంటారు. ఇలా చేస్తే కష్టమైన సబ్జెక్టు ఎప్పటికీ కష్టంగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. అలాగే 'నాకు మ్యాథ్స్ రాదు, నాకు సైన్స్ రాదు' అనే స్థిరమైన ఆలోచనతో పరీక్షలకు సిద్ధపడడం సరి కాదు. వాటికి ప్రథమ స్థానం కేటాయించి సిద్ధపడాలి. అన్ని సబ్జెక్టులనూ సమమైన ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటే తప్పక మెరుగైన ఫలితం సాధించగలుగుతారు.

**పెర్ఫార్మెన్స్:** పరీక్ష హాల్లో అవసరం లేని భయానికీ, ఆందోళనకూ గురైతే, హఠాత్తుగా మతిమరుపునకు లోనయ్యే ప్రమాదం ఉంటుంది. చదివిన పాఠాలేవీ సమయానికి గుర్తుకురావు. కాబట్టి ఒత్తిడిని మొదట వదిలేయాలి. ఎంత బాగా సిద్ధపడినా చదవని ప్రశ్నలు కూడా పరీక్షల్లో ఎదురవుతాయనే వాస్తవాన్ని మనసులో పెట్టుకుని పరీక్ష హాల్లోకి అడుగు పెట్టాలి. ప్రశ్నాపత్రంలో తెలియని ఒకటి, రెండు మార్కుల ప్రశ్నలు చూసి ఒత్తిడికి లోనయితే, మిగిలిన 80 మార్కుల ప్రశ్నల జవాబులు రాయలేక గందరగోళానికి లోనవుతారు. కాబట్టి స్థిమితంగా కూర్చుని, తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాసి, చివర్లో తెలియని ప్రశ్నల గురించి ఆలోచన చేయాలి. తెలిసినవి మొదట రాస్తే సహజంగా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

### పరీక్ష హాల్లో....

ప్రశ్నాపత్రం తీసుకున్న వెంటనే సమాధానాలు రాయడానికి పరుగులు పెట్టకుండా శ్వాస, గుండె వేగం, కండరాలు రిలాక్స్‌డ్‌గా ఉన్నాయో, లేదో గమనించుకోవాలి. అవి వేగంగా ఉంటే, నెమ్మదించేవరకూ కొన్ని నిమిషాల సమయం తీసుకోవాలి.

రెండు నిమిషాల పాటు కళ్లు మూసుకుని, ముక్కు ద్వారా శ్వాస పీల్చుకుని, నోటి ద్వారా వదిలేస్తూ ఉండాలి. శ్వాస పీల్చుకునేటప్పుడు కండరాలు బిగపడుతూ, వదిలేటప్పుడు కండరాలు రిలాక్స్ చేయాలి.



**- డాక్టర్ కళ్యాణ చక్రవర్తి,**
సైకాలజిస్ట్, హైదరాబాద్.

### పరీక్షలకు ఒక్క రోజు ముందు...

పరీక్షలకు ప్రిపరేషన్ ఎంత అవసరమో, రిలాక్సేషన్ కూడా అంతే అవసరం. ఇందుకోసం....

**రాత్రి మేలుకోవడం:** పరీక్షకు ముందు రోజు రాత్రి ఎక్కువ సమయం చదవడం అనవసరం. మెదడు చురుగ్గా పనిచేయడానికి, జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉండడానికి కంటి నిండా నిద్ర ఎంతో అవసరం.

**ఆహారం:** సమయం వృథా అవుతుందనీ, వాంతి వచ్చేస్తుందనీ తినకుండా ఉండడం సరి కాదు. నిజానికి పరీక్షల రోజుల్లో మిగతా రోజుల కన్నా ఎక్కువగా క్యాలరీలు అవసరం అవుతాయి. కాబట్టి పౌష్ఠికాహారం తీసుకోవాలి. దాంతో మెదడుకు అవసరమైన గ్లూకోజ్ అంది చురుగ్గా ఉంటుంది.

**స్టడీ బ్రేక్స్:** అదే పనిగా గంటలతరబడి చదవకుండా, మధ్య మధ్యలో బ్రేక్ తీసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తే మెదడు అలసిపోదు.

**ఆందోళనలు:** పరీక్షకు ముందు రోజు తగాదాల్లో తలదూర్చడం, ఉద్రేకానికి కారణమయ్యే ఎడ్రినలిన్ హార్మోన్‌ను పెంచే భయంకరమైన వార్తలు చూడడం, చదవడం సరికాదు.

### తల్లితండ్రులు ఇలా నడుచుకోవాలి!

'పరీక్షల్లో నెగ్గితేనే జీవితం. లేదంటే విలువైన విద్యాసంవత్సరం వృథా' అనే ధోరణిలో తల్లితండ్రులు పిల్లలతో వ్యవహరించకూడదు. ఇలాంటి ప్రవర్తన పిల్లల్లో ఒత్తిడిని పెంచుతుంది. 'నీ వరకు నువ్వు కష్టపడి చదివావు, ఫలితం నీ చేతుల్లో ఉండదు. కాబట్టి సాధ్యమైనంత బాగా పరీక్షలు రాయి. ఫలితం ఎలా వచ్చినా మేము అంగీకరిస్తాం' అనే చందంగా అందరు తల్లితండ్రులు నడుచుకోవాలి. ఇలాంటి మాటలతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

## ఇలా ఎదుర్కోవాలి

**పరీక్షల ముందు వరకూ చలాకీగా చదువుకునే పిల్లలు ఒక్కోసారి హఠాత్తుగా డీలా పడతారు. నిద్రలేమి, అజీర్తి, జ్వరం లాంటి ఇబ్బందులకు లోనవుతారు. ఇలాంటప్పుడు మూల కారణాలను కనిపెట్టి, తదనుగుణంగా వారికి ఆసరా అందించాలి.**

### నిద్రలేమి!



పరీక్షల వేళ పిల్లల్లో ఒత్తిడి సహజం. ఆ ప్రభావంతో ఆకలి మందగిస్తుంది. ఫలితంగా సరిపడా పోషకాలు అందక, వ్యాధినిరోధకశక్తి కుంటుపడుతుంది. దాంతో రాత్రుళ్లు నిద్ర పట్టదు. నిద్రలేమితో పలు శారీరక సమస్యలూ మొదలవుతాయి. దాంతో తేలికగా ఇన్‌ఫెక్షన్ల బారిన పడతారు. దాంతో నిద్ర పట్టని పరిస్థితి తలెత్తుతుంది. అందువల్ల పరీక్షలకు చాలా ముందునుంచే పిల్లలకు పౌష్ఠికాహారం విషయంలో శ్రద్ధ చూపడం చాలా అవసరం. ఆహారంలో పోషకాల లోపమేమీ లేకపోయినా నిద్రలేమి ఉంటే, అది పూర్తిగా మానసిక అంశం అవుతుంది. పరీక్షల తాలూకు ఒత్తిళ్లు, భయాందోళనలను తగ్గించడానికి అవసరమైతే మానసిక నిపుణులను కలవవచ్చు.

### తలనొప్పి!

పరీక్షల సమయంలో తలనొప్పికి నిద్రలేమి ప్రధాన కారణం. దీనికి 'డోలో' మాత్ర ఇస్తే తగ్గిపోతుంది. అవసరాన్ని బట్టి ఒకటి రెండు సార్లు ఇవ్వవచ్చు. అప్పటికీ తగ్గకపోతే, డాక్టర్‌ను సంప్రతించడం తప్పనిసరి! ఒక వేళ మైగ్రేన్ తలనొప్పి అయితే, మైగ్రేన్ మందులు ఇవ్వాల్సి ఉంటుంది. కొంత మంది పిల్లల్లో దృష్టి లోపాల వల్ల కూడా తలనొప్పి రావచ్చు. అంతకుముందు నుంచే ఆ సమస్య ఉన్నా, పరీక్షల సమయంలో రెట్టింపు ఒత్తిడి ఉండడం వల్ల తలనొప్పి రావచ్చు. ఈ స్థితిలో నేత్ర వైద్యుడిని కలవడమే పరిష్కారం.



### గుండె దడ!



చదువు తాలూకు ఒత్తిడితో కూడా పిల్లల్లో గుండె దడ రావచ్చు. ఒళ్లంతా చెమటలు పట్టవచ్చు. సాధారణంగా ఈ ఒత్తిడి కొద్ది సేపట్లో దానంతట అదే తగ్గిపోతుంది. ఒకవేళ ఆ దడ ఎక్కువ సేపు ఉంటే దాన్ని తీవ్రంగానే పరిగణించాలి. కొంత మంది పిల్లల గుండె దడకు నిద్రలేమి కూడా కారణం కావచ్చు. పిల్లల్లో థైరాయిడ్ సమస్యతో కూడా గుండె దడ రావచ్చు. కొంత మంది పిల్లల్లో బాల్యం నుంచే గుండెకు సంబంధించిన సమస్య ఏదైనా ఉండవచ్చు. ఈ విషయంలో సొంత వైద్యానికి పోకుండా వెంటనే డాక్టర్‌ను కలవాలి.

### వాంతులు...



ఒత్తిళ్లతో కొందరు పిల్లలకు ఆకలి మందగిస్తే, మరికొందరికి ఆకలి పెరుగుతుంది. ఈ రెండూ పరీక్షల సమయంలో పిల్లలను ఇబ్బందిపెట్టేవే! అతిగా తింటే మలబద్ధకం, ఇన్‌ఫెక్షన్లు తప్పవు. కడుపు ఉబ్బరంతో పాటు, వాంతులూ అవవచ్చు. కాబట్టి అవసరాన్ని బట్టి వైద్యులను కలవాలి. అలాగే మలబద్ధకాన్ని నిరోధించడానికి పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే పండ్లు ఇవ్వాలి. చల్లని పదార్థాలకు దూరంగా ఉంచాలి. గోరు వెచ్చని నీళ్లు తాగనివ్వాలి

### జ్వరం!



విపరీతమైన ఆందోళనతో ఒత్తిడికి లోనై పరీక్షల సమయంలో పిల్లలకు జ్వరం రావచ్చు. ఇలాంటప్పుడు జ్వరం తగ్గే మాత్రలతో పాటు, మానసిక స్థయిర్యం పెంచేలా పిల్లలతో వ్యవహరించాలి.

### ఒంటి నొప్పులు!



పరీక్షల వేళ కొంత మంది పిల్లలు ఒంటి నొప్పులతో బాధపడుతుంటారు. దీనికి శరీరంలో విటమిన్లు, లవణాలూ తగ్గడం కారణం కావచ్చు. ఇలాంటి వారికి పండ్లు తరచూ ఇవ్వాలి. నూనె పదార్థాలను ఆపేయాలి. నిద్రలేమితో ఆహారం పూర్తిగా జీర్ణం కాక పోషకాల శోషణ జరగదు. ఫలితంగా కూడా ఒంటి నొప్పులు రావచ్చు. కాబట్టి విటమిన్లు, ఖనిజ లవణాలు లభించే పండ్ల రసాలు ఇస్తే మేలు. పరీక్షల తరుణంలో, రాత్రి పూట 8 గంటల లోపే భోజనం ముగించేలా చూడటం కూడా అవసరమే! అలా తినడం వల్ల ఆహారపదార్థాలు పూర్తి స్థాయిలో జీర్ణమై, మొత్తం పోషకాలు ఒంటపడతాయి.



**- డాక్టర్ నవోదయ్ గిల్లా**
కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్,
హైదరాబాద్.

# గొంతు సమస్యలకు...

హోమియో



జీర్ణక్రియ అస్తవ్యస్తం కావడంతో కొందరిలో గొంతు ఒరుసుకుపోతుంది. గొంతు వద్ద ఏదో నొక్కుతున్న భావన కలగడం, తెమడ జిగటగా ఉండి బయటికి రావడం కష్టం కావడం, కొండనాలుకలో వాపు కనిపిస్తాయి. ఈ స్థితిలో సల్ఫర్, సేఫియా, ఆర్సెనిక్ ఆల్బ్ వంటి మందులు బాగా పనిచేస్తాయి. బ్రయోనియా, పల్సటిల్లా, మందులు కూడా ఉపయోగించవచ్చు.

కొందరిలో జీర్ణాశయ సమస్యల వల్ల గొంతు, గవద బిళ్లలు ఎర్రబారడం, గొంతు ఒరిపిడికి గురికావడంతో పాటు గొంతు పొడిబారినా దప్పిక అనిపించకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో సాయంత్రం వేళ ఈ లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. చలివేయడంతో పాటు గొంతులో జిగటగా అంటుకుపోతున్న భావన కలుగుతుంది. ఇలాంటి వారికి పల్సటిల్లా మందు బాగా పనిచేస్తుంది.

**- బి. అనిల్ కుమార్,** హోమియో వైద్యులు, హైదరాబాద్.

అధ్యయనం

## ఈ అన్నంతో
# షుగర్ పెరగదట!



అన్నం అనగానే వణికిపోతారు కొందరు. ఎందుకంటే అది శరీరం బరువునూ శరీరంలో షుగర్ నిల్వల్నీ పెంచుతుంది. అయితే శ్రీలంకలోని కాలేజ్ ఆఫ్ కెమికల్ సైన్సెస్‌కు చెందిన పరిశోధక బృందం ఓ కొత్త విధానం ద్వారా వరి అన్నంలోని క్యాలరీలను 50 శాతం దాకా తగ్గించే ఒక విధానాన్ని కనుగొన్నది.

ఇంతకూ ఆ విధానం ఏమిటంటే, అర కప్పు బియ్యం ఉడికించాలనుకుంటే మరిగే నీళ్లల్లో ఒక టీ స్పూను కొబ్బరి నూనె వేయాలి. అన్నం అయ్యాక పిండిపదార్థంలో సహజంగా ఉండే సూక్ష్మాంశాల్లో మౌలికమైన మార్పు జరుగుతుంది. దీని వల్ల త్వరితంగా జీర్ణమయ్యే లక్షణాన్ని పిండి పదార్థం కోల్పోతుంది. సంప్రదాయ వంట విధానంతో పోలిస్తే, ఇలా వండడం వల్ల పిండి పదార్థం జీర్ణమయ్యే వేగం పది రెట్లు తగ్గుతోందని పరిశోధకులు గమనించారు. అంతిమంగా ఇది షుగర్ పెరగడాన్ని నివారించడమేగా!

# శుభ్రతతో కరోనా దూరం!

కరోనా వైరస్ నుంచి రక్షణ పొందాలంటే వైరస్ వ్యాపించే అవకాశాలను అడ్డుకోవాలి. ఇందుకోసం తరచుగా చేతులతో తాకే వీలున్న వస్తువులను శుభ్రం చేయాలి. ఇందుకోసం ఉపయోగించే డిజ్ ఇన్‌ఫెక్టెంట్స్ నాణ్యమైనవై ఉండాలి.

**వీటిని శుభ్రం చేయాలి:** తరచుగా తాకే వీలు ఉండే టేబుళ్లు, తలుపుల గడియలు, నాబ్స్, స్విచ్‌లు, హ్యాండిల్స్, ఫోన్లు, కీ బోర్డులు, మరుగుదొడ్లు, సింక్‌లు ప్రతి రోజూ శుభ్రం చేయాలి. మొదట సబ్బు నీళ్లతో వాటిని కడిగి, తర్వాత డిజ్ ఇన్‌ఫెక్టెంట్స్‌తో మరోసారి శుభ్రం చేయాలి.

**బ్లీచ్:** ఇందుకోసం ఐదు టేబుల్ స్పూన్ల బ్లీచింగ్ పౌడర్‌ను నాలుగు లీటర్ల నీళ్లలో కలిపి వాడాలి. ఇంట్లో వాడే బ్లీచింగ్ పౌడర్‌ను అమ్మోనియా లేదా మరే ఇతర క్లీనింగ్ పదార్థాలతో కలిపి వాడకూడదు.

హెల్త్ టిప్



**ఆల్కహాల్:** ఆల్కహాల్ కలిసిన క్లీనింగ్ ఏజెంట్స్ కరోనాను సమర్థంగా సంహరిస్తాయి. కాబట్టి 70% ఆల్కహాల్ కలిసి ఉన్నవే ఎంచుకోవాలి.

**ప్రయాణాల్లో:** తప్పనిసరిగా ప్రయాణం చేయవలసి వస్తే కూర్చునే సీటుతో పాటు, రైలింగ్ కూడా శుభ్రం చేసుకోవాలి. వీలైనంత వరకూ ప్రయాణం చేస్తున్నంత సేపు వాహనం లోపలి భాగాలను ముట్టుకోకూడదు.

## విటమిన్స్

విశేషం

# కార్టూన్ బొమ్మల ఊరు!



అదో చిన్న పల్లెటూరు. కొంతకాలం క్రితం వరకు ఆ ఊరి గురించి ఎవ్వరికీ తెలియదు. కానీ ఇప్పుడు అదొక పర్యాటక ప్రదేశం. ఎందుకో తెలుసా? ఆ ఊరిలో ఏ గోడ చూసినా కార్టూన్ బొమ్మలే కనిపిస్తాయి.

- హైజా అనే ఈ ఊరు తైవాన్‌లో ఉంది. ఇంతకీ గోడలపై కార్టూన్ బొమ్మలు వేయడానికి కారణమెవరో తెలుసా? ముగ్గురు అక్కాచెల్లెళ్లు.
- వేసవి సెలవుల్లో తాతయ్య ఇంటికి వచ్చిన వాళ్లు టైమ్‌పాస్ కోసం కార్టూన్ బొమ్మలు వేయడం మొదలుపెట్టారు. ఆ బొమ్మలు ఇంట్లో వాళ్లకే కాకుండా ఊళ్లో వాళ్లకు కూడా బాగా నచ్చాయి.
- అలా నెమ్మదిగా ఒక్కో ఇంటి గోడలపై కార్టూన్ బొమ్మలు చేరాయి. ఇప్పుడు ఏ ఇంటి గోడ మీద చూసినా కార్టూన్ బొమ్మలు కనిపిస్తాయి.
- ఆ నోటా ఈ నోటా ఈ ఊరి గురించి అందరికీ తెలిసింది. ఆ గ్రామం ఇప్పుడు పర్యాటక ప్రదేశంగా గుర్తింపు పొందింది.

### దారి కనుక్కోండి



### పదాలు పూరించండి




### సరైన నీడను గుర్తించండి



### డైలీ సుడోకు -310

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 3 | | | 6 | | | | 8 |
| | | | 8 | 4 | 1 | 3 | | |
| 8 | | | | | | | 1 | |
| | | | 4 | 1 | 9 | | | 5 |
| | | | | | | | | |
| 7 | | | 6 | 3 | 2 | | | |
| | 1 | | | | | | | 3 |
| | | 6 | 7 | 2 | 4 | | | |
| 9 | | | | 8 | | | 5 | 6 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 309 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 8 | 3 | 6 | 5 | 2 | 1 | 9 | 4 |
| 4 | 2 | 6 | 7 | 1 | 9 | 8 | 5 | 3 |
| 9 | 5 | 1 | 8 | 4 | 3 | 2 | 7 | 6 |
| 8 | 4 | 2 | 9 | 6 | 5 | 3 | 1 | 7 |
| 5 | 3 | 7 | 4 | 2 | 1 | 6 | 8 | 9 |
| 6 | 1 | 9 | 3 | 8 | 7 | 5 | 4 | 2 |
| 2 | 6 | 8 | 5 | 9 | 4 | 7 | 3 | 1 |
| 3 | 9 | 5 | 1 | 7 | 6 | 4 | 2 | 8 |
| 1 | 7 | 4 | 2 | 3 | 8 | 9 | 6 | 5 |

| బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|
| 39,995 (ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత)) | 36,640 | 74.25 | 30.73 |
| 2,022 | 6,445 | (50 పైసలు) | |

**బీఎస్ఈ సెన్సెక్స్**
గత శుక్రవారం ముగింపు : 34,103.48
సోమవారం ప్రారంభం : 33,103.24
గరిష్ఠం : 33,103.24
కనిష్ఠం : 31,276.30
ముగింపు : 31,390.07






# కరాళ కరోనా

## మళ్లీ 'బేర్'మన్న మార్కెట్లు.. రూ.7.62 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఖతం

## 2,713 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్.. 9,200 పాయింట్ల దిగువకు నిఫ్టీ

స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లను కరోనా భయాలు వెంటాడుతూనే ఉన్నాయి. రోజురోజుకూ కరోనా వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇందుకు నిదర్శనమే స్టాక్ మార్కెట్లలో నెల కొంటున్న భారీ పతనాలు. సోమవారంనాడు దేశీయ స్టాక్ మార్కెట్లలో మరో భారీ పతనం నమోదైంది. ఫలితంగా ఇది 'బ్లాక్ మండే'గా మారింది. బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 2,713.41 పాయింట్లు (7.96 శాతం) నష్టపోయి 31,390.07 పాయింట్ల వద్ద ముగిసింది. ఇది సెన్సెక్స్ చరిత్రలో రెండో అతిపెద్ద పతనంగా మారింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 757.80 పాయింట్ల (7.61%) నష్టాన్ని మూటగట్టుకుని 9,197.40 పాయింట్లకు దిగజారిపోయింది. ఈ నెల 12 సెన్సెక్స్ 2,919.26 పాయింట్లు, నిఫ్టీ 868.25 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే.

కరోనా మహమ్మారి భయాలతో ఆసియా మార్కెట్లు నష్టాల బాటలో సాగాయి. వీటి దారిలోనే దేశీయ మార్కెట్లు నడిచాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మార్కెట్ల పతనం ఎందాక కొనసాగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంటోందని వారు అంటున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి వేగవంతంగా ఉన్న నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఎక్కువవుతుందన్న ఆందోళనలు ప్రపంచ మార్కెట్లను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రపంచంలోని పలు కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గిస్తూ ప్రకటనలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఊహించని విధంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మార్కెట్లలో మరింత హెచ్చుతగ్గులు నమోదయ్యాయని విశ్లేషకులు చెబుతున్నారు.

**సోమవారంనాటి పతనంతో ఇన్వెస్టర్ల సంపద రూ.7,62,290.23 కోట్లు కరిగిపోయింది. ప్రస్తుతం బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ రూ.1,21,63,952.59 కోట్లుగా ఉంది.**

- అన్ని రంగాల సూచీలు నష్టాలను నమోదు చేశాయి. బీఎస్ఈ మెటల్, బ్యాంకెక్స్, ఫైనాన్స్, రియల్టీ, ఐటీ, ఎనర్జీ సూచీలు గరిష్ఠంగా 9.30 శాతం వరకు నష్టపోయాయి.
- మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 5.94 శాతం వరకు దిగజారాయి.
- బీఎస్ఈలో 2,047 షేర్లు నష్టాలతో, 411 షేర్లు లాభాలతో, 160 షేర్లు యథాతథంగా ముగిశాయి.
- 478 కంపెనీల షేర్లు 52 వారాల కనిష్ఠ స్థాయిని తాకాయి.
- ఆసియా స్టాక్ మార్కెట్ల విషయానికి వస్తే.. షాంఘై 3.40 శాతం, హాంకాంగ్ 4.03 శాతం, సియోల్ 3.19 శాతం, టోక్యో 2.46 శాతం నష్టాన్ని మూటగట్టుకున్నాయి. యూరోపియన్ మార్కెట్లు ప్రారంభ ట్రేడింగ్‌లో 8 శాతం వరకు నష్టపోయాయి.

### అమెరికా, బ్రెజిల్ మార్కెట్లలో నిలిచిన ట్రేడింగ్

కరోనా వైరస్ భయాలతో ప్రపంచ స్టాక్ మార్కెట్లు వణికిపోతున్నాయి. ప్రారంభంలోనే భారీ పతనాలను చవిచూడటంతో ట్రేడింగ్ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. అమెరికాలోని స్టాక్ మార్కెట్లలో సోమవారం ప్రారంభంలోనే పదిహేను నిమిషాలు ట్రేడింగ్ నిలిచిపోయింది. అనంతరం మార్కెట్లు తిరిగి ప్రారంభమైనా నష్టాల బాటలోనే సాగాయి. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఫెడ్ రిజర్వు అత్యవసర చర్యలకు శ్రీకారం చుట్టింది. అయినప్పటికీ ఇన్వెస్టర్లలో మాత్రం విశ్వాసాన్ని నింపలేకపోయింది. బ్రెజిల్‌లోని సావో పాలో స్టాక్ ఎక్స్ఛేంజ్ ట్రేడింగ్ ప్రారంభంలోనే 12.5 శాతం క్షీణించింది. దీంతో ట్రేడింగ్ నిలిచిపోయింది.

### గల్ఫ్ స్టాక్ మార్కెట్లలోనూ నష్టాలు

గల్ఫ్ దేశాల్లోని స్టాక్ మార్కెట్లు కూడా నష్టాల బాటలో సాగుతున్నాయి. కరోనా వైరస్ వ్యాప్తితోపాటు ముడిచమురు ధరల్లో క్షీణత వంటి అంశాలు ఈ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. అబుదాబీ, దుబాయ్ ఎక్స్ఛేంజీలు వరుసగా 7.8 శాతం, 6.2 శాతం క్షీణించాయి. బౌర్సా కువైట్ ప్రీమియర్ ఇండెక్స్ 5.0 శాతం, ఆల్ షేర్స్ ఇండెక్స్ 3.9 శాతం క్షీణించాయి. సౌదీ తడావుల్ మార్కెట్ సూచీ 3.3 శాతం తగ్గింది. బహ్రెయిన్ సూచీ 1.4 శాతం, మస్కట్ మార్కెట్ 1.8 శాతం తగ్గాయి. గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)లోని ఆరు దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్.. కరోనా వైరస్ ప్రభావాన్ని ఎదుర్కోవడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాయి. విమాన సర్వీసులను నిలిపివేయడంతోపాటు సరిహద్దులను మూసివేశాయి. ప్రయాణాలను రద్దు చేయడమేకాకుండా ఎంటర్‌టైన్‌మెంట్ సదుపాయాలను మూసివేశాయి. అయితే జీసీసీ దేశాల్లో మొదటగా బహ్రెయిన్‌లో మొదటి కరోనా మరణం నమోదైంది. ఇక అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ముడిచమురు ధర 30 డాలర్ల స్థాయికి చేరింది.

### 30 షేర్లకు నష్టాలే...

సెన్సెక్స్ సూచీలోని 30 కంపెనీల షేర్లు నష్టాల్లోనే ముగిశాయంటే కరోనా భయాల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అన్ని షేర్లకన్నా ఇండస్ ఇండ్ బ్యాంక్ షేరు ఎక్కువ (17.50 శాతం) నష్టాన్ని నమోదు చేసుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో టాటా స్టీల్ (11.02 శాతం), హెచ్‌డీఎఫ్‌సీ (10.94 శాతం), ఐసీఐసీఐ బ్యాంక్ (9.96 శాతం), యాక్సిస్ బ్యాంక్ (10.38 శాతం), ఆర్ఐఎల్ (8.28 శాతం), ఇన్ఫోసిస్, ఐటీసీ నిలిచాయి.

### మల్టీప్లెక్స్ కంపెనీల షేర్లకు సెగ

వివిధ రాష్ట్రాల్లో మల్టీప్లెక్స్‌లను నిర్వహిస్తున్న పీవీఆర్, ఐనాక్స్ లీజర్ కంపెనీల షేర్లకు సెగ తగిలింది. సోమవారం నాడు ఇంట్రాడేలో పీవీఆర్ షేరు బీఎస్ఈలో 18.85 శాతం క్షీణించి రూ.1,045.85 స్థాయికి చేరుకుంది. ఇది 52 వారాల కనిష్ఠ స్థాయి. అయితే చివరకు నష్టాలు తగ్గిపోయి 4.75 శాతం లాభంతో రూ.1,350.05 వద్ద ముగిసింది. ఐనాక్స్ లీజర్ షేరు ఇంట్రాడేలో 14.77 శాతం క్షీణించి రూ.270 స్థాయికి దిగజారింది. చివరకు 2.83 శాతం నష్టంతో రూ.307.85 వద్ద క్లోజైంది.

### యెస్ బ్యాంక్ జూమ్

కరోనా భయాలతో అనేక కంపెనీల షేర్లు క్షీణిస్తుంటే.. ప్రైవేట్ రంగంలోని యెస్ బ్యాంక్ షేరు మాత్రం జోరుగా పెరుగుతోంది. ఈ బ్యాంక్ పునర్ వ్యవస్థీకరణకు సంబంధించిన ప్రకటన వెలువడటమే ఇందుకు కారణం. సోమవారం బీఎస్ఈలో ఈ బ్యాంక్ షేరు 45.21 శాతం పెరిగి రూ.37.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు ఏకంగా 58.12 శాతం పెరిగి రూ.40.40 స్థాయికి చేరుకుంది. ఇక ఎన్ఎస్ఈలో బ్యాంక్ షేరు 45 శాతం పెరిగి రూ.37.05 వద్ద క్లోజైంది.

### తొలి రోజే ఎస్‌బీఐ కార్డ్స్ నష్టాలు

ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ సోమవారంనాడు స్టాక్ మార్కెట్లో లిస్టయింది. అయితే తొలి రోజే ఈ షేరు నష్టాలను చవిచూసింది. కరోనా వైరస్ భయాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐ కార్డ్స్ లిస్టయింది. ఈ షేరు ఇష్యూ ధర రూ.755 కాగా స్టాక్ మార్కెట్లో 12.84 శాతం నష్టంతో రూ.658 వద్ద లిస్టయింది. బీఎస్ఈలో ఇంట్రాడేలో రూ.755-658 మధ్య కదలాడింది. చివరకు 9.50 శాతం నష్టంతో రూ.683.20 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 10.19 శాతం నష్టంతో రూ.678 వద్ద క్లోజైంది. బీఎస్ఈలో కంపెనీ మార్కెట్ విలువ రూ.64,149.53 కోట్లుగా ఉంది.

### రూ.40 వేల దిగువకు బంగారం

**ముంబైలో పది గ్రాముల ధర రూ.39,995**



పసిడి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.2,022 తగ్గి రూ.39,995కు పడిపోయింది. కిలో వెండి ధర ఏకంగా రూ.6,445 పతనమై రూ.36,640కి దిగివచ్చింది. అంతర్జాతీయంగా విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడం ఇందుకు కారణమైంది. హైదరాబాద్‌లో తులం బంగారం (24 క్యారెట్లు) రూ.680 తగ్గి రూ.41,610కి పరిమితం కాగా.. కిలో వెండి రూ.5000 మేర క్షీణించి రూ.35,400కి తగ్గింది. ఢిల్లీలో మాత్రం బంగారం ధర స్వల్పంగా పెరిగింది. తులానికి రూ.455 ఎగబాకి రూ.41,610కి చేరుకుంది. వెండి రేటు మాత్రం కిలోకు రూ.1,283 తగ్గి రూ.40,304గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 1,470 డాలర్లకు పడిపోగా.. వెండి 13.25 డాలర్లు పలికింది. దీంతో మంగళవారం దేశీయంగానూ బంగారం, వెండి ధరలు మరింతగా తగ్గనున్నాయని బులియన్ వర్గాలంటున్నాయి.




హ్యుండయ్ మోటార్ ఇండియా మార్కెట్లోకి సరికొత్త క్రెటాను తీసుకువచ్చింది. సంస్థ ఎండీ ఎస్ఎస్ కిమ్ విడుదల చేసిన ఈ ఎస్‌యూవీ ధరల శ్రేణి రూ.9.9-రూ.17.2 లక్షల మధ్య ఉంది.

### పాన్-ఆధార్ లింక్‌కు నెలాఖరే తుది గడువు

న్యూఢిల్లీ: ఆధార్ కార్డును పాన్‌తో అనుసంధానించుకునేందుకు ఈ నెలాఖరే తుది గడువని, ఈ లోపు వాటిని తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని ఆదాయ పన్ను శాఖ (ఐటీ) స్పష్టం చేసింది. గడువులోపు అనుసంధానం చేసుకోని పక్షంలో పాన్ పనిచేయదని తెలిపింది. బయోమెట్రిక్ ఆధార్ ప్రమాణీకరణ లేదా సమీప పాన్ సేవా కేంద్రాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చని వివరించింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 16వ తేదీకి.. | | విజయవాడ | 290 |
| హైదరాబాద్ | 250 | విశాఖపట్నం | 300 |
| 17వ తేదీకి.. | | వరంగల్ | 253 |
| చిత్తూరు | 263 | డజను గుడ్లు రూ. 48 | |
| గోదావరి | 290 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 20 | విజయవాడ | 12 |
| వరంగల్ | 20 | గుంటూరు | 15 |
| మహబూబ్‌నగర్ | 20 | ఒంగోలు | 18 |
| కరీంనగర్ | 20 | చిత్తూరు | 34 |
| కర్నూలు | 20 | నెల్లూరు | 34 |
| విశాఖపట్నం | 16 | అనంతపురం | 41 |
| గోదావరి | 16 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 41,610 | 41,000 | 41,180 | 40,900 | 41,440 |
| క్రితం ముగింపు | 42,290 | 42,200 | 43,530 | 42,000 | 41,310 |
| 22 క్యారెట్లు | 39,680 | 38,000 | 37,880 | 38,000 | 39,430 |
| క్రితం ముగింపు | 40,220 | 39,100 | 40,040 | 39,070 | 39,340 |
| వెండి (కిలో) | 35,400 | 39,000 | 38,100 | 38,500 | 40,800 |
| క్రితం ముగింపు | 40,400 | 42,700 | 44,400 | 42,800 | 44,000 |

# ఏప్రిల్ 3నే రేట్ల కోత?

### ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ సంకేతం



ముంబై: ఏప్రిల్ మూడో తేదీన జరిగే ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో మాత్రమే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకుంటామని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ప్రకటించారు. అయితే మార్కెట్ ఇప్పటికే వ్యాపారాలపై కోవిడ్-19 ప్రభావాన్ని నిలువరించేందుకు రెపో రేటు తగ్గించాలని కోరుతున్న దృష్ట్యా లిక్విడిటీ పెంపునకు చర్యలు తీసుకుంటామని మాత్రం ఆయన హామీ ఇచ్చారు. కోవిడ్-19 ప్రభావంపై స్పందించేందుకు ఆర్‌బీఐ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పలు కీలక ప్రకటనలు చేశారు. కోవిడ్-19 ప్రభావాన్ని నిలువరించేందుకు ఆర్‌బీఐ వద్ద పలు విధానపరమైన చర్యలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు.

తక్షణ రేట్ల కోత లేనట్టేనా అన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ప్రస్తుత చట్టం ప్రకారం కేవలం ఎంపీసీ మాత్రమే నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని, పరిస్థితిని బట్టి కార్యాచరణ ఏమిటన్నది నిర్ణయిస్తామని దాస్ స్పష్టం చేశారు. ఈ లోగా దేశంలో మార్కెట్లో లిక్విడిటీని పెంచేందుకు ఈ నెల 23వ తేదీన 200 కోట్ల డాలర్లు విక్రయించడంతో పాటు దీర్ఘకాలిక రెపో కింద ఏ క్షణంలో అవసరమైతే అప్పుడు రూ.లక్ష కోట్లు అందించనున్నట్టు తెలిపింది.

**ప్రభావాన్ని సమీక్షించుకోండి**

దేశంలోని బ్యాంకులన్నీ కోవిడ్-19 ప్రభావం తమ పద్దులు, ఆస్తుల నాణ్యత, లిక్విడిటీపై ఎంత మేరకు పడింది ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఉండాలని ఆర్‌బీఐ సూచించింది. కస్టమర్లు డిజిటల్ బ్యాంకింగ్ సదుపాయం ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలని వాణిజ్య బ్యాంకులు, యూసీబీలు, ఎన్‌బీఎఫ్‌సీలు, పేమెంట్ బ్యాంకులు, చిన్న ఫైనాన్స్ బ్యాంకులనుద్దేశించి జారీ చేసిన ప్రకటనలో కోరింది. వ్యాపార, సామాజిక కోణాలు రెండింటిలోనూ కోవిడ్-19 ప్రభావాన్ని తరచుగా సమీక్షిస్తూ సత్వరం స్పందించేందుకు బ్యాంకులు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ఈ టీమ్‌లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ బ్యాంకు అగ్ర నాయకత్వానికి తాజా స్థితిని తెలియచేస్తూ ఉండాలని తెలిపింది.

### పురోగతిలో యెస్ బ్యాంక్ పరిష్కారం

యెస్ బ్యాంకులో ఏర్పడిన సంక్షోభాన్ని పరిష్కరించే చర్యలు పురోగమన దశలో ఉన్నాయని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. వచ్చే బుధవారం సాయంత్రం నుంచి డిపాజిటర్లు తమ సొమ్ము తీసుకోవచ్చునని ఆయన చెప్పారు. అవసరం అయితే బ్యాంకుకు తగినంత లిక్విడిటీ అందచేస్తామని కూడా ప్రకటించారు. యెస్ బ్యాంకు సంక్షోభం పరిష్కారానికి తీసుకున్న చర్యలను సమర్థిస్తూ వాటి ఫలితాలు త్వరలోనే కనిపిస్తాయన్న విశ్వాసం ఆయన ప్రకటించారు.

# రెండు నెలల్లో ఎయిర్‌లైన్స్ దివాలా!



న్యూఢిల్లీ: కరోనా విజృంభణతో ప్రపంచంలోని చాలా ఎయిర్‌లైన్స్ మే చివరినాటికి దివాలా తీయవచ్చని సెంటర్ ఫర్ ఏషియా పసిఫిక్ ఏవియేషన్ (కాపా) హెచ్చరించింది. ప్రభుత్వం, ఇండస్ట్రీ పరస్పర సహకారంతో వెంటనే చర్యలు చేపడితేనే ఈ విపత్తును నివారించగలమని ఈ అంతర్జాతీయ విమాన కన్సల్టింగ్ సేవల సంస్థ అంటోంది. కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో చాలా దేశాలు ప్రజల

**కాపా హెచ్చరిక**

ప్రయాణాలు, ముఖ్యంగా విదేశీ పర్యటనలపై ఆంక్షలు విధించాయి. దేశీయంగానూ విమానయాన సేవలకు డిమాండ్ అనూహ్యంగా తగ్గింది. దాంతో ఎయిర్‌లైన్స్ తమ సేవలతోపాటు టికెట్ చార్జీలనూ భారీగా తగ్గించుకున్నాయి. వ్యయ నియంత్రణ చర్యలను చేపడుతున్నాయి. అయినప్పటికీ చాలా విమాన సంస్థలు ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలోకి జారుకున్నాయి.

**దేశీయ ఎయిర్ ట్రాఫిక్ 50% డౌన్**

ఈ ఏడాది జూన్ వరకు దేశీయంగా విమాన ప్రయాణికుల రద్దీ 50 శాతం వరకు తగ్గవచ్చని అక్యూట్ రేటింగ్ అండ్ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. కరోనా ధాటికి ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాలపై ఆంక్షలను విధించారు. విదేశీయులెవ్వరూ మన గడ్డపై అడుగు పెట్టకుండా భారత ప్రభుత్వం నిషేధం విధించింది. విదేశీయులకు వీసాలను ఏప్రిల్ 15 వరకు సస్పెండ్ చేస్తున్నట్లు ఈనెల 12న ప్రకటించింది.

**స్కూట్ కస్టమర్లకు ఓచర్ రిఫండ్**

మే 31లోపు ప్రయాణం కోసం ఈ నెల 15న, అంతకు ముందు టికెట్ బుక్ చేసుకున్నవారికి ఓచర్ల రూపంలో పూర్తి సొమ్మును రిఫండ్ చేయనున్నట్లు స్కూట్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. 12 నెలల పాటు చెల్లుబాటయ్యే ఈ ఓచర్లతో తిరిగి టికెట్లను బుక్ చేసుకోవచ్చని ఎయిర్‌లైన్స్ తెలిపింది.

**అన్ని దేశాలు కలిసి స్పందించాలి: ఐఎంఎఫ్**

కరోనా సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాల ప్రభుత్వాలు సమన్వయంతో ఆర్థిక చర్యలను చేపట్టాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. కరోనా వైరస్‌తో ఆర్థిక వ్యవస్థకు కలుగుతున్న నష్టాన్ని పూడ్చేందుకు వినియోగదారుల కొనుగోలు శక్తిని అమితంగా పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

### అమెరికన్ ఫెడరల్ వడ్డీ రేట్ల తగ్గింపు

వాషింగ్టన్ : కోవిడ్-19 ప్రభావం వల్ల ఆర్థిక వ్యవస్థ భారీ స్థాయిలో ప్రభావితం కావడాన్ని నిలువరించేందుకు అమెరికన్ ఫెడరల్ వడ్డీ రేట్ల తగ్గింపును ప్రకటించింది. దీంతో వడ్డీ రేటు ఇంచుమించుగా జీరో స్థాయికి తగ్గిపోతుంది. ఈ తగ్గింపుతో అమెరికాలో వడ్డీ రేట్లు 0 నుంచి 0.25 శాతం మధ్యకు వచ్చాయి. వడ్డీ రేటు తగ్గించడంతో పాటు 70 వేల కోట్ల డాలర్ల విలువ గల బాండ్లను కొనుగోలు చేయనున్నట్టు ఫెడరల్ రిజర్వ్ ప్రకటించింది. కోవిడ్-19తో పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు ఛిద్రమయ్యాయని, ప్రపంచ ఆర్థిక పరిస్థితి సైతం గణనీయంగా క్షీణించిందని చెబుతూ అందుకు దీటుగా బలమైన చర్యలు తీసుకోవలసిన అవసరాన్ని తాము గుర్తించి ఈ చర్యలు తీసుకున్నట్టు ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పోవెల్ చెప్పారు. ఈ చర్యలతో ఆర్థిక కార్యకలాపాలకు చక్కని మద్దతు లభించి కార్మిక మార్కెట్ పటిష్ఠం అవుతుందని, ద్రవ్యోల్బణం కూడా తాము నిర్దేశించిన లక్ష్యం రెండు శాతం పరిధిలోకి వస్తుందన్న ఆశాభావం ప్రకటించారు.

### యెస్ బ్యాంక్ కేసులో అనిల్ అంబానీ, నరేశ్ గోయల్‌కు సమన్లు



న్యూఢిల్లీ/ముంబై: యెస్ బ్యాంక్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. పెద్ద చేపలపైనా దృష్టి పెట్టింది. బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్న పారిశ్రామిక దిగ్గజాలనూ ప్రశ్నించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈ నెల 19న తమ ముందు హాజరు కావాలని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి సమన్లు జారీ చేసింది. అలాగే జెట్ ఎయిర్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్, జీ టీవీ ప్రమోటర్ సుభాష్ చంద్ర, ఇండియాబుల్స్ సమీర్ గెహ్లాట్, డీహెచ్ఎఫ్ఎల్ ప్రమోటర్ కపిల్ వాధ్వానీలకూ ఈడీ అధికారులు సమన్లు జారీ చేశారు. ఈడీ వీరందరినీ ఈ వారమే ప్రశ్నించే అవకాశం ఉంది. యెస్ బ్యాంకు మాజీ ఎండీ, సీఈఓ రాణా కపూర్ ఖాతాలోని రూ.4,300 కోట్ల ముడుపులతో వీరందరికీ ప్రమేయం ఉందని ఈడీ భావిస్తోంది.

**రూ.12,800 కోట్ల రుణాలు**

అక్రమ నగదు లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద అనిల్ అంబానీని నేరుగా ప్రశ్నించాలని ఈడీ అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం సోమవారమే తమ ముందు హాజరు కావాలని ఈడీ నుంచి అంబానీకి సమన్లు జారీ అయ్యాయి. అయితే కొన్ని వ్యక్తిగత కారణాలవల్ల సోమవారం రాలేనని, మరో తేదీన అవకాశం ఇవ్వాలని అంబానీ కోరారు. దాంతో ఈ నెల 19న హాజరు కావాలని కోరినట్టు సమాచారం. రాణా కపూర్ హయాంలో యెస్ బ్యాంక్ నుంచి రిలయన్స్ గ్రూప్‌లోని తొమ్మిది కంపెనీలు దాదాపు రూ.12,800 కోట్ల రుణాలు తీసుకున్నాయి.

**మరో రూ.202 కోట్ల రుణ మాయ**

రాణా కపూర్ హయాంలో మాక్ స్టార్ మార్కెటింగ్ అనే కంపెనీకి ఇచ్చిన మరో రూ.202 కోట్ల మాయదారి రుణాల వివరాలను ఈడీ అధికారులు.. ముంబైలోని పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టుకు తెలిపారు. డీఈ షా గ్రూప్, ప్రస్తుతం మూతపడిన హెచ్‌డీఐఎల్ గ్రూప్.. ఈ జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసినట్టు ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ కంపెనీకి ఇచ్చిన రుణాలను హెచ్‌డీఐఎల్ గ్రూప్ ప్రమోటర్లు యెస్ బ్యాంక్‌కు చెల్లించాల్సిన తమ పాత రుణాలు చెల్లించేందుకు ఉపయోగించారు.

### మహిళా ఔత్సాహికులకు 'టై విమెన్' కార్యక్రమం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహిళా యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టై).. 'టై విమెన్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వెబ్‌కాస్ట్ ద్వారా టై హైదరాబాద్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి దీన్ని ప్రకటించారు. ఇందులో వైస్ ప్రెసిడెంట్ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దరఖాస్తు చేసుకున్న స్టార్టప్‌లలో కొన్నింటిని చాప్టర్ స్థాయిలో ఎంపిక చేసి మద్దతు కార్యక్రమాలను నిర్వహిస్తారు. జూన్ 12న వీటికి పోటీ నిర్వహిస్తారు. చివర్లో చాప్టర్ విన్నర్‌తో పాటు 3 రన్నర్ స్టార్టప్‌లను ఎంపిక చేస్తారు. విజేతకు భారత్‌లో ఉచితంగా బూట్ క్యాంప్‌నకు హాజరయ్యే అవకాశం లభించడంతోపాటు దుబాయ్‌లో డిసెంబరులో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో పాలుపంచుకునే అవకాశం లభిస్తుంది. అక్కడ లక్ష డాలర్ల ఈక్విటీ ఫ్రీ ఫండ్ గెలుచుకునే వీలు కూడా ఉంటుందని టై హైదరాబాద్ తెలిపింది.

### మరోసారి ముగింపు బలహీనం

**టెక్ వ్యూ**

నిఫ్టీ 350 పాయింట్ల భారీ వ్యత్యాసంతో ప్రారంభమై రోజంతా డౌన్‌ట్రెండ్ కొనసాగించింది. కీలక మద్దతు స్థాయి 9500 వద్ద కూడా విఫలమై చివరికి 750 పాయింట్ల నష్టంతో డే కనిష్ఠ స్థాయిలో ముగిసింది. శుక్రవారంనాటి బలమైన రికవరీ తర్వాత కూడా నిలదొక్కుకోక తక్షణ అప్‌ట్రెండ్ అవకాశాలు ధ్రువీకరించలేకపోయింది. మూడు వారాలుగా డౌన్‌ట్రెండ్ నిరంతరాయంగా కొనసాగుతోంది. మరోసారి శుక్రవారంనాడు నమోదు చేసిన కనిష్ఠ స్థాయిలకు చేరువవుతోంది. భారీ ఎగుడుదిగుడులు ముగిసి స్థిరపడితే తప్ప ట్రెండ్‌లో స్పష్టతకు ఆస్కారం లేదు.

**మంగళవారం స్థాయిలివే...**

నిరోధం : 9300 మద్దతు : 9000

- మరింత బలహీనతకు లోనైతే మానసిక అవధి 9000 వద్ద పరీక్ష ఎదుర్కొంటుంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడైనా బలంగా క్లోజ్ కావాలి. విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఎదుర్కొంటుంది.
- రికవరీ బాట పడితే నిరోధ స్థాయి 9300 కన్నా పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత అప్‌ట్రెండ్‌కు ఆస్కారం ఉంటుంది. ప్రధాన నిరోధం 9500.

■ వి.సుందర్ రాజా

### ప్రారంభం సెషన్ నిస్తేజం

**ఆస్ట్రో వ్యూ**

**తిథి** : ఫాల్గుణ బహుళ నవమి
**నక్షత్రం** : మూల, పూర్వాషాఢ
**అప్రమత్తం** : రోహిణి, హస్త, శ్రవణం/మృగశిర, చిత్త, ధనిష్ట నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 11.45**

**ధోరణి** : నిఫ్టీ ఫ్యూచర్స్ 12.25 వరకు నిస్తేజంగా ట్రేడవుతూ ఆ తర్వాత 2.30 వరకు మెరుగ్గాను, తదుపరి 3.10 వరకు నిలకడగాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది.
**ట్రేడింగ్ వ్యూహం** : నిఫ్టీ ఫ్యూచర్స్ 12.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 2.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 9250, 9300, 9350**

**మద్దతు స్థాయిలు : 9125, 9075, 9000**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
**గమనిక** : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

ఆంధ్రజ్యోతి
9
విజయవాడ ● మంగళవారం 17 మార్చి 2020

# కరోనా కలవరం



## యోగాతో కరోనా ఒత్తిడికి చెక్: హార్వర్డ్ మెడికల్ స్కూల్

వాషింగ్టన్, మార్చి 16: అమెరికాలో యోగాపై నిషేధం ఎత్తివేత.. యోగాతో కరోనా ఒత్తిడిని జయించవచ్చంటూ హార్వర్డ్ మెడికల్ స్కూల్ వెల్లడి.. వెరసి అమెరికాలో యోగాపై ఆసక్తి పెరుగుతోంది. నానాటికీ విస్తరిస్తున్న కరోనా ఒత్తిడిని తట్టుకునేందుకు యోగా, మెడిటేషన్, శ్వాస నియంత్రణ ఉత్తమ మార్గాలని హార్వర్డ్ మెడికల్ స్కూల్ మ్యాగజైన్ వివరించింది. సాధారణ మెడిటేషన్‌తోనే మనసుకు ప్రశాంతత చేకూరుతుందని, దీన్ని నేర్చేందుకు యోగా స్టూడియో, పాకెట్ యోగా వంటి యాప్‌లు ఉన్నాయని మానసిక వైద్య నిపుణుడు జాన్ షార్ప్ తెలిపారు.

## హెచ్‌ఐవీ మందుతో కరోనాకు చెక్

» మలేరియా మాత్రలూ విరుగుడే : శాస్త్రవేత్తలు



జైపూర్/మెల్‌బోర్న్, మార్చి 16: జైపూర్ వైద్యులు తమ ఆస్పత్రిలో కరోనాతో చికిత్స పొందుతున్న ఇటాలియన్ వృద్ధ దంపతులతో పాటు మరో వ్యక్తికి హెచ్‌ఐవీ ఇన్ఫెక్షన్ కట్టడికి వాడే లోపినవిర్/రిటోనవిర్ ఔషధాలను అందించారు. వారు కరోనా ఇన్ఫెక్షన్ నుంచి పూర్తిగా బయటపడ్డారని ఎస్‌ఎంఎస్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డి.ఎస్.మీనా సోమవారం ప్రకటించారు. లోపినవిర్/రిటోనవిర్‌లతో పాటు 'క్లోరోక్విన్' అనే మలేరియా నిరోధక మాత్రలు కూడా కరోనా ఇన్ఫెక్షన్లను కట్టడి చేయగలవని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ వర్సిటీ శాస్త్రవేత్తల ప్రయోగ పరీక్షల్లో తేలింది.

## జర్మన్ కంపెనీ వ్యాక్సిన్‌కు 7వేల కోట్ల ఆఫర్ ?

టీకా హక్కుల కోసం ట్రంప్ మంతనాలు: 'డై వెల్ట్' పత్రిక



బెర్లిన్, మార్చి 16: జర్మన్ ఫార్మా కంపెనీ 'క్యూర్‌వ్యాక్' అభివృద్ధి చేస్తున్న కరోనా టీకా హక్కులను సొంతం చేసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రూ.7 వేల కోట్ల(ఒక బిలియన్ డాలర్లు) ఆఫర్ ఇచ్చారంటూ 'డై వెల్ట్' పత్రిక ప్రచురించిన కథనం జర్మనీ రాజకీయ, ఫార్మా పరిశ్రమ వర్గాల్లో కలకలం రేపింది. 'జర్మనీ అమ్మకానికి లేదు' అని జర్మనీ ఆర్థిక వ్యవహారాల మంత్రి పీటర్ ఆల్ట్‌మైర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. జర్మనీ మంత్రులు, నాయకులు కూడా అమెరికా తీరుపై విరుచుకుపడ్డారు. ఈ కథనం వాస్తవాలను వక్రీకరించేలా ఉందని అమెరికా అధికారులు తెలిపారు.

## సముద్ర ఉత్పత్తులతో కరోనా రాదు

ఏదైనా తినేయొచ్చు: మత్స్యశాఖ వెల్లడి



అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సముద్ర ఉత్పత్తులను ఆహారంగా తీసుకున్నంత మాత్రాన కరోనా వైరస్(కోవిడ్-19) వ్యాపించదని రాష్ట్ర మత్స్యశాఖ ఇంచార్జి కమిషనర్ సోమశేఖరం తెలిపారు. చికెన్, మటన్, చేపలు, రొయ్యలు సహా ఇతర సముద్ర ఉత్పత్తులను సందేహం లేకుండా తినొచ్చని ప్రపంచ జంతు ఆరోగ్య సంస్థ శాస్త్రీయ అధ్యయనం ద్వారా స్పష్టం చేసిందన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ, ఆహార పరిరక్షణ, ప్రమాణాల సంస్థ కూడా దీన్ని ధ్రువీకరించినట్లు తెలిపారు. మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల శాఖలు కోవిడ్-19పై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు సోమవారం పేర్కొన్నారు.

## అమెరికాలో తుపాకులకు డిమాండ్!

టాయిలెట్ పేపర్లు లూటీ చేస్తారన్న భయంతోనే..!!



లాస్‌ఏంజెలెస్, మార్చి 16: కరోనాకు భయపడి ప్రజలంతా టాయిలెట్ పేపర్స్ కొనుక్కొని ఇళ్లల్లో పెట్టుకుంటున్నారు. ఆ టాయిలెట్ పేపర్స్‌ను రక్షించుకునేందుకు అమెరికన్లు తుపాకులు కొనేందుకు బారులు తీరుతున్నారు. కరోనా ప్రభావం ఎక్కువగా ఉన్న కాలిఫోర్నియా, న్యూయార్క్, వాషింగ్టన్ రాష్ట్రాల్లో ఈ కొనుగోళ్లు అధికంగా ఉన్నాయి. తాను 1500 డాలర్లు పెట్టి ఒక తుపాకీ, తూటాలు కొన్నానని, ఇప్పుడు దొంగల నుంచి తమ కుటుంబం సురక్షితంగా ఉంటుందని ఓ మిలటరీ మాజీ అధికారి వెల్లడించడం.. అక్కడి ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తెలియజేస్తోంది.

# రెండో దశలో కరోనా

## కఠిన నియంత్రణకు ఇదే కీలకమైన దశ.. మూడో దశలోకి ప్రవేశిస్తే ప్రమాదం

*"మనదేశంలో కరోనా వ్యాప్తి ఇప్పుడు రెండో దశలో ఉంది. వైరస్ వ్యాప్తి మూడో దశలోకి (సామాజిక వ్యాప్తి-కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్) ప్రవేశించడాన్ని ఆపడానికి భారతదేశానికి ఉన్న గడువు కేవలం 30 రోజులే"*

..ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ డీజీ డాక్టర్ బలరాం భార్గవ చేసిన హెచ్చరిక ఇది! వైరస్ వ్యాపించడంలో ఆయన చెబుతున్న దశలేమిటి? ఏ దశలో వైరస్‌ను ఎలా నియంత్రించవచ్చు? అనే అంశాలను పరిశీలిస్తే..

### మొదటి దశ



చైనా, ఇటలీ, ఇరాన్ తదితర దేశాలకు వెళ్లొచ్చిన వారికి మాత్రమే వైరస్ పాజిటివ్‌గా వస్తుంది. ఉదాహరణకు.. దేశంలోనే తొలి ముగ్గురు కరోనా బాధితులు చైనాలో వైద్యవిద్య అభ్యసిస్తున్న కేరళవాసులు. అక్కడి నుంచి వచ్చాక వారికి వైరస్ పాజిటివ్ వచ్చింది. అలాగే మన హైదరాబాదీ కూడా దుబాయ్‌లో ఆ వైరస్ బారిన పడి ఇక్కడికి వచ్చారు. తొలి దశలో బయట పడ్డ కేసులన్నీ ఇలాంటివే.

### రెండో దశ



విదేశాలకు వెళ్లి కరోనా బారిన పడి మనదేశానికి వచ్చినవారి కుటుంబసభ్యులు, సహోద్యోగులకు వైరస్ సోకే దశ ఇది. దేశంలో ప్రస్తుతం ఈ దశ నడుస్తోంది. ఈ దశను 'లోకల్ ట్రాన్స్‌మిషన్'గా వ్యవహరిస్తారు.

### మూడో దశ



ఇది అత్యంత కీలకమైనది. ప్రమాదకరమైన దశ. రెండో దశలో వైరస్ బారిన పడిన వారి నుంచి చుట్టుపక్కల వారికి వైరస్ పెద్ద ఎత్తున వ్యాపిస్తుంది. చూస్తూ చూస్తుండగానే వైరస్ వేలాది మందికి సోకుతుంది. మరణాల సంఖ్య భారీగా పెరగడం మొదలవుతుంది.

### నాలుగో దశ

వైరస్ నియంత్రణ చెయ్యి దాటిపోయే దశ. ఇప్పుడు ఇటలీ, ఇరాన్ ఈ దశలోనే ఉన్నాయి. ఈ దశను తొలిసారి చూసిన దేశం చైనా. ఈ దశలోనే అక్కడ కేసుల సంఖ్య 80 వేలకు చేరింది. ఆలస్యంగా మేలుకున్నా.. కఠినంగా కట్టడి చర్యలు తీసుకోవడంతో ఆ దేశంలో తగ్గుముఖం పట్టింది. ఇటలీ, ఇరాన్ వంటి దేశాలు మాత్రం అల్లాడిపోతున్నాయి.

### వ్యవస్థలు కుప్పకూలే ముప్పు

వైరస్ వ్యాప్తి మూడు, నాలుగు దశల్లోకి ప్రవేశిస్తే.. ఆరోగ్య వ్యవస్థలు కుప్పకూలిపోతాయి. అందుబాటులో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది సరిపోరు. ఐసోలేషన్ వార్డులు, క్వారంటైన్లు నిండిపోతాయి. రోజూ వందలు-వేల సంఖ్యలో కొత్తగా వైరస్ బారిన పడుతుంటారు. చైనాలో అలాంటి స్థితిలోనే పదిరోజుల్లో వెయ్యి పడకల ఆస్పత్రి.. 1500 పడకల ఆస్పత్రి.. నిర్మించారు. పెద్ద పెద్ద హోటళ్లను, ఇతరత్రా నిర్మాణాలను తాత్కాలిక ఆస్పత్రులుగా మార్చేశారు. అక్కడ బలమైన ప్రభుత్వం ఉండడం వల్ల అది సాధ్యమైందిగానీ.. మనలాంటి దేశాల్లో అది దాదాపు అసాధ్యం. అభివృద్ధి చెందిన దేశంగా పేరొందిన ఇటలీ వల్ల కూడా కావట్లేదు. రోగులకు చికిత్స చేయడానికి సరిపడా ఆస్పత్రులు సరిపోక.. 80 ఏళ్లు దాటినవారిని చేర్చుకోకూడదనే దారుణమైన నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితిలో ఇటలీ సర్కారు పడింది. అలాంటి పరిస్థితి మనకు రాకూడదనుకుంటే అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేయాలి. ప్రభుత్వాలు ప్రస్తుతం అదే పనిలో ఉన్నాయి. కానీ అది సరిపోదని.. ప్రజల్లో కూడా అవగాహన ఉండాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. వారు ప్రజలకు చేస్తున్న సూచనలేంటంటే..

- ప్రభుత్వం బడులకు సెలవులు ఇచ్చింది కదాని ప్రయాణాలు పెట్టుకోవద్దు. కరోనా బారిన పడ్డ హైదరాబాద్‌వాసి బెంగళూరు నుంచి బస్సులోనే ప్రయాణించిన సంగతి గుర్తుపెట్టుకోవాలి.
- అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు. వీలైనంత వరకూ ఇళ్లల్లోనే ఉండాలి.
- జలుబు, దగ్గు, జ్వరం వంటివాటితో బాధపడేవారంతా అది కరోనానే అని భయపడాల్సిన పన్లేదు. కానీ.. అలాంటివారు తాము స్వయంగా ఇటీవలికాలంలో విదేశాలకు వెళ్లొచ్చినా, విదేశాలకు వెళ్లొచ్చినవారికి దగ్గరగా మెలిగినా అనుమానించాల్సిందే. వెంటనే ఆస్పత్రికి వెళ్లాల్సిందే.
- ఒకవేళ వారికి వైద్యపరీక్షల్లో నెగెటివ్ వచ్చినా.. ముందు జాగ్రత్త చర్యగా కనీసం 14 రోజుల పాటు స్వీయ గృహనిర్బంధంలో ఉండడం మంచిది. వీలైతే కుటుంబసభ్యులను కూడా తాకకుండా ఒక గదికి పరిమితం కావాలి. ఎందుకంటే.. వైరస్ సోకిన 14 రోజుల దాకా కొందరిలో లక్షణాలు బయటపడవు. పరీక్షల్లో నెగెటివ్ వస్తుంది. ఆ భరోసాతో వారు బయట తిరిగి మరింతమందికి అంటిస్తారు. చైనా, ఇటలీల్లో ఇలాంటి 'తప్పుడు నెగెటివ్' బాధితుల వల్లే వైరస్ విస్తృతంగా వ్యాపించింది.
- చేతులు తరచుగా శుభ్రం చేసుకోవడం, హ్యాండ్ శానిటైజర్ల వంటివి వాడటం వంటివి ముందు నుంచీ అందరూ చెబుతున్నవే. దశలతో సంబంధం లేకుండా అందరూ కచ్చితంగా పాటించాల్సిన నియమాలు.




-సెంట్రల్ డెస్క్

## ఆల్ట్రావైలెట్ కిరణాలతో చెక్!

» దుష్పరిణామాల్లేకుండా వైరస్‌ను చంపవచ్చు

» ఎస్వీయూ ఇంజనీరింగ్ రిసెర్చ్ స్కాలర్ వెల్లడి

చిత్తూరు సిటీ, మార్చి 16: కరోనా వైరస్‌ను ఆల్ట్రా వైలెట్ కిరణాలతో చెక్ పెట్టవచ్చని తిరుపతిలోని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ రిసెర్చ్ స్కాలర్ కె యుగంధర్ చెబుతున్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. అంతర దృష్టిపై ఆధారపడి ఉండే ఈ విధానంలో సూర్యకాంతి కరోనా వైరస్‌ను చంపుతుందని ఆయన పేర్కొన్నారు. అదెలాగో వివరించారు. 'సూర్యకాంతి తరంగ పొడవు 400ఎన్‌ఎం వేవ్‌లెంగ్త్ కల్గిన వైలెట్ కిరణాలు. కరోనా వైరస్ వ్యాసార్థమైన 125ఎన్‌ఎంకి దగ్గరగా ఉంటుంది. ఒక వైలెట్ కిరణం కరోనా వైరస్ కణాన్ని తాకే అవకాశం 32 శాతం ఉంటుంది. వైరస్ కణ శరీరాన్ని కూల్చివేసే అవసరమైన వైలెట్ కిరణాలను ఎనర్జీ స్పెక్ట్రం గన్స్ ఉపయోగించడం ద్వారా మన శరీరానికి ఎటువంటి దుష్పరిణామాలు లేకుండా చేయవచ్చు. వాటర్ ప్యూరిఫయర్లలో వైరస్‌ను చంపడానికి డీప్ అల్ట్రా వైలెట్ కిరణాలు ఉపయోగిస్తున్నారు. సొరియాసిస్ వంటి వ్యాధులకు చికిత్సకు కూడా డీప్ అల్ట్రా వైలెట్ కిరణాలు వాడుతున్నారు. ఈ డీప్ అల్ట్రా వైలెట్ కిరణాలు శరీర కణాల డీఎన్ఏను దెబ్బతీస్తాయి. కేన్సర్ వంటి దుష్పరిణామాలకు కారణమవుతాయి. అందువల్ల కరోనా చికిత్సకు వైలెట్ కిరణాలను 400ఎన్‌ఎం నిర్దిష్ట సమయం వరకు ప్రసరింపచేయడం వల్ల మన శరీరంపై ఎటువంటి దుష్పరిణామాలు లేకుండా వైరస్‌ను చంపవచ్చు' అని యుగంధర్ వివరించారు.

» ఇది అణు విచ్ఛిత్తిలాగా పనిచేస్తుంది. యురేనియం అణువులపై అధిక శక్తి కణాలు ప్రసరించడం ద్వారా ఏ విధంగా యురేనియం విచ్ఛిత్తి అవుతుందో అలాగే ఈ వైలెట్ తరంగాలను ప్రసరించడం ద్వారా కరోనా వైరస్ విచ్ఛిత్తి అవుతుంది. మన శరీరం వెలుపల, పరిసరాల్లో శ్వాసకోశ, ఊపిరితిత్తుల్లో వైరస్‌ను చంపడానికి ఉపయోగించే ఎనర్జీ స్పెక్ట్రం గన్స్‌లను మనం అభివృద్ధి చేయాలి.

» చికిత్సకు గన్స్ నుంచి వైలెట్ కిరణాలు ఉపయోగించే ఈ పద్ధతితో దుష్పరిణామాలు తక్కువగా ఉంటాయి.



కరోనా నిర్మూలన విభాగం అధికారిక బృందం క్షేత్రస్థాయి పర్యటన

## బహ్రెయిన్‌లో కేరళవాసికి కరోనా

» 400 మంది నిర్బంధం.. వంతెన మూసేసిన సౌదీ

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, మార్చి 16: గల్ఫ్‌లో శరవేగంగా కరోనా వ్యాధి వ్యాపిస్తున్న దేశాల్లో బహ్రెయిన్ ఒకటి. ఈ ద్వీపకల్పానికి సౌదీ అరేబియాతో ఉన్న వంతెన ఒక్కటే రాకపోకలకు దిక్కు. దాన్ని తమ దేశం వైపు సౌదీ మూసివేయడంతో బహ్రెయిన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఒక పారిశుధ్య సంస్థలో పనిచేస్తున్న ప్రవాసీలు సల్మాబాద్‌లోని ఒక లేబర్ క్యాంపులో నివస్తున్నారు. ఇక్కడ ఉన్న 400 మందిలో అత్యధికులు తెలంగాణకు చెందినవారున్నారు. ఈ క్యాంపులో ఉన్న ఒక కేరళవాసికి కరోనా సోకినట్లు తేలడంతో అందరినీ పోలీసులు దిగ్బంధించారు.

## కరోనా 60% మందికి సోకాలి: బ్రిటన్ ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 16: తమ దేశంలో కనీసం 60% మందికి కరోనా వైరస్ సోకాలని బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ కోరుకుంటున్నారు. అలా జరిగితే సమూహ రోగనిరోధక శక్తి పెరుగుతుందని భావిస్తున్నారు. ఆ దేశంలో బహిరంగ సభలు, సమావేశాలపై నిషేధం లేదు. స్కూళ్లు మూతపడలేదు. బ్రిటన్ ప్రధాని వైఖరిని నిపుణులు తప్పుబడుతున్నారు. ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేయడం సమంజసం కాదని, కరోనాతో చెలగాటం వద్దంటూ బహిరంగ లేఖను విడుదల చేశారు.

## పశ్చిమబెంగాల్‌లో స్థానిక ఎన్నికలు వాయిదా

కోల్‌కతా, మార్చి 16: కరోనా వైరస్ నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నికల తేదీలపై నిర్ణయం తీసుకునేందుకు సోమవారం కోల్‌కతాలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సౌరవ్ దాస్ ప్రకటించారు.



## పుస్తకం చదివా.. వీడియో కాల్స్ చేశా

» ఐసొలేషన్ చీకటి గదేమీ కాదు

» భయం వద్దు.. అన్ని సౌకర్యాలుంటాయి

» కోలుకున్న తొలి వ్యక్తి అనుభవం

న్యూఢిల్లీ, మార్చి 16: ఐసొలేషన్, క్వారంటైన్.. అంటేనే జనాలు భయపడుతున్నారు. బందిఖానా లాంటి గదిలో, భరించలేని ఒంటరితనంలో ఉండాల్సి వస్తుందని జంకుతున్నారు. కరోనా వైరస్ లక్షణాలున్న వ్యక్తుల్లో కొందరు ఐసొలేషన్ భయంతో ఆస్పత్రుల నుంచి పరారవుతున్నారు. తాజాగా మధ్యప్రదేశ్‌లోనూ కరోనా లక్షణాలున్న 26 ఏళ్ల మహిళ, ఐసొలేషన్ పేరెత్తగానే ఆస్పత్రి నుంచి పరారైంది. పోలీసులు, వైద్య సిబ్బంది ఆమెను వెతికి ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే, ఐసొలేషన్‌పై ఈ అభిప్రాయం తప్పు అని కరోనా నుంచి కోలుకున్న దేశంలోని తొలి వ్యక్తి, ఢిల్లీకి చెందిన 45 ఏళ్ల వ్యాపారి చెప్పాడు. తాను రెండు వారాలపాటు ఢిల్లీ సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో ఐసొలేషన్‌లో ఉన్నానని, అదేమీ జైల్లోని చీకటి గదిలా ఉండదని పేర్కొన్నాడు. ఐసొలేషన్‌లో ఒంటరిగా ఉంటున్నాననే ఫీలింగ్ కలగలేదని, తనకు ఫోన్ అందుబాటులోనే ఉంచారని, వీడియో కాల్ ద్వారా కుటుంబసభ్యులతోనూ మాట్లాడానని చెప్పాడు. రోజూ రెండుసార్లు ప్రాణాయామం చేశానని, రెండుసార్లు 'చాణక్యనీతి' పుస్తకాన్ని చదివానని వెల్లడించాడు.

# షట్‌డౌన్ దిశగా భారత్!

» 15 రాష్ట్రాలకు విస్తరణ.. 114 కేసులు

» ఐరోపా, బ్రిటన్, టర్కీవాసులకు నో ఎంట్రీ

న్యూఢిల్లీ, మార్చి16: కరోనా ప్రకంపనలు తీవ్రంగా ఉండడంతో పూర్తి షట్‌డౌన్ దిశగా భారత్ కూడా కదులుతోంది. కరోనాపై ఏర్పాటైన మంత్రుల బృందం సోమవారం సమావేశమై పరిస్థితిని సమీక్షించింది. రోజురోజుకూ కేసుల సంఖ్య పెరుగుతుండడంతో ఆంక్షలను కఠినం చేయాలని నిర్ణయించింది. టర్కీ సహా ఐరోపా, బ్రిటన్ నుంచి ఏ విమానం, ఏ నౌక ఎవరినీ తీసుకురాకూడదని తేల్చిచెప్పింది. గల్ఫ్ నుంచి వచ్చే వారికి 14 రోజుల పాటు నిర్బంధ చికిత్స అమలు చేయనున్నారు. ఈ నెల 18 నుంచి 31 దాకా ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. దేశవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు (స్కూళ్లు, కాలేజీలు, వర్సిటీలు, సాంకేతిక, న్యాయ, ఇతర విద్యాసంస్థలు), వ్యాయామ శాలలు, ఈతకొలనులు, సినిమా హాళ్లు, సాంస్కృతిక, సామాజిక కేంద్రాలు మూసేయాలని రాష్ట్రాలకూ ఆరోగ్యశాఖ నిర్దిష్ట ఆదేశాలు జారీచేసింది. 'అనవసర ప్రయాణాలు మానండి. బస్సులు, రైళ్లు, విమానాల్లో ప్రయాణికులు ఒకరికొకరు తాకకుండా కనీసం మీటరు దూరం పాటించాలి. క్రీడా, ఇతర సామాజిక పోటీలు నిలిపేయాలి' అని కోరింది. ప్రభుత్వేతర సంస్థలన్నీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. దేశంలో మరో 4 కరోనావైరస్ కేసులు నమోదయ్యాయి. తొలిసారిగా ఒడిసా సహా.. లద్దాఖ్, జమ్మూ కశ్మీర్, కేరళలోనూ కొవిడ్-19 పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. దీంతో ఇప్పటిదాకా 15 రాష్ట్రాల్లోని 114 మంది (17 మంది విదేశీయులు)కి వైరస్ సోకింది. వీరిలో ఇద్దరు మరణించగా, 13 మందికి నయమైంది. ఢిల్లీలో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, మత పరమైన సమావేశాలను నిషేధించారు.

### 'మహా' ఉధృతి

వైరస్ ఉధృతి మహారాష్ట్రలో ఎక్కువగా ఉంది. ఇప్పటి దాకా 39 మందికి సోకింది. ముంబైలో ముగ్గురికి, నవీ ముంబై, యావత్మల్, నాగ్‌పూర్‌ల్లో ఒకరికి వ్యాధి ఉన్నట్లు భావిస్తున్నారు. 200 మంది అబ్జర్వేషన్లో ఉన్నారు. మూడు నెలల పాటు మునిసిపల్, పంచాయతీ ఎన్నికలను వాయిదా వేశారు. వర్సిటీలన్నీ పరీక్షలను వాయిదా వేశాయి. రాష్ట్రంలో పరిస్థితి దిగజారుతుండడంతో ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడారు.

### క్వారంటైన్ చేసిన వారికి ట్యాగ్‌లు

దేశంలో- ఆ మాటకొస్తే ప్రపంచంలో ఎక్కడా లేని ఓ అసాధారణ నిర్ణయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. నూరు శాతం హోం క్వారంటైన్ చేసిన వారికి ట్యాగింగ్ చేయనుంది. ఎవరితోనూ కలవకుండా ఇళ్లలోని ఓ గదికే పరిమితం చేసే వారి ఎడమచేతికి ఓ స్టాంప్ వేస్తారు. తద్వారా 'ఈ వ్యక్తి క్వారంటైన్‌లో ఉన్నాడు..' అని అందరికీ తెలిసేలా చేస్తారు. చికిత్స కేంద్రాల నుంచి ఏడుగురు పారిపోయి ప్రజల్లో కలిసిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న కన్యాకుమారి బీచ్

### అసెంబ్లీ సమావేశాలు కుదింపు

బిహార్, ఛత్తీస్‌గఢ్, బెంగాల్ అసెంబ్లీ సమావేశాలను కుదించేశారు. బలపరీక్ష జరగాల్సిన మధ్యప్రదేశ్‌లోనూ పదిరోజుల పాటు వాయిదా వేశారు. కరోనా పాజిటివ్ కేసులకు చికిత్స ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని బిహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రకటించారు. పార్లమెంట్‌కు వచ్చే ఎంపీలతో పాటు సిబ్బంది, జర్నలిస్టులు, ఇతరులకు థర్మల్ స్క్రీనింగ్ చేస్తున్నారు.

### కర్ణాటకలో స్తంభించిన రవాణా

కరోనా ఆంక్షలతో కర్ణాటకలో బంద్ వాతావరణం కనిపిస్తోంది. 60 శాతం రవాణా స్తంభించింది. మరొకరికి కొవిడ్-19 పాజిటివ్ నిర్ధారణ అయింది. ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు. తమిళనాడులో స్కూళ్లు, కాలేజీలు, మ్యూజియాలు, పార్కుల, పబ్‌లు, మైదానాలు, జిమ్‌లు, బార్లు, షాపింగ్ మాల్స్ 31 దాకా మూసివేయనున్నారు.

### కరోనా మృతుడి కుమార్తెకు పాజిటివ్

దేశంలో కరోనా తొలి మృతుడు, కర్ణాటక కలబుర్గికి చెందిన వ్యక్తి (76) కుమార్తెకు కూడా వైరస్ సోకింది. ఆయన కుమార్తె సహా మరో నలుగురికి పరీక్షలు చేశారు.

### తాజ్ క్లోజ్.. కోవెళ్లు, పార్కులకూ సెగ

ప్రపంచ ప్రఖ్యాత తాజ్ మహల్‌ను 31వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీంతో పాటు పురావస్తు శాఖ పరిధిలోకొచ్చే 3,691 చారిత్రక కట్టడాలను కూడా మూసేస్తున్నట్లు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ వెల్లడించారు. ముంబైలోని ప్రసిద్ధ సిద్ధివినాయక, తుల్జాభవానీ ఆలయాలను ప్రభుత్వం మూసేసింది. గువాహటిలోని కామాక్షి ఆలయం, బెంగాల్లో రామకృష్ణా మిషన్ కేంద్ర కార్యాలయం బేలూర్ మఠంలోనూ అన్న సంతర్పణను నిరవధికంగా వాయిదా వేశారు.

# అమెరికా అష్టదిగ్బంధం!

» ఒక్క రోజులో ఇటలీలో 349, ఇరాన్‌లో 129 మంది బలి

» ప్రపంచవ్యాప్తంగా 7,000 దాటిన మృతుల సంఖ్య



బాల్కనీలో నుంచి పాటలు పాడుతున్న ఇటలీ వాసులు

వాషింగ్టన్/ప్యారిస్/టెహ్రాన్, మార్చి 16: కరోనా వైరస్ వేగంగా వ్యాపిస్తుండడంతో అమెరికా దాదాపుగా 'షట్‌డౌన్' అవుతోంది. కరోనా బారినపడి అమెరికాలో 64 మంది మృతిచెందారు. పాజిటివ్ కేసులు 3,200కు పెరిగాయి. వివిధ రాష్ట్రాల్లో గవర్నర్లు, మేయర్ల ఆదేశాలతో సినిమా థియేటర్లు, ఇతర వినోద వేదికలు, బార్లు, నైట్‌క్లబ్‌లు మూతపడుతున్నాయి. పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. మరోవైపు విదేశీ పర్యటనలకు వెళ్లిన అమెరికన్లు హడావుడిగా తిరుగుముఖం పడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో 50 శాతం విమానాలను తగ్గిస్తామని యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. కొవిడ్-19ను కట్టడి చేయాలంటే 14 రోజులపాటు షట్‌డౌన్ అవసరమని శ్వేతసౌధం టాస్క్‌ఫోర్స్ సభ్యుడు డాక్టర్ ఆంథోని ఫౌసీ అభిప్రాయపడ్డారు. అయితే, పరిస్థితి అదుపులోనే ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా మృతుల సంఖ్య 7,000 దాటింది. ఇన్ఫెక్షన్ కేసులు 1,75,536కు పెరిగాయి. ఇటలీలో సోమవారం కొత్తగా 349 మరణాలు నమోదయ్యాయి. దీంతో మృతుల సంఖ్య 2,158కి పెరిగింది. చైనా తర్వాత ఇటలీలోనే అత్యధిక మరణాలు సంభవించాయి. ఫ్రాన్స్‌లో కరోనా వ్యాప్తి ఆందోళనకరంగా ఉందని ఆ దేశ జాతీయ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ప్రతి మూడు రోజులకు కేసుల సంఖ్య రెట్టింపు అవుతోందని ఆ సంస్థ అధిపతి జిరోమ్ సలొమన్ తెలిపారు. బహ్రెయిన్‌లో కరోనాతో 65 ఏళ్ల మహిళ మృతిచెందారు. ఆస్ట్రేలియాలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 350కు పెరిగింది. యూరోపియన్లతో పాటు ఇండియా సహా పలు దేశాల నుంచి వచ్చే వారిపై బంగ్లాదేశ్ 16 రోజుల పాటు నిషేధం విధించింది. ఇరాన్‌లో మరో 129 మంది కరోనాకు బలయ్యారు. దీంతో మృతుల సంఖ్య 853కు చేరింది. 14,991 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. పాకిస్థాన్‌లో కరోనా కేసుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. సింధ్‌లో కొత్తగా 146 కేసులతో మొత్తం 179కు చేరింది. స్పెయిన్‌లో 24 గంటల్లో 1,000 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 8,744కు పెరిగింది. మరో 9 మంది మరణించడంతో మృతుల సంఖ్య 297కు పెరిగింది. ఇతర దేశాల నుంచి చైనా వచ్చిన 12 మందికి కరోనా ఉన్నట్లు గుర్తించారు. వరుసగా మూడు రోజులుగా దేశీయంగా సోకిన కేసుల కంటే విదేశాల్లో కరోనా బారినపడిన వచ్చిన వారి సంఖ్యే ఎక్కువ.

## ఇక వర్చువల్ కోర్టులు: సుప్రీం

కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉండడంతో త్వరలో వర్చువల్ కోర్టులు నిర్వహిస్తామని సుప్రీంకోర్టు ప్రకటించింది. "వచ్చే వారం నుంచి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కేసుల విచారణ జరుపుతాం. రోగ వ్యాప్తికి సుప్రీంకోర్టు కేంద్రం కారాదన్నది మా అభిలాష" అని జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. అన్ని రాష్ట్రాల హైకోర్టులతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డే నిరంతరం చర్చలు జరుపుతున్నారు. అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. కక్షిదారులు, న్యాయవాదులు, సిబ్బంది.. అందరి ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని అత్యవసర కేసులు మాత్రమే చేపడతాం' అని సుప్రీంకోర్టు ఓ ప్రకటనలో తెలిపింది. దేశంలోని జైళ్లలో ఖైదీలను కుక్కేసినట్లు ఉంచడం వల్ల కరోనా వ్యాప్తి చెందవచ్చన్న వార్తలను సుప్రీంకోర్టు స్వచ్ఛందంగా విచారణకు స్వీకరించి అన్ని రాష్ట్రాలకూ నోటీసులు జారీ చేసింది.

## శ్మశానంలో ఫ్రెంచి వాసి నిద్ర

భారత పర్యటనలో ఉన్న విదేశీయులు కరోనాతో నానా అగచాట్లూ పడుతున్నారు. వారికి ప్రజలు సహాయ నిరాకరణ చేస్తున్నారు. తిరువనంతపురం శివార్లలో అర్జెంటీనా మహిళ మరియా అర్ధరాత్రి రోడ్డు పక్క ఒంటరిగా నిలబడి సహాయం కోసం ఎదురు చూడడం వివాదం రేపింది. ఏ హోటల్ లేదా లాడ్జిలోనూ తనకు వసతి సౌకర్యం ఇవ్వట్లేదని ఆమె వెక్కివెక్కి ఏడ్చింది. ఆఖరికి పోలీసుల సాయం కోరినా వారూ వెంటనే స్పందించలేకపోయారు. చివరకు ఓ అంబులెన్స్‌లో మరియాను ఓ ఐసోలేషన్ సెంటర్‌కు పంపేశారు. స్పెయిన్‌కు చెందిన డేవిడ్, లాయా అనే భార్యాభర్తలదీ అదే పరిస్థితి. కొట్టాయంలో ఏ హోటల్ యాజమాన్యమూ వారికి వసతి ఇవ్వలేదు. వారికి వైరస్ లక్షణాలు లేకపోయినప్పటికీ 28రోజుల పాటు క్వారంటైన్ చేశారు. కొట్టాయం జిల్లాలోని వాగమోన్‌లో ఓ ఫ్రెంచ్ జాతీయుడికి ఎక్కడా వసతి దొరకకపోవడంతో పెట్టే బేడాతో ఓ శ్మశానంలో నిద్రించడం పరిస్థితికి అద్దం పడుతుంది. పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నప్పటికీ విదేశీయుల నుంచి కరోనా వ్యాప్తి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ ప్రస్తుతం 5,150 మంది విదేశీయులున్నారు. స్పెయిన్ దేశస్థుల్నుంచి 25 మంది డాక్టర్లు సహా 75 మందికి సోకినట్లు అనుమానిస్తున్నారు.

## ఎస్ఈసీకి సీఎస్ లేఖ రాజ్యాంగ విరుద్ధం

**▸▸ దానిని ఆమె వెంటనే వెనక్కి తీసుకోవాలి: యనమల**



అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాయడం రాజ్యాంగ విరుద్ధం. ఒకసారి ఎన్నికలు ప్రకటించాక, ఇక ప్రభుత్వానికి నిర్వహణలో పాత్ర ఉండదు. ఎన్నికలు వాయిదా వేయడానికి ఎస్ఈసీ ఎవరని సీఎం బెదిరించడం, సీఎం ఆదేశాలతో సీఎస్ లేఖ రాయడం రాజ్యాంగ ఉల్లంఘనలే. ఈ చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 కే, 243 జడ్‌ఏకు వ్యతిరేకం. సీఎం జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గ పాలనను రాజ్యాంగ అధినేతలే చక్కదిద్దాలన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గ పాలనను రాజ్యాంగ అధినేతలే చక్కదిద్దాలి" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తెలిపారు. ఈ మేరకు యనమల రామకృష్ణుడు సోమవారమిక్కడ ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎస్ తన లేఖను వెంటనే వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## బూత్‌లో సీసీ కెమెరాలు పెట్టండి: జేసీ

విజయవాడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): "పోలింగ్ రోజున ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలంటే ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఈసీని కోరాం. దీనివల్ల దౌర్జన్యకాండను ఆపొచ్చని సూచించాం. ఒకవేళ ఈసీ వద్ద డబ్బులు లేకపోతే ఆ ఖర్చును మా పార్టీ భరిస్తుందని చెప్పాం. అన్ని విషయాలను విన్న ఎస్ఈసీ సమాధానం చెప్పలేదు కాని, తలూపారు. దాని అర్థం, పరమార్థం ఏమిటనేది చూడాలి" అని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం విజయవాడలో ఎన్నికల సంఘ కమిషనర్ రమేశ్ కుమార్‌ను కలిసిన ఆయన అనంతరం మీడియాతో మాటాడారు. ఎన్నికలపై హైకోర్టే జోక్యం చేసుకోదని, అలాంటప్పుడు తాను ఎలా వ్యాఖ్యానిస్తానని జేసీ అన్నారు.

## రాష్ట్రంలో అరాచక పాలన

**▸▸ పథకం ప్రకారమే టీడీపీ కార్యకర్తల అరెస్టు : లోకేశ్**

మంగళగిరి, మార్చి 16: "ఆంధ్రప్రదేశ్‌లో అరాచకపాలన కొనసాగుతోంది. పథకం ప్రకారమే టీడీపీ నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు" అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పని చేస్తోన్న నాయబ్ రసూల్ ఫేస్‌బుక్‌లో చేసిన ఓ పోస్ట్‌పై గత నెల 29న మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం రాత్రి పోలీసులు నాయబ్ రసూల్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న లోకేశ్ సోమవారం మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లారు. నార్త్‌సబ్ డివిజన్ డీఎస్పీ దుర్గాప్రసాద్, రూరల్ సీఐ శేషగిరిరావులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు 41 నోటీసు ఇవ్వకుండా ఆదివారం రాత్రి 10.30 సమయంలో ఇంటికి వెళ్లి రసూల్‌ని అదుపులోకి తీసుకోవడాన్ని తప్పు పట్టారు.



నార్త్‌సబ్ డివిజన్ డీఎస్పీ దుర్గాప్రసాద్‌తో మాట్లాడుతున్న నారా లోకేశ్, పక్కన ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, దీపక్‌రెడ్డి, బాబూ రాజేంద్ర ప్రసాద్

### తప్పు దిద్దుకోకుండా..

# మూర్ఖంగా ఎదురుదాడి

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మనుషులు పరస్పరం కలుసుకోవడం వల్ల ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందని గమనించి దేశంలోని కోర్టులు కూడా విచారణలను తగ్గించేసుకుంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్రంలో 3 కోట్ల మంది ఒకేసారి బయటకు వస్తే ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా ఉంటుందా? తన రాజకీయ అవసరాల కోసం ముఖ్యమంత్రి ప్రజారోగ్యాన్ని బలిపెడతారా? దేశంలోని మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలకు ఈయనకు ఉన్నపాటి తెలివి లేక అన్నీ నిలిపివేస్తున్నాయా? ఏమిటీ మూర్ఖత్వం' అని ఆయన విరుచుకుపడ్డారు. ఈ రోజు సమస్య పెద్దగా లేదు కాబట్టి ఇక రాదని అనుకోలేమని, ఇతర దేశాల్లో ఈ వైరస్ విజృంభిస్తున్న తీరు దీనికి నిదర్శనమని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..



### నవ్వులాటగా మారారు..

'ఇరాన్‌లో మొదటి వారంలో కేవలం రెండు కేసులే నమోదయ్యాయి. నాలుగో వారానికి 4,700, ఐదో వారానికి 12 వేల కేసులు నమోదయ్యాయి. ఇటలీలో మొదటి వారంలో 3 కేసులు నమోదైతే ఐదో వారానికి 21 వేల కేసులు అయ్యాయి. దీనిని తీవ్రంగా తీసుకోకుండా ఫ్రాన్స్‌లో ఎన్నికలు పెట్టారు. ఆ ఒక్క రోజే ఆ దేశంలో 900 కేసులు నమోదయ్యాయి. ఇరవై మంది చనిపోయారు. గతంతో పోలిస్తే ఓటింగ్ ఇరవై శాతం తగ్గింది. 45 శాతం పోలింగ్ మాత్రమే జరిగింది. ఇప్పుడీ వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ఆ దేశం నానా తంటాలు పడుతోంది. వచ్చే నెలలో జరగాల్సిన స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. కక్షిదారులతో ముఖాముఖి విచారణలు నిలిపివేసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాత్రమే విచారణలు నిర్వహించాలని సుప్రీంకోర్టు.. వారంలో మూడు రోజులే పనిచేయాలని తెలంగాణ హైకోర్టు.. 15 రోజులపాటు అత్యవసర కేసులు మాత్రమే తీసుకోవాలని మన హైకోర్టు నిర్ణయించాయి. వీళ్లంతా తెలివి లేక ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నారా? కరోనా పెద్ద సమస్య కాదని.. పారసిటమల్ సరిపోతుందని జగన్ చేసిన వ్యాఖ్య దేశవ్యాప్తంగా ఆయన్ను నవ్వులాటగా మార్చింది. కరోనాకు మందు కనుక్కున్నందుకు ఆయనకు నోబుల్ ప్రైజ్ ఇవ్వాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.'

### అధికారులకు బాధ్యత లేదా?

'రాష్ట్రంలో కరోనా ప్రభావం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాయడం ఘోరం. నలుగురు ఎక్కడా గుమికూడకుండా సకల జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాలకు లేఖలు రాస్తే.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇలా ఎలా లేఖ రాస్తారు? 'ఇటీవలి కాలంలో ఇతర దేశాల నుంచి రాష్ట్రంలోకి ఆరున్నర వేల మంది వచ్చారు. వారెవరో ప్రభుత్వం వద్ద సమాచారం ఉందా? వారందరికీ పరీక్షలు చేశారా.. కరోనా గిరోనా ఏదీ లేదని గాలికి వదిలేసి కూర్చున్నారా? మా ఆరోగ్యాలను పణంగా పెట్టే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిది? తూర్పుగోదావరి జిల్లాలో ఒక మహిళ కరోనా లక్షణాలతో చనిపోయిందని అంటున్నారు. ఆ జిల్లాలో 900 మంది ప్రవాసాంధ్రులు విదేశాల నుంచి తిరిగి వచ్చినట్లు చెబుతున్నారు. వారి విషయంలో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం మాని మాజీ ఎన్నికల కమిషనర్ రమాకాంతరెడ్డిని పిలిచి ఎన్నికలు ఎలా పెట్టాలని చర్చిస్తున్నారు. ఇది పైశాచిక ప్రవృత్తి తప్ప మరొకటి కాదు'

### వీటన్నిటితో వ్యాప్తి..

'సరే.. ఎన్నికలు పెడతారు. అక్కడ పెన్నో పెన్సిలో అనేక మంది పట్టుకోవలసి వస్తుంది. దానివల్ల కరోనా వ్యాపిస్తే బాధ్యత ఎవరిది? కరెన్సీ నోట్లు, నాణాలు, తలుపుల హ్యాండిల్స్, లిఫ్ట్ బటన్లు, రెయిలింగులు, పాల ప్యాకెట్లు, పొద్దున్నే వేసే పేపర్లు వంటి వాటి ద్వారా కూడా వ్యాపించవచ్చు. ఇన్ని రకాలుగా ప్రమాదం ఉంది కాబట్టే మరింత అప్రమత్తంగా ఉండాలని కేంద్రం చెబుతోంది. నాకు తెలిసి ఒక వైరస్ విషయంలో ప్రపంచదేశాలు ఇంత ఆందోళనకు గురైన సందర్భం లేదు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా మొద్దు నిద్ర వదిలి కరోనాపై దృష్టి పెట్టాలి. ఎన్నికలపై ఉన్న శ్రద్ధలో పదోవంతు కూడా ఆయనకు ఈ వైరస్‌పై ఉన్నట్లు లేదు. ఎన్నికలు ఆగిపోవడం వల్ల కేంద్ర నిధులు రావనుకుంటే కరోనా సమస్యను కేంద్రానికి వివరించి ఆ నిధులు తెచ్చుకోవచ్చు. ఇదేమీ పెద్ద సమస్య కాదు. జగన్‌కు బాధ్యత లేదు. బాధ్యతతో వ్యవహరించిన ఎన్నికలకమిషనర్‌పై దాడి చేస్తున్నారు. వ్యాప్తిని అరికట్టడంలోభాగంగా మేంకూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలనుకుంటున్నాం. పార్టీ కార్యాలయానికి రావడంతగ్గించడం.. ఎక్కువ మంది గుమికూడకుండా నిరోధించాలని భావిస్తున్నాం.'

## మా మీద పెట్టిన పోస్టింగులకు ఎన్ని కేసులు పెట్టారు?

**▸▸ వైసీపీ వాళ్లను వదిలేస్తే పోలీసుల కథ తేలుస్తా**

**▸▸ డీజీపీకి చంద్రబాబు స్పష్టీకరణ**

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'కరకట్ట కమల్‌హసన్ అని మా సోషల్ మీడియా విభాగంలో ఉన్న ఒక సభ్యుడు పోస్టు పెడితే అతడిని పోలీసులు అరెస్టు చేశారు. నా మీద, నా కుటుంబ సభ్యుల మీద, మా పార్టీ మహిళా నేతల మీద ఎంత ఘోరంగా, అసభ్యకరంగా పోస్టులు పెట్టారు? వాటికి ఎన్ని కేసులు పెట్టారు? ఎంత మందిని అరెస్టు చేశారు' అని టీడీపీ అధినేత చంద్రబాబు డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను నిలదీశారు. 'జగన్ బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు నేనే కత్తితో వివేకాను పొడుస్తున్నట్లు గ్రాఫిక్ వేసి నారాసుర రక్త చరిత్ర అని పెద్ద శీర్షిక పెట్టి జగన్ పత్రికలో రాశారు. అటువంటి వాటికి ఎన్ని కేసులు పెట్టాలి? మా వాళ్లను మాత్రమే అరెస్టు చేసి వైసీపీ వాళ్లను వదిలిపెడితే పోలీసుల కథ తేలుస్తా. నేరుగా మీ దగ్గరకే వచ్చి తేల్చుకుంటా. తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేస్తున్న ప్రతి పోలీసు అధికారిపైనా ప్రైవేటు కేసులు పెడతాం. క్రిమినల్ ప్రాసిక్యూషన్ కోరతాం. పోలీసు వ్యవస్థ ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలి. అడ్డగోలు అరెస్టులతో ఖాకీ టెర్రరిజం చూపిద్దామనుకుంటున్నారా?' అని హెచ్చరించారు.

### టీడీపీకి కులం లేదు.. చంద్రబాబు

'పౌరుషానికి, రోషానికి వయసుతో నిమిత్తం లేదు. దమ్ముంటే చాలు. గుండె ధైర్యానికి వృద్ధాప్యం అడ్డురాదు' అని చంద్రబాబు సోమవారం ట్వీట్ చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సింగరికుంటకు చెందిన టీడీపీ సైనికుడు అంజిరెడ్డి నామినేషన్ వేసేందుకు వెళ్తున్నప్పుడు వైసీపీ అరాచక శక్తులు మూకుమ్మడిగా దాడి చేసినా.. వారి దౌర్జన్యాన్ని ధిక్కరించి అంజిరెడ్డి తొడ గొట్టారని తెలిపారు. ఈసీకే కులం అంటగట్టిన వాళ్లు.. అంజిరెడ్డికి ఏ కులం అంటగడతారని ప్రశ్నించారు. టీడీపీకి కులం లేదనడానికి అంజిరెడ్డే నిదర్శనమని పేర్కొన్నారు. కాగా, అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చంద్రబాబు ఆయనకు నివాళులర్పించారు.

## ఎన్నికలను రీషెడ్యూల్ చేయాలి

**▸▸ కేంద్ర బలగాలతో మళ్లీ నిర్వహించాలి: కన్నా**



తిరుపతి, కర్నూలు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): "స్థానిక ఎన్నికలను రీషెడ్యూల్ చేసి కేంద్రబలగాలతో మళ్లీ నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ తిరుపతిలో డిమాండు చేశారు. సీఎస్, ఎస్ఈసీకి రాసిన లేఖను వెనక్కి తీసుకుంటారని భావిస్తున్నానని చెప్పారు. కర్నూలులో బీజేపీ నేత బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కరోనాను కూడా గూండాయిజంతో భయపెట్టాలని చూస్తోన్న సీఎంకు నోబెల్ బహుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానన్నారు.

### ఎన్నికల్లో దౌర్జన్యాలపై బీజేపీ మౌనదీక్ష

ఏలూరు కలెక్టరేట్, మార్చి 16: రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత దుర్మార్గంగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరిగిందని బీజేపీ నేత, మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. వైసీపీ దౌర్జన్యాలు, అన్యాయాలు, అక్రమాలు, అరాచకాలకు వ్యతిరేకంగా బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరులోని కలెక్టరేట్ వద్ద మౌనదీక్ష నిర్వహించారు.

## పారాసిటమల్ రహస్యం ప్రపంచానికి చెప్పు

**▸▸ అది తెలియకే జనం చనిపోతున్నారు: శైలజానాథ్**

**▸▸ జగన్.. రాజ్యాంగాన్ని చదువుకో: తులసిరెడ్డి**

విజయవాడ, కడప, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఒక్క పారాసిటమల్ టాబ్లెట్ వేసుకుంటే కరోనా దూరమవుతుందని చెప్పిన ముఖ్యమంత్రి జగన్.. ఆ రహస్యాన్ని ప్రపంచ దేశాలకు చెప్తే బాగుంటుందని, అది తెలియకే జనం చనిపోతున్నారని పీసీసీ చీఫ్ సాకే శైలజానాథ్ ఎద్దేవా చేశారు. వాయిదా పడిన ఎన్నికల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించిన జగన్.. బీసీ రిజర్వేషన్లు, రాష్ట్రానికి రావాల్సిన ఆర్థిక సంఘం నిధుల విషయంలో పిటిషన్లు దాఖలు చేసి ఉంటే బాగుండేదన్నారు. ఎస్ఈసీ అధికారాలను ప్రశ్నిస్తూ జగన్ మాట్లాడిన తీరు సరికాదని ఏపీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.తులసిరెడ్డి తప్పుబట్టారు. రాజ్యాంగం గురించి తెలియకపోతే ఒకసారి చదవాలని, లేదంటే తెలిసిన వారి నుంచి తెలుసుకోవాలని హితవు పలికారు.

## ఈసీ రద్దుకూ వెనుకాడరు!

**▸▸ ఇది రద్దుల ప్రభుత్వం: సీపీఐ రామకృష్ణ**

మంగళగిరి, మార్చి 16: సీఎం జగన్ అవసరమైతే ఎన్నికల కమిషన్(ఈసీ)ను కూడా రద్దు చేయడానికి వెనుకాడరని, ఇది రద్దుల ప్రభుత్వమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యానించారు. డ్రోన్ కేసులో అరెస్టై ముందస్తు బెయిల్ పొందిన అమరావతి రైతులను పరామర్శించేందుకు సోమవారం మంగళగిరిలో కోర్టు వద్దకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రైతులకు మద్దతుగా 13 జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

### మూడు గంటల్లోనే

## శ్రీవారి దర్శనం

**▸▸ కరోనా భయంతో తగ్గిన భక్తుల రాక**

**▸▸ వెలవెలబోతున్న తిరుమల క్షేత్రం**



ఖాళీగా సర్వదర్శనం క్యూలైన్లు

తిరుమల, మార్చి 16: కరోనా వైరస్ ప్రభావం తిరుమలపై బాగానే పడింది. కొవిడ్-19 వైరస్ భయంతో చాలా మంది తిరుమల పర్యటనను వాయిదా వేసుకోవడంతో భక్తుల రాక భారీగా తగ్గుతోంది. అలిపిరి చెక్‌పాయింట్ మొదలు శ్రీవారి ఆలయం వరకు అన్ని ప్రదేశాల్లో భక్తులు పలచగా కనిపిస్తున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, క్యూలైన్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నారాయణగిరి ఉద్యానవనంలోనూ షెడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మాడవీధులు, అఖిలాండం, తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన భవనం, కాటేజీలు, కల్యాణకట్ట, యాత్రీకుల వసతి సముదాయాల్లో భక్తులు తక్కువ సంఖ్యలో.. మాస్కులు ధరించి కనిపిస్తున్నారు. సాధారణంగా ఆదివారాల్లో 80 వేలకు పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారు. అయితే, 15న ఆ సంఖ్య 63,747కు తగ్గింది. మరికొద్దిరోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### నేటి నుంచి టైంస్లాట్ దర్శనం

కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని టీటీడీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. 1, 2 వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని కంపార్టుమెంట్లలో భక్తులు సమూహాలుగా కూర్చునే విధానానికి స్వస్తిపలికి, మంగళవారం నుంచి టైంస్లాట్ ద్వారా నేరుగా క్యూలో వెళ్లి శ్రీవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసింది. సోమవారం అర్థరాత్రి 12గంటల నుంచి టైంస్లాట్ టోకెన్లు అందించేందుకు వీలుగా తిరుమల, తిరుపతిలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ టోకెన్లు తీసుకునేందుకు భక్తులు తప్పనిసరిగా ఆధార్, పాన్, ఓటర్ కార్డ్, డ్రైవింగ్‌లైసెన్స్, పాస్‌పోర్టు వంటి ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలి. తిరుమలలో సీఆర్వో వద్ద 7, ఆర్టీసీ బస్టాండ్‌లో 7 కౌంటర్లు ఏర్పాటు చేశారు. అలాగే తిరుపతిలో విష్ణునివాసం, శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వెనుకవున్న గోవిందరాజస్వామి 2, 3 సత్రాలు, ఆర్టీసీ బస్టాండ్, అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్లు జారీ చేస్తారు. అలాగే అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల్లో కూడా టోకెన్లు పొందవచ్చు.




టోకెన్ల అందుబాటు తెలిపే డిస్‌ప్లే బోర్డు



కరోనా వైరస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి ఎం సనత్‌కుమార్ సాగరతీరంలో ఏర్పాటు చేసిన సైకతశిల్పం. - చిల్లకూరు



దుకాణాల్లో మాస్కులు దొరకడంలేదు. ఉన్నవీ అధికధరకు అమ్ముతున్నారు. దీంతో విజయవాడలో టైలర్లు తయారు చేసిన మాస్కులనే కొనుగోలు చేసి ధరిస్తున్నారు



కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు.. ప్రజల ఆరోగ్యం కోసం శ్రీశైల దేవస్థానంలో చేస్తున్న మహామృత్యుంజయ హోమం

## అత్యవసర కేసులే విచారణ

**▸▸ మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు**

**▸▸ లాయర్లు, కక్షిదారులు జ్వరంతో రావొద్దు**

**▸▸ న్యాయమూర్తికి చెబితే విచారణ వాయిదా**

**▸▸ హైకోర్టు నిర్ణయం.. కింది కోర్టుల్లో కూడా..**

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 'కరోనా' వైరస్ నియంత్రణకు హైకోర్టు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం నుంచి కేవలం ముఖ్యమైన, అత్యవసరమైన, బెయిళ్లు, ముందస్తు బెయిళ్లు, జైలు శిక్ష అమలు నిలుపుదల కేసులు, అధికారుల వ్యక్తిగత హాజరుకు సంబంధించిన కేసులు తదితరాలను మాత్రమే అత్యవసరంగా విచారించాలని నిర్ణయించింది. అదేవిధంగా మధ్యంతర ఉత్తర్వుల గడువు ముగిసిపోతున్న పక్షంలో సదరు న్యాయవాది.. రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) వద్ద ప్రస్తావించి న్యాయమూర్తి వద్ద ఉత్తర్వులు పొందవచ్చు. రెండు వారాల పాటు ఈ నిబంధనలు వర్తిస్తాయని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా కరోనా నియంత్రణకు పలు సూచనలు చేయడంతో పాటు ఆంక్షలూ విధించారు. హైకోర్టులోనే గాక కింది కోర్టుల్లోనూ ఇవే ఆదేశాలు అమలు చేయాలని స్పష్టం చేశారు.

- తీవ్ర జ్వరపీడిత లాయర్లు, కక్షిదారులు కోర్టు ప్రాంగణంలోకి రావద్దు.
- జ్వరం వల్ల ఎవరైనా లాయర్ రాలేని పక్షంలో.. ఆ విషయాన్ని జడ్జిల దృష్టికి తీసుకొస్తే.. కేసును వాయిదా వేస్తామే తప్ప కొట్టేయం.
- ఏదైనా అత్యవసర పిటిషన్ పరిశీలించాల్సివస్తే.. దాని అవసరం తెలుపుతూ పిటిషన్ దాఖలు చేయాలి. దానిని న్యాయమూర్తులు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారు.
- ప్రాంగణంలో, కోర్టు గదుల్లో భారీగా గుమిగూడరాదు.
- ప్రాంగణంలో న్యాయవాదులు, భద్రతా సిబ్బంది చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి. వారికి, ప్రాంగణంలో ఉన్న పోస్టల్, రైల్వే, బ్యాంకింగ్ విభాగాల వారికి మాస్కులు, శానిటైజర్లు సిద్ధంగా ఉన్నాయి.
- ఎమర్జెన్సీ కేసుల వేళ న్యాయవాదులకు మాస్కులు అవసరమైన పక్షంలో ప్రొటోకాల్ సెక్షన్ నుంచి వారు మాస్కులు పొందవచ్చు.
- మెడికల్ ఆఫీసర్, ఇతర వైద్య సిబ్బంది హైకోర్టులో అందుబాటులో ఉంటారు. థర్మల్‌గన్ ద్వారా కోర్టుకు వచ్చే వారిని పరీక్షిస్తారు. ఈ పరీక్షలో ఏదైనా తేలితే వారికి తగిన వైద్యసాయం చేస్తారు.

### సహచర న్యాయమూర్తులతో సీజే భేటీ

కరోనా నియంత్రణపై చర్యలు చేపట్టేందుకు అనువుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి సోమవారం మధ్యాహ్నం తన సహచర న్యాయమూర్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కరోనా నియంత్రణపై కూలంకషంగా చర్చించారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీజే పాల్గొన్నారు. ఈ సమావేశాల సారాంశాన్ని, మున్ముందు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన న్యాయవాదులకు స్వయంగా వివరించారు. కాగా.. హైకోర్టు, కింది కోర్టుల్లో కరోనా వ్యాప్తి చెందకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ సోమవారం అత్యవసరంగా దాఖలైన పిల్‌పై మంగళవారం విచారణ జరుగనుంది.

# కరోనా కలకలం

(మొదటి పేజీ తరువాయి)

జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నాడు. దీంతో అతన్ని ముందు జాగ్రత్తగా కడప రిమ్స్‌కు తరలించి ఐసోలేషన్‌లో ఉంచినట్టు వైద్యులు తెలిపారు. అతని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. జర్మనీలో ఉద్యోగం చేస్తున్న కర్నూలు వాసి ఈ నెల 4న సొంత ఊరికి వచ్చాడు. 5న శ్రీశైలం వెళ్లాడు. ఈనెల 9 నుంచి ఆ యువకుడు జలుబుతో బాధపడుతున్నాడు. అయితే కరోనా లక్షణాలనే అనుమానంతో అతడు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఐసోలేషన్ వార్డులో చేరాడు. అతని నమూనాలు తిరుపతి ల్యాబ్‌కు పంపించారు. కృష్ణా జిల్లా కైకలూరులోనూ కరోనా కలకలం రేపింది. గ్రామానికి చెందిన యువకుడు విజయవాడలోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ శిక్షణ నిమిత్తం ఇటీవల హైదరాబాద్ వెళ్లొచ్చాడు. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతుండంతో వైద్యులు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఆ యువకుడి ఇంటి వద్ద బ్లీచింగ్ చల్లడంతో కుటుంబసభ్యులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం మండలం గొల్లనపల్లికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఇటీవల విదేశాల నుంచి రావడంతో జిల్లా వైద్యాధికారులు అతన్ని ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిసింది. ఒంగోలులోనూ ఓ అనుమానిత కేసు నమోదైంది. కాగా.. సింగపూర్ నుంచి పాడేరు వచ్చిన యువకుడు అధికారులను నానా హైరానాకు గురిచేశాడు. వైద్యాధికారులు అతన్ని విశాఖలోని కేజీహెచ్‌కు తరలించే ఏర్పాటు చేయగా రెండు రోజుల క్రితం ఆ యువకుడు అదృశ్యమయ్యాడు. అతని ఆచూకీ కోసం వైద్య, ఆరోగ్య, రెవెన్యూ అధికారులు గాలిస్తున్నారు.

### విదేశీ పర్యాటకుల కట్టడి

కరోనా వ్యాప్తి నేపథ్యంలో విశాఖ ఏజెన్సీలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రధానంగా అరకులోయ, పాడేరు, లంబసింగి వంటి ప్రాంతాలకు విదేశీ పర్యాటకులు రాకుండా కట్టడి చేయాలని జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో సోమవారం సమావేశమైన అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కరోనా హడావిడి తగ్గేవరకూ ఇతర రాష్ట్రాల పర్యాటకులను కూడా రానివ్వకూడదని నిర్ణయించారు. విదేశాల నుంచి వచ్చి, తిరుపతి రుయా ఆస్పత్రిలో చేరిన ఐదుగురిలో కరోనా వైరస్ లేదని వైద్యులు నిర్ధారించారు. కాగా.. ఇటీవల దుబాయ్ నుంచి వచ్చిన తర్వాత అనారోగ్యానికి గురై కాకినాడ జీజీహెచ్‌లో చేరిన మహిళ (38) సోమవారం మృతిచెందింది. అయితే ఆమెకు వైరస్ సోకినట్టు నిర్ధారణ కాలేదు. మెదడువాపు సంబంధిత వ్యాధితో ఆమె మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు.

### ఏపీ నిట్‌కు సెలవులు

కరోనా వైరస్ కారణంగా ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏపీ నిట్)కి సెలవులు ప్రకటించారు. ఏపీ నిట్‌కు సెలవులు ప్రకటించామని తిరిగి ఏప్రిల్ 8 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని నిట్ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రకాశ్‌రావు వెల్లడించారు.

### 48 గంటల్లో 2.6 లక్షల మాస్కులు

**▸▸ ఐసోలేషన్‌లో 1000 పడకలు**

**▸▸ ఆస్పత్రులు, మెడికల్ షాపులకు ఆదేశం**

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా ప్రభావాన్ని తట్టుకునేలా 48 గంటల్లోగా 2.6 లక్షల మాస్కులను, వెయ్యి పడకలతో ఐసోలేషన్ వార్డులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రైవేటు ఆసుపత్రులు, మెడికల్ షాపులను ఆదేశించింది. అదేవిధంగా ప్రజలకు మాస్కులను తక్కువ ధరకే విక్రయించాలని, ధరలు పెంచి అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి రాష్ట్ర కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ల ప్రతినిధులతో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో సోమవారం భేటీ అయ్యారు.

### ఆందోళన వద్దు: మంత్రి ఆళ్ల

కరోనా పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాల్లో రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామని మంత్రి ఆళ్ళ నాని తెలిపారు. సోమవారం విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి కరోనా నోడల్ సెంటర్‌ను ఆయన సందర్శించారు.

## ట్రైనీ ఐఎఫ్ఎస్‌కి కరోనా

**▸▸ ఏపీ అధికారుల్లో కలవరం**

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కరోనా సెగ ఐఎఫ్ఎస్ అధికారులనూ తాకింది. డెహ్రాడూన్‌లోని ఇందిరా గాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 26 ఏళ్ల ట్రైనీ ఐఎఫ్ఎస్‌కు కరోనా వైరస్ పాజిటివ్ అని తేలింది. శిక్షణకు సంబంధించిన అంశాల అధ్యయనం కోసం ఆయన మరో ఐదుగురు అధికారులతో కలిసి ఇటీవల స్పెయిన్, ఫిన్లాండ్‌కు వెళ్లొచ్చారు. అప్పటి నుంచి వారి ఆరోగ్యం క్షీణించడంతో అధికారులు వారిని ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందించారు. వారికి కరోనా పరీక్షలు నిర్వహించగా ఆరుగురిలో ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో ఆలిండియా సర్వీసు అధికారుల్లో కలవరం మొదలైంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏపీ ఐఏఎస్ అధికారులు తరచూ ఢిల్లీ, ఇతర రాష్ట్రాలకు వెళ్లొస్తుంటారు. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులను కలుస్తుంటారు. ఈనేపథ్యంలో సచివాలయంలో ఐఏఎస్ అధికారులు కూడా విదేశీ పర్యటనలకు, విదేశీ ప్రతినిధులతో సమావేశాలకు దూరంగా ఉంటున్నారు.

## పట్టణ ప్రాంతాల్లో కట్టడి: బొత్స

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కరోనా రాష్ట్రంలో విస్తరించకుండా కట్టడి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ మహమ్మారి వ్యాపించకుండా నిరోధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులతో చర్చించారు. విజయవాడలోని ఏపీసీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో పురపాలక శాఖ డైరెక్టర్ విజయకుమార్, సీఆర్డీయే ఇన్‌చార్జి కమిషనర్ వి.రామమనోహరరావు పాల్గొన్నారు.

## 'స్టీల్‌ప్లాంట్' ట్రైనీ పరీక్ష వాయిదా

కరోనా ప్రభావంతో విశాఖలోని స్టీల్‌ప్లాంట్ మేనేజ్‌మెంట్ ట్రైనీ పరీక్షను యాజమాన్యం వాయిదా వేసింది. ఈ నెల 22న ఈ పరీక్షను నిర్వహించాల్సి ఉంది. కరోనా నేపథ్యంలో పరీక్షను వాయిదా వేస్తున్నామని, తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ ప్రకటిస్తామని యాజమాన్యం పేర్కొంది.




# వాయిదా.. వార్



## రమేశ్‌కుమార్.. తమాషా చేస్తున్నారా?

### కరోనా వైరస్సా.. కమ్మ వైరస్సా: స్పీకర్ తమ్మినేని



శ్రీకాకుళం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిర్ణయాలు తీసుకొనిపోతుంటే ఇక ప్రభుత్వం ఎందుకని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ వ్యాఖ్యానించారు. ఎస్ఈసీ రమేశ్‌కుమార్ వచ్చి సీఎం సీటులో కూర్చోవాలన్నారు. సోమవారం శ్రీకాకుళంలో మాట్లాడుతూ.. 'ఎస్ఈసీ రమేశ్ కుమార్ సొంత నిర్ణయాలు తీసుకోవడమేంటి? తమాషాలు చేస్తున్నారా? ఈ రాష్ట్రాన్ని వాళ్ల అబ్బ జాగీరు అనుకుంటున్నారా? రాష్ట్రానికి కరోనా వైరస్ వచ్చిందా? లేక కమ్మ వైరస్ వచ్చిందా?' అని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారు కులమతాలకు అతీతంగా ఉండాలన్నారు.

### కుల గజ్జి వెధవ: కాపు ధ్వజం

అనంతపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 'కులగజ్జి వెధవ' అంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ) రమేశ్‌కుమార్‌పై ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం రాయదుర్గంలో మాట్లాడుతూ 'ప్రస్తుత ఎన్నికల కమిషనరున్నాడే కులగజ్జి వెధవ. ఇట్లే మాట్లాడుతున్నా నేను. నేను జైలుకు పోదునుగాక. ఐయామ్ ప్రిపేర్డ్ ఫర్ ఎవ్రీ థింగ్. రాజ్యాంగ పదవిలో ఉండి, కులాన్ని అడ్డంగా వాడుకుని, తన సామాజిక వర్గాన్ని వాడుకుని ఈ రోజు రూ.5,800 కోట్లు రాష్ట్రానికి పోతున్నాయంటే మీరు జగన్ మీద కక్ష తీర్చుకుంటున్నారా? ప్రజలపై కక్ష తీర్చుకుంటున్నారా? కుట్రపన్ని రాష్ట్రానికి డబ్బులు రాకుండా చేస్తారా? సిగ్గులేదా మీకు? మనుషులు కారా మీరు?' అన్నారు. టీడీపీ కన్నా నీచమైన వైరస్ లేదన్నారు.

### టీడీపీతో ఎస్ఈసీ కుమ్మక్కు: వనిత

కొవ్వూరు, మార్చి 16: ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ స్థానిక సంస్థల ఎన్నికలను ఆరు వారాలు వాయిదా వేయడాన్ని మంత్రి తానేటి వనిత తప్పుబట్టారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ ఎస్ఈసీ టీడీపీతో కుమ్మక్కై ఎన్నికలను వాయిదా వేశారని అన్నారు.

### ఈసీపై ఏదో శక్తి పనిచేసింది: సజ్జల

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్‌పై ఏదో శక్తి పనిచేసిందని, అందుకే కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తన పరిధిని మించి నిర్ణయం తీసుకున్నారని సీఎం సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. 'ఎన్నికలు వాయిదా వేయాలంటే ఒక పద్ధతి ఉంటుంది. ఎన్నికల సంఘం అంటే ఒక వ్యక్తి వ్యవస్థ కాదు' అన్నారు.

### టెర్రర్ గ్రూపుల కంటే ఘోరం: విజయసాయిరెడ్డి

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల వాయిదా నిర్ణయం టెర్రర్ గ్రూపుల కంటే ఘోరంగా ఉందని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. దీనికి ప్రతిపక్షనేత చంద్రబాబు, రమేశ్‌కుమార్ కారణమంటూ ట్విటర్‌లో విమర్శలు గుప్పించారు. చంద్రబాబు సీఎంగా లేని రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా ఉండటానికి వీల్లేదని వ్యవస్థల్లోకి ఆయన చొప్పించిన స్లీపర్ సెల్స్ కరాఖండిగా చెబుతున్నాయన్నారు. ఒక వ్యక్తి కోసం ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ న్యాయాన్ని తుంగలో తొక్కుతున్నారని ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రలోభాలకు ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ లొంగినట్లుగా ఉందని మంత్రి పేర్ని నాని ఆరోపించారు. విచక్షణాధికారాన్ని ధర్మబద్ధంగా వాడనప్పుడు విలువ ఇవ్వరన్నారు. కేంద్ర నిధులను అడ్డుకునేందుకు తన సామాజికవర్గానికి చెందిన వ్యక్తితో ఎన్నికలు వాయిదా వేయించి చంద్రబాబు పైశాచిక ఆనందం పొందుతున్నారని వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేశ్ అన్నారు.

## వాయిదా ఎందుకంటే..!

- గవర్నర్‌కు రమేశ్‌కుమార్ వివరణ
- కరోనా వైరస్ విజృంభణ, పార్టీల ఆందోళనపై సమాచారం
- కేంద్రానికి బీజేపీ ఫిర్యాదులు, హైకోర్టులో పిటిషన్లపైనా..!

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌తో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ సోమవారం భేటీ అయ్యారు. విజయవాడ రాజ్‌భవన్‌లో దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన చర్చల్లో.. కరోనా వైరస్ వ్యాప్తి, జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించిన క్రమంలోనే ఎన్నికలను వాయిదా వేసినట్లు గవర్నర్‌కు ఆయన వివరణ ఇచ్చినట్లు సమాచారం. వివిధ రాజకీయ పార్టీలతో సమావేశమైనప్పుడు ప్రపంచవ్యాప్తంగా కరోనా విజృంభణపై వెలిబుచ్చిన ఆందోళనలు, ఎన్నికలు నిర్వహించవద్దని వ్యక్తం చేసిన అభిప్రాయాలతో పాటు హైకోర్టులో ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లు, ఢిల్లీలో కేంద్ర హోం మంత్రికి బీజేపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదులు తదితర అంశాలన్నీ వివరించినట్లు తెలిసింది. ఎన్నికలు ప్రారంభించినప్పుడు కరోనా వైరస్ పరిస్థితి.. రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా ఇప్పుడున్న ఉధృతి, పర్యావసానాలు ఎలా ఉంటాయన్న దానిపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. కాగా.. స్థానిక ఎన్నికల వాయిదాపై సీఎం జగన్ ఆదివారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి.. ఎస్ఈసీ తీరుపై గవర్నర్‌ను సైతం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే కమిషనర్ గవర్నర్‌ను కలిశారు. ఆయన వివరణపై గవర్నర్ ఏ విధంగా స్పందించారనే విషయం తెలియరాలేదు.



## 'బయో'పడాలా... వద్దా!

- ఆఫీసుల్లో బయోమెట్రిక్ రద్దు
- మరి... ఓటు ముద్ర మాటేమిటి?

"రాష్ట్రంలో కరోనా అంత తీవ్రంగా ఏమీ లేదు. పారాసెటిమాల్ వేసుకుంటే పోతుంది. బ్లీచింగ్ పౌడర్ చల్లితే ఆరుగంటల్లో వైరస్ చచ్చిపోతుంది. ఈ మాత్రానికి... స్థానిక ఎన్నికలు వాయిదా వేస్తారా!?" ఇదీ ప్రభుత్వ పెద్దల ప్రశ్న! అయితే... స్వయంగా సీఎంవో పది రోజుల కిందట ఒక సర్క్యులర్ జారీ చేసింది. "నేరుగా తాకడంవల్లే కరోనా వైరస్ సోకుతుంది. అందువల్ల.. అన్ని కార్యాలయాల్లో బయోమెట్రిక్ ఆపివేసి, గతంలోలాగా హాజరు పట్టికలో సంతకాలు చేసే పద్ధతి పాటించండి"... అనేదే ఈ నోట్ సారాంశం! మరి... స్థానిక ఎన్నికల్లో పోలింగ్ మాటేమిటి? ప్రతి బూత్‌లో వందలమంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. బ్యాలెట్ పేపర్‌పై స్వస్తిక్ ముద్రను తమ ఓటు వేస్తారు. అదే స్వస్తిక్‌ను ఓటర్లంతా 'టచ్' చేస్తారు. ఇది... వైరస్ వ్యాప్తికి అవకాశం కల్పించడం కాదా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

# ఎన్నికలు ఆపొద్దు

## నిర్వహణపై ఎస్ఈసీని ఆదేశించండి.. సుప్రీంలో రాష్ట్ర సర్కారు పిటిషన్



న్యూఢిల్లీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదావేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం యథాతథంగా జరిగేలా ఆదేశించాలంటూ సోమవారం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలంటూ న్యాయమూర్తులు జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎంఆర్ షాతో కూడిన ద్విసభ్య ధర్మాసనాన్ని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది జీఎన్ రెడ్డి కోరారు. అయితే, మరుసటి రోజు కేసుల జాబితాలో చేర్చాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి ధర్మాసనం సూచించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తాజాగా జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని తన పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కోరింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే ఎన్నికలను ఎస్ఈసీ వాయిదా వేయాలని నిర్ణయించారని, రాజ్యాంగ విరుద్ధంగా, ఏకపక్షంగా ఆయన ఈ నిర్ణయం తీసుకొన్నారని ఆ పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేసిన తరవాతే ఎన్నికల వాయిదాపై నిర్ణయం తీసుకోవాలని కిషన్‌సింగ్ తోమర్ వర్సెస్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ద సిటీ ఆఫ్ అహ్మదాబాద్(2005) కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ప్రస్తావించింది. ఈ నెల 31వ తేదీలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తికాకపోతే స్థానిక సంస్థలకు 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫారసుల మేరకు నిధులు రావని వివరించింది. కరోనా వైరస్ వల్ల ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపిందని, కానీ ఈ సమస్యపై ప్రభుత్వ యంత్రాంగంతో సమీక్షించలేదని సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చింది. వైద్యాధికారులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని ఎస్ఈసీ చెబుతున్నప్పటికీ అలాంటి ప్రక్రియ ఏమీ జరగలేదని పేర్కొంది. రాష్ట్రంలో ఒకే ఒక్క కరోనా కేసు నమోదయిందని, అది కూడా ఇటలీ నుంచి వచ్చిన వ్యక్తికి పాజిటివ్ అని తేలిందని వివరించింది. కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడానికి ప్రజాప్రతినిధులు అవసరమని, ఈ నేపథ్యంలో ఎన్నికలు జరిగితే కరోనా వ్యాప్తి నివారణ చర్యలకు మరింత ఊతం లభిస్తుందని స్పష్టం చేసింది. కరోనా మరింత వ్యాప్తి చెందితే క్షేత్రస్థాయిలో పాలనాపరంగా నియంత్రించేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ముఖ్యమనేది రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రహించలేదని పేర్కొంది. ఎన్నికలు వాయిదా వేసినప్పటికీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కరోనా నియంత్రణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వానికి ఆటంకాలు ఎదురవుతాయని తెలిపింది.

### నేడు వైసీపీ 'వాయిదా'.. తీర్మానం!

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాపై లోక్‌సభలో చర్చించాలంటూ వైసీపీ వాయిదా తీర్మానం ఇవ్వనుంది. మంగళవారం దీనిపై సభలో చర్చించాలని ఇప్పటికే స్పీకర్ ఓం బిర్లాకు వైసీపీ ఎంపీ బాలశౌరితో పాటు మరికొందరు ఎంపీలు వాయిదా తీర్మానాన్ని సమర్పించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేయాలన్న అంశంపై కూడా చర్చించాలని వైసీపీ పేర్కొంది. నిమ్మగడ్డ రమేశ్‌తో కుమ్మక్కయ్యి టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికలను వాయిదా వేయించారని ఈ సందర్భంగా వైసీపీ ఎంపీ బాలశౌరి ఆరోపించారు.

## హైకోర్టులో అత్యవసర పిటిషన్

### సుప్రీంలో ఉండటంతో 19కి వాయిదా

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆరు వారాల పాటు వా యిదా వేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో సోమవారం అత్యవసర పిటిషన్(లంచ్ మోషన్) దాఖలైంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ముందు ఈ పిటిషన్‌పై విచార ణ జరిగింది. ఎస్ఈసీ నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని ప్రభుత్వ న్యాయవాది సుమన్ వివరించారు. ఆ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు. కృష్ణాజిల్లా ఏసీ పేటకు చెందిన కంచర్ల నిర్మలకుమారి ఈ పిటిషన్ దాఖలు చేశారు.

### ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నాం: ఎస్ఈసీ

తాడిపత్రి వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి చీరల పంపిణీ చేశారంటూ అందిన ఫిర్యాదుతో పాటు మిగిలిన ఫిర్యాదులపైనా తగిన చర్యలు తీసుకున్నామని హైకోర్టుకు ఎస్ఈసీ తెలిపింది. అధికార పార్టీ నేత లు కోడ్ ఉల్లంఘిస్తున్నా ఎస్ఈసీ చర్యలు తీసుకోవడం లేదంటూ టీడీపీ నేత కోవెలమూడి రవీంద్ర దాఖలు చేసిన పిల్‌పై సోమవా రం మరోమారు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం ముందు విచారణ జరిగింది. ఎస్ఈసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# ఎన్నికలు జరిపించండి

## వాయిదా నిర్ణయం వెనక్కి తీసుకోండి

- ప్రచారం కుదింపు, క్యూలు లేకుండా జాగ్రత్తలు తీసుకొంటే సరిపోతుంది
- ఎస్ఈసీకి సీఎస్ నీలం సాహ్నీ లేఖ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తూ తీసుకున్న నిర్ణయం వెనక్కితీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ లేఖ రాశారు.

### సీఎస్ లేఖలోని ముఖ్యాంశాలు..

"రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది శిక్షణ, బ్యాలెట్ బాక్సుల సేకరణ, ఓటర్ల జాబితా ముద్రణతోపాటు మిగతా కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ప్రజారోగ్యం బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించింది. కాబట్టి కరోనా వ్యాప్తి కారణంగా ఎన్నికలు వాయిదా వేయాలని నిర్ణయం తీసుకునే ముందు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలను సంప్రదించి ఉండాల్సింది. అలాచేసి ఉంటే రాష్ట్రంలో కరోనా వ్యాప్తిపై వాస్తవ నివేదికను అందించేవాళ్లం. కరోనాను విపత్తుగా ప్రకటించడానికి ప్రాధాన్యం ఇవ్వడం కంటే, రాష్ట్ర విపత్తుల నియంత్రణ నిధిని (ఎస్‌డీఆర్ఎఫ్) నేరుగా డ్రా చేసుకుని వాటిని కరోనా వ్యాప్తి నియంత్రణ చర్యలకు ఉపయోగించేందుకు ప్రాధాన్యత కంటే ముందుగానే ఈనెల 14 తేదీన కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ప్రకారం రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. దీనికి సంబంధించి వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇచ్చిన వివరణాత్మక నోట్‌ను ఈ లేఖకు జతచేస్తున్నాను. ఆదివారం నాటికి రాష్ట్రంలో కేవలం ఒకే ఒక్క కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. ఆ వ్యక్తి కూడా ఇటలీ నుంచి వచ్చారు. రాష్ట్రంలో ఇంకా ఈ వైరస్ వ్యాప్తి ప్రారంభం కాలేదనడానికి ఇది సూచిక. మరో 3 నుంచి 4 వారాల వరకూ రాష్ట్రంలో కరోనా వ్యాప్తి జరిగే అవకాశాలు లేవు. విదేశాల నుంచి వచ్చిన వారిపై ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో స్థానికంగా స్థానిక ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తారు. కరోనా అనుమానితులను ఇంట్లో ఐసోలేషన్‌లో ఉంచడంలోనూ, వారిపై నిఘా పెట్టడంలోనూ స్థానిక ప్రతినిధులు ఉపయోగపడతారు. దీని ద్వారా కరోనా వ్యాప్తిని అరికట్టవచ్చు. అలాగే, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కొన్ని సూచనలు జారీ చేయడం ద్వారా కూడా ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చు. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించుకోవడం ద్వారా, ప్రచార సమయాన్ని కుదించడం ద్వారా, ఎన్నికల రోజు క్యూలు లేకుండా చూడడం వంటి జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా ఫలితం సాధించవచ్చు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే రాష్ట్రంలో మరో 4 వారాల వరకు కరోనా వ్యాప్తి నియంత్రణలో ఉంటుంది. ఆ తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయలేం. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కరోనా వ్యాప్తిని నియంత్రించేందుకు స్థానిక ప్రజాప్రతినిధుల అవసరం ఉంది. కాబట్టి, స్థానిక ఎన్నికలను ఆరువారాలపాటు వాయిదా వేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి"



## సీఎం ఒకలా.. సీఎస్ ఒకలా..

- స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాతో రూ.5,000 కోట్లు నష్టమన్న సీఎం
- కరోనాకే పరిమితమైన సీఎస్ లేఖ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాకు సంబంధించి సీఎం ఒకలా, సీఎస్ ఇంకోలా స్పందించారు. ఎన్నికలు జరపాలన్నదే ఇద్దరి ఉద్దేశం అయినప్పటికీ వారు చెబుతున్న కారణాల్లో మాత్రం పొంతన లేదు. మార్చి 31వ తేదీలోపు ఎన్నికలు జరగకపోతే కేంద్రం నుంచి రావాల్సిన రూ. 5,000 కోట్లు ఆగుతాయని సీఎం చెబితే, కరోనా వ్యాప్తిని కట్టడి చేయగలం.. ఎన్నికలు నిర్వహించండంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సీఎస్ లేఖ రాశారు. సీఎస్ రాసిన మూడు పేజీల లేఖలో ఎక్కడా రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం. కరోనా వైరస్‌ను కట్టడి చేయగలం, కాబట్టి ఎన్నికల వాయిదా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని చెప్పడానికి మాత్రమే సీఎస్ లేఖ పరిమితమైంది. తక్షణమే ఎన్నికలు జరగడం వల్ల రాష్ట్రానికి గల ప్రయోజనాల గురించి ఆ లేఖలో వివరించడంలో సీఎస్ విఫలమయ్యారు. ఆ లేఖలోనూ కరోనా సమస్యపై కప్పదాట్లు కనిపిస్తున్నాయి. కరోనా సమస్య తీవ్రంగానే ఉన్నప్పటికీ రాష్ట్రంలో అంత ప్రభావవంతంగా లేదని, దానికి తగ్గ జాగ్రత్తలు వైద్యఆరోగ్యశాఖ తీసుకుంటోందని చెప్పారు. అదే సమయంలో ఎన్నికల ప్రచారం కుదించడం, పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు లేకుండా చేయడం, ఎన్నికల ప్రచారం ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా చేసుకోవడం లాంటి చర్యలను ఆ లేఖలో సీఎస్ సూచించారు. రాష్ట్రంలో కరోనా వ్యాప్తి అంత ప్రభావవంతంగా లేదంటూనే ఈ సూచనలు చేయడంలో అర్థం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అలాగే, మరో నాలుగు వారాల పాటు రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నియంత్రణలో ఉంటుందని చెప్పి, ఆ తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయలేమని ఆ లేఖలోనే సీఎస్ పేర్కొనడం అర్థరహితమంటున్నారు.

### 4వారాల వరకే.. ఆ తర్వాత చెప్పలేం..

"ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నియంత్రణలో ఉంది. మరో 3 నుంచి 4 వారాలు పాటు పరిస్థితులు ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. ఇతర దేశాల్లో కరోనా వ్యాప్తి ధోరణిని పరిశీలిస్తే ఎన్ని చర్యలు చేపట్టినా4వారాల తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందో ముం దుగా అంచనా వేయలేం. ఈ నేపథ్యంలో ఎన్నికలు వాయిదా వేయ డం వల్ల రాష్ట్రం నష్టపోతుంది" అని ఆ లేఖలో సీఎస్ పేర్కొన్నారు. విదేశాల నుంచి వచ్చిన ప్రతి ప్రయాణికుడికి స్ర్కీనింగ్ చేసి, ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించే ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని, ఇలాంటి తరుణంలో స్థానిక సంస్థల పాలకవర్గాలు కీలకపాత్ర పోషిస్తాయని ఆ లేఖలో తెలిపారు. కరోనా నియంత్రణ చర్యలకు స్థానిక సంస్థలు ఉపయోగ పడతాయని చెప్పారు.

## చిక్కుల్లో సీఎస్!

### సీఎం ఆదేశాలకనుగుణంగా ఎస్ఈసీకి లేఖ రాసిన సాహ్నీ

### సొంతంగా రాసినా కూడా తప్పే.. ఏఐఎస్ రూల్స్‌కు విరుద్ధం

### డీవోపీటీకి ఫిర్యాదులందితే.. తీవ్రచర్యలే..ఐఏఎస్ వర్గాలు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల వాయిదాపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ స్పందించిన తీరు తప్పన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఎన్నికలు కేవలం వాయిదా పడ్డాయి. రద్దు కాలేదు. కాబట్టి అవి పూర్తయ్యేవరకు కోడ్ అమల్లోనే ఉంటుంది. ఒక్కసారి రాష్ట్రంలో కోడ్ అమల్లోకి వస్తే సీఎస్ సహా ప్రభుత్వ యంత్రాంగం మొత్తం రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిధిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో ఎస్ఈసీ పరిధిలో పనిచేస్తున్న సీఎస్... ఎన్నికల వాయిదా నిర్ణయాన్ని శిరసావహించకుండా, సూచనలు, సలహాలు, విజ్ఞప్తులు చేయడం ఎన్నికల కమిషన్ ఆదేశాల ధిక్కరణ కిందకే వస్తుందని అంటున్నారు. వాయిదా నిర్ణయంపై సీఎం జగన్ ఆదివారం ప్రెస్‌మీట్ పెట్టి ఎన్నికల కమిషన్ ఆదేశాలను తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. ప్రెస్‌మీట్‌లో సీఎం వ్యక్తం చేసిన అభిప్రాయాలకు అనుగుణంగా సీఎస్ లేఖ రాయడం చూస్తుంటే రాష్ట్రంలో కోడ్ అమల్లో ఉన్నప్పటికీ సీఎస్ ఇంకా సీఎం ఆదేశాలే పాటిస్తున్నట్టు అర్థమవుతోంది. దీనిపై ఎవరైనా కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ విభాగానికి (డీవోపీటీ) ఫిర్యాదుచేస్తే తీవ్రంగా పరిగణించే అవకాశాలున్నాయని అంటున్నారు. కోడ్ అమల్లో ఉన్న సమయంలో రాజకీయనేతల ఆదేశాలు అధికారులు శిరసావహించకూడదు. 2019 సాధారణ ఎన్నికల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కరువుపై సమీక్షా సమావేశం పెట్టగా, సీఎస్ సహా అధికారులెవరూ హాజరుకాకూడదని అప్పటి ఎన్నికల ప్రధానాధికారి ద్వివేది ఆదేశాలు జారీచేశారు. అవసరమైతే అప్పటి సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యమే కరువుపై అధికారులతో సమీక్ష నిర్వహించుకోవచ్చని సూచించారు. అలాగే, అప్పటి సీఎం చంద్రబాబుతో సంబంధం లేకుండానే ఎన్నికల సంఘం.. సీఎస్ పునేఠాను బదిలీ చేసి ఎల్వీ సుబ్రహ్మణ్యాన్ని ఆ పోస్టులో నియమించింది. అవే నియమనిబంధనలు ఇప్పుడూ వర్తిస్తాయని పలువురు చెబుతున్నారు. ఎందుకంటే కేంద్ర ఎన్నికల సంఘానికి దేశవ్యాప్తంగా ఎలాంటి అధికారాలైతే ఉన్నాయో, రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాష్ట్రంలో అలాంటి అధికారాలే ఉంటాయి. పార్టీలు, ప్రభుత్వాలు పక్కనపెడితే ఒక రాష్ట్ర సీఎస్ ఆ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు ధిక్కరించడాన్ని డీవోపీటీ సీరియస్‌గా తీసుకునే అవకాశాలున్నాయని అంటున్నారు. ఎందుకంటే అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్నికల సంఘాలున్నాయి. ప్రభుత్వాలు, అందుకనుగుణంగా పనిచేసే సీఎస్‌లు ఉంటారు. కాబట్టి, ఇప్పుడు మన రాష్ట్రంలో జరిగిన విషయాన్ని తేలిగ్గా వదిలేస్తే అన్ని రాష్ట్రాల్లోనూ అధికార పార్టీలు సీఎస్‌ను అడ్డం పెట్టుకుని ఎన్నికల సంఘం హక్కులను కాలరాసే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కి సీఎస్ రాసిన లేఖను చూస్తే సీఎం ఒత్తిడిమేరకు ఆయన అభిప్రాయాలను రాసినట్టు అర్థమవుతోంది. ఒకవేళ సీఎం నుంచి ఎలాంటి ఒత్తిడి లేకుండా సొంతంగా సీఎస్ ఆ లేఖ రాసినా అది కూడా తప్పేనని అంటున్నారు. ఒక రాజ్యాంగబద్ధ సంస్థ ఇచ్చిన ఆదేశాలను అమలుచేయక పోగా ఆ నిర్ణయం మార్చుకోవాలంటూ తిరిగి సూచనలు, సలహాలు, విజ్ఞప్తులు చేయడం అసాధారణమేనని రాష్ట్రంలో ఐఏఎస్ వర్గాలు చెబుతున్నాయి.



## ప్రజారోగ్యం కోసమే... టూచ్

### మాట మడతేసిన ఎమ్మెల్యే రోజా

## వాయిదా వెనుక బాబు కుట్ర

పుత్తూరు, మార్చి 16: స్థానిక ఎన్నికల ప్రక్రియను ఆరు వారాలపాటు వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయంపై వైసీపీ ఎమ్మెల్యే రోజా రెండు నాల్కల ధోరణిని ప్రదర్శించారు. మూడు గంటల వ్యవధిలో పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు చేశారు. అయితే ఆ రెండు ప్రకటనల్లోనూ కామన్ పాయింట్ టీడీపీపై విమర్శ. ఉదయం 11 గంటలకు మీడియాతో నేరుగా మాట్లాడిన రోజా మధ్యాహ్నం మూడు గంటలకు మాత్రం వీడియో ప్రకటనను విడుదల చేశారు. ఆ రెండు ప్రకటనల సారాంశం ఇది..

### 11 గంటలకు మునిసిపల్ కార్యాలయంలో

"ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎన్నికలను ఎస్ఈసీ వాయిదా వేసింది. దీన్ని కూడా టీడీపీ రాజకీయం చేస్తోంది. వైసీపీ ఎన్నికలకు భయపడి వాయిదా వేసిందని మాట్లాడటం సిగ్గుచేటు. 'అచ్చెన్నాయుడుకు ఒళ్లు పెరిగింది కానీ బుద్ధి పెరగలేదు' అని అనేకసార్లు చెప్పింది నిజమే. కరోనా వ్యాప్తితో ఓవైపు పెళ్లిళ్లు రద్దు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలక్షన్‌లో ప్రజలు ఒక చోట చేరితే వ్యాధి ప్రబలే ప్రమాదముందని ఎన్నికలను పోస్ట్‌పోన్ చెసిందని టీడీపీ తెలుసుకోవాలి"

### 3 గంటలకు స్వగృహంలో..

"టీడీపీ అధినేత చంద్రబాబు ఓటమి భయంతో తన మనిషైన నిమ్మగడ్డ రమేశ్‌తో ఏ విధంగా నాటకం ఆడించారో చూశాం. ఎన్నికలు వాయిదా వేయడానికి చంద్రబాబు భయమే కారణం. పదవీ విరమణ చేసిన వ్యక్తిని ఎన్నికల కమిషనర్‌గా నియమించుకున్నారు. ఇటు సీఎంతో కాని, అటు ఆరోగ్య మంత్రి, సీఎస్‌తో గానీ చర్చించలేదు. ఇలా నిర్ణయం తీసుకోవడం ప్రజల కోసం కాదనీ, బాబు కోసమే వాయిదా వేసిందనీ అర్థమవుతోంది."

## ఎన్నికల కమిషనర్‌ను తీసేయడమెలా?

### ఎలా అభిశంసించవచ్చు?.. ఆయన విచక్షణాధికారాలేమిటి?

### మాజీ ఎస్ఈసీ రమాకాంత్‌రెడ్డి వద్ద జగన్ ఆరా.. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో భేటీ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను ఎలా తీసేయాలని మాజీ కమిషనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమాకాంతరెడ్డి వద్ద సీఎం జగన్ ఆరా తీసినట్లు తెలిసింది. కమిషనర్‌కు ఉన్న విచక్షణాధికారాలేమిటని అడిగినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం రమాకాంతరెడ్డిని పిలిపించుకుని క్యాంపు కార్యాలయంలో చర్చించారు. స్థానిక ఎన్నికలను యథాతథంగా జరిపేలా ఎస్ఈసీని ఆదేశించాలని కోరుతూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సోమవారమే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ సమయంలో రమాకాంతరెడ్డిని పిలిపించుకుని జగన్ మాట్లాడడం రాజకీయంగా ఆసక్తి రేపింది. రమేశ్‌కుమార్ నిర్ణయంపై విరుచుకుపడిన జగన్.. ఆయన్ను ఎలా అభిశంసించాలన్న అంశాలపై రమాకాంతరెడ్డితో చర్చించినట్లు తెలిసింది.

## జర్మనీలో చిక్కుకున్న ఆనంద్



**చెన్నై:** కరోనా ప్రభావం చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌పై పడింది. బుండెస్‌లిగా చెస్ టోర్నీలో పాల్గొనేందుకు జర్మనీ వెళ్లిన ఆనంద్.. టోర్నీ అనంతరం సోమవారం చెన్నై రావాల్సి ఉంది. అయితే 'కొవిడ్-19' విజృంభణతో ప్రయాణాలపై జర్మనీలో ఆంక్షలు విధించడంతో ఫ్రాంక్‌ఫర్ట్ సమీపంలో అతడు చిక్కుకుపోయాడని ఆనంద్ భార్య అరుణ తెలిపింది. అక్కడ ఉండే సమయాన్ని చెస్ వ్యాఖ్యానం చేయడం ద్వారా అతడు సద్వినియోగం చేసుకోనున్నాడు. రష్యాలోని ఎకటెరిన్‌బర్గ్‌లో మంగళవారం నుంచి వచ్చేనెల 4 వరకు జరిగే ఫిడే క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌కు ఫ్రాంక్‌ఫర్ట్‌నుంచి ఆనంద్ వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నాడు. కరోనా వైరస్ కారణంగా తన భర్త ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాడని కూడా అరుణ చెప్పింది. ఫ్రాంక్‌ఫర్ట్‌లో అతడు ఐసోలేషన్‌లో ఉన్నాడని వెల్లడించింది.



## 'సేఫ్' సిటీలో సఫారీలు

### నేడు స్వదేశానికి తిరుగు ప్రయాణం

**కోల్‌కతా:** కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో భారత పర్యటనలో ఉన్న దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు.. తిరుగు ప్రయాణంలో సేఫ్ సిటీ కోల్‌కతాలో ఆగింది. ఇక్కడ ఒక్క కరోనా కేసుకూడా నమోదు కాకపోవడంతో సఫారీలు ఈ సిటీని సురక్షితంగా భావించారు. సోమవారం ఇక్కడకు వచ్చిన సఫారీ ఆటగాళ్లకు బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) సాదర



స్వాగతం పలికింది. హోటల్‌లో బస చేసిన సఫారీలు.. మంగళవారం స్వదేశానికి పయనమవుతారు. క్రికెటర్ల ఆరోగ్య పర్యవేక్షణకు ముగ్గురు సభ్యుల మెడికల్ టీమ్‌ను సిద్ధంగా ఉంచినట్టు క్యాబ్ చీఫ్ అవిషేక్ దాల్మియా చెప్పాడు. ప్రభుత్వ రెడ్ అలర్ట్‌తో భారత్-సౌతాఫ్రికాల మధ్య జరగాల్సిన మూడు వన్డేల సిరీస్ రద్దయిన సంగతి తెలిసిందే. ధర్మశాలలో 12న జరగాల్సిన తొలి వన్డే వర్షంతో రద్దవగా.. రెండో మ్యాచ్ కోసం లఖ్‌నవ్ వెళ్లారు. కానీ, సిరీస్ రద్దవడంతో ఇన్ని రోజులూ వారిని అక్కడే ఉంచారు. ఇప్పుడు స్వదేశానికి తిరుగు ప్రయాణమవ్వాల్సిన సమయంలో తొలుత ఢిల్లీ వెళ్లాలనుకున్నా.. అక్కడ వైరస్ ప్రభావం ఉండడంతో కోల్‌కతా వైపు మొగ్గు చూపారు.

# మా ప్రాణాలు పణంగా పెట్టాలా?



ఒలింపిక్స్ నిర్ణీత షెడ్యూల్ మేరకు జరుగుతాయని జపాన్ ప్రధాని షింజో అబె, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఓఐసీ) చీఫ్ థామస్ పదేపదే నొక్కిచెబుతున్నా.. జపాన్‌లో పరిస్థితి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. కరోనా వైరస్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న నేపథ్యంలో ఒలింపిక్స్ నిర్వహణపై జపాన్‌లో వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతోంది. ఆ క్రీడల కోసం తమ ప్రాణాలు పణంగా పెట్టబోమని దేశ ప్రజలు అంటున్నారు.

### ఒలింపిక్స్ వద్దే..వద్దు

### జపాన్‌లో పెరుగుతున్న వ్యతిరేకత

**టోక్యో:** ప్రస్తుతం కరోనా వైరస్ గురించి ప్రపంచమంతా ఎంత చర్చ జరుగుతోందో అంతకుమించి ఒలింపిక్స్‌పై వాదోపవాదాలు జరుగుతున్నాయి. కరోనా దెబ్బకు ప్రఖ్యాత ఫుట్‌బాల్ లీగ్‌లు, ఎన్‌బీఏ చాంపియన్‌షిప్ రద్దయ్యాయి. జపాన్‌లోనూ పలు క్రీడా పోటీలది అదే దుస్థితి. ఈ నేపథ్యంలో ఒలింపిక్స్‌ను కనీసం ఏడాది వాయిదా వేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే సూచించారు. ఇక.. జపాన్‌లో కరోనా ప్రభావం తక్కువగానే ఉంది. 814 పాజిటివ్ కేసులే నమోదు కాగా, 24 మంది మరణించారు. కానీ ఆ దేశ ప్రజలు ఒలింపిక్స్ నిర్వహించవద్దని ఖరాఖండిగా చెబుతున్నారు.

### టూరిస్టులు వచ్చిపడరూ..

ఒలింపిక్స్ నిర్వహిస్తే జపాన్‌కు పర్యాటకులు వెల్లువెత్తుతారని టోక్యోలోని ఓ ఇంటర్నెట్ సంస్థ ఉద్యోగి, 27 ఏళ్ల కోకి మ్యూరా అన్నాడు. 'నిజాయతీగా చెప్పాలంటే.. కరోనా బారి నుంచి జపాన్ బయటపడినా విశ్వవ్యాప్తంగా పర్యాటకులు రావడం మాకు ఇష్టంలేదు. ఒలింపిక్స్‌ను ఏకపక్షంగా రద్దు చేయలేకపోతే కనీసం వాయిదా వేయడం ఉత్తమం' అని అభిప్రాయపడ్డాడు. 'ఒలింపిక్స్‌కోసం మా జీవితాలను పణంగా పెట్టలేం' అని మ్యూరా స్పష్టంజేశాడు.

### వణికిపోతున్నారు

కరోనా మహమ్మారితో ప్రజలంతా వణికిపోతున్నారని 90 ఏళ్ల పెన్షనర్ మసావో సుగవార అన్నాడు. 'ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. ట్రంప్ కూడా అదే చెప్పారు' అని గుర్తు చేశాడు. జూన్-జూలై నాటికి కరోనాను కట్టడి చేయలేకపోతే క్రీడలను వాయిదా వేయడం సబబే అని జపాన్, జర్మనీ సంతతికి చెందిన 47 ఏళ్ల లాయర్ మాన్‌ఫ్రెడ్ ఒటో అన్నాడు. ఒలింపిక్స్ జరిగే అవకాశాలు లేవనే పందెంరాయుళ్లు కూడా ధీమాగా ఉన్నారు. జూలై 24న ప్రారంభోత్సవం జరగదని పాడీ పవర్ అనే బుక్‌మేకర్ 4-1తో పందెం కాశాడు.

### మాకొద్దు ఈ ఆటలు!

మెజార్టీ జపాన్ ప్రజలంతా ఒలింపిక్స్ అతిథ్యంపై వ్యతిరేకత కనబరుస్తున్నారు. జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు జరిగే ఒలింపిక్స్ నిర్వహణపై జపాన్‌కు చెందిన మీడియా సంస్థ ఎన్‌హెచ్‌కే ప్రజాభిప్రాయం సేకరించింది. అందులో 45 శాతం మంది నిర్ణీత సమయానికి ఒలింపిక్స్ నిర్వహించడాన్ని వ్యతిరేకించారు. 40 శాతంమంది సుముఖత ప్రకటించారు. ఇక.. క్యోడో అనే సంస్థ వేయిమందితో చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో 69.9 శాతం మంది ఒలింపిక్స్ నిర్వహించవద్దని సూచించారు. 'ఒలింపిక్స్‌ను రద్దు చేయడాన్ని ఊహించలేం' అని టోక్యో గవర్నర్ యురికొ కోయ్‌కె వ్యాఖ్యానించారు. అయితే తుది నిర్ణయం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)దేనని ఆయన అన్నారు.

## ఐఓసీ కీలక భేటీ నేడు




ఒలింపిక్స్‌పై అంతర్జాతీయ క్రీడా సమాఖ్యలతో ఐఓసీ మంగళవారం నాడు అత్యవసరంగా సమావేశమవుతోంది. ఒలింపిక్స్‌ను వాయిదా వేసే విషయంలో అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సిఫారసులను పరిగణనలోకి తీసుకుంటామని ఐఓసీ అధ్యక్షుడు బాచ్ చెప్పారు. అయితే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలు వాయిదా పడడం తీవ్ర సమస్యలను సృష్టిస్తున్నదని అన్నారు. క్వాలిఫయింగ్ పోటీలకు సంబంధించి పట్టువిడుపులు ప్రదర్శిస్తామని ఈనెలారంభంలో బాచ్ ప్రకటించడం అథ్లెట్లకు ఉత్సాహాన్నిచ్చింది. దాంతో ఆ టోర్నీలకోసం వారు మరింత ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యారు. జపాన్‌లో బేస్‌బాల్‌కు ఉన్న ఆదరణ అంతా ఇంతాకాదు. ఒలింపిక్స్‌లో ఆ మ్యాచ్ టిక్కెట్లను తాను ఎప్పుడో కొనుగోలు చేశానని 47 ఏళ్ల హిసాయ సుజుకి చెప్పాడు. 'ఒలింపిక్స్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడడం జీవితంలో ఒకేసారి వచ్చే విశేషం. దాంతో ఆ మ్యాచ్‌కు నా కుమారుడిని తప్పకుండా తీసుకుపోవాలని అనుకుంటున్నా' అని అతడు తెలిపాడు. 'కరోనా వల్ల పరిస్థితులు దారుణంగా మారితే క్రీడలను వాయిదా వేయడమే తెలివైన నిర్ణయం' అని సుగవార అన్నాడు. 'నాకు 90 ఏళ్లు. ప్రపంచ యుద్ధ సమయంలో తప్ప నేను ఎప్పుడూ ఆందోళన చెందలేదు' అని అతడు చెప్పడం కరోనా తీవ్రతను తెలియజేస్తోంది.

### టోక్యోపై నిర్ణయానికి

## గడువేం లేదు: ఐఓసీ

**సిడ్నీ:** ఒలింపిక్స్ నిర్వహణపై నిర్ణయం తీసుకోవడానికి మే నెలను గడువుగా విధించలేదని ఐఓసీ సమన్వయ కమిషన్ స్పష్టంజేసింది. 'జూలై 24న ఒలింపిక్స్‌ను ఆరంభించాలనే అనుకుంటున్నాం' అని కమిషన్ చీఫ్ జాన్ కోట్స్ పేర్కొన్నారు. ఒలింపిక్స్ విషయమై ప్రస్తుతం ఐరోపాలో పర్యటిస్తున్న జాన్ ఈ వారంలో ఆస్ట్రేలియా తిరిగి రానున్నారు. వచ్చాక ప్రభుత్వం విధించిన 14 రోజుల నిర్బంధంలోకి వెళ్లనున్నారు.



## ఆ ఒక్కటి మిగిలింది..

**ముప్పై ఏళ్ల కెరీర్. 8 కామన్వెల్త్.. 2 ఆసియా పతకాలు. నాలుగు పదుల వయస్సుకు చేరువవుతున్నా ఆటలో ఇప్పటికీ తగ్గని జోరు. దేశంలో టేబుల్ టెన్నిస్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన 37 ఏళ్ల ఆచంట శరత్ కమల్.. తాజాగా ఒమన్ టైటిల్‌ను ముద్దాడి ఒలింపిక్స్ రేసుకు తాను సిద్ధమని తెలియజేశాడు. కెరీర్‌లో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఈ ప్యాడ్లర్.. ఆ ఒక్కటే మిగిలిందని అంటున్నాడు. అదేంటో తెలుసుకుందాం.**

శరత్ కమల్

***పదేళ్ల తర్వాత ఇంటర్నేషనల్ టైటిల్ సాధించడం ఎలా అనిపిస్తోంది?***

గల్ఫ్ దేశాల్లో కరోనా విలయతాండవం చేస్తుందని తెలిసి కూడా ఒలింపిక్ ఏడాది కావడంతో టైటిల్ సాధిస్తే ర్యాంకింగ్ మెరుగుపడుతుందనే ఉద్దేశంతో వెళ్లా. అనుకున్నట్టే ఒమన్ టైటిల్ గెలవడంతో సంతోషంగా ఉంది. 2010లో ఈజిప్టు టోర్నీ విజయం తర్వాత ఇదే నా తొలి ఇంటర్నేషనల్ టైటిల్. ఒలింపిక్ అర్హత పోటీలు సమీపిస్తుండడంతో కుటుంబ సభ్యులు వెళ్లొద్దని వారించినా ప్రాక్టీస్ లభిస్తుందని వెళ్లా.

***టేబుల్ టెన్నిస్ ఎప్పుడు మొదలుపెట్టారు?***

ముప్పై ఏళ్ల నుంచి ఆడుతున్నా. నేను పుట్టేసరికే నాన్న టేబుల్ టెన్నిస్‌లో కోచింగ్ ఇస్తుండేవారు. నా ఆసక్తి గమనించి నాన్న శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ఏడేళ్ల వయస్సులో తొలిసారి స్కూల్‌స్థాయి పోటీల్లో పాల్గొన్నా. అనంతరం అండర్-10,14,15,17 విభాగాల్లో పలు టైటిళ్లు సాధించి తమిళనాడులో టాప్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకొన్నా. దీంతో సబ్ జూనియర్ తర్వాత ఒక్క జాతీయ జూనియర్ టోర్నీలో కూడా ఆడకుండానే, నేరుగా సీనియర్ నేషనల్స్‌లో పోటీపడ్డా. నిరుడు తొమ్మిదో సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ నెగ్గి కమలేష్ మెహతా(8 టైటిళ్లు) రికార్డును బద్దలుకొట్టా.

***30 ఏళ్ల కెరీర్‌లో వెనక్కి చూస్తే ఏమనిపిస్తోంది?***

నేను టీటీలో కెరీర్ ప్రారంభించే నాటికి దేశంలో స్పోర్ట్స్‌కు పెద్దగా ఆదరణ లేదు. 2006 కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధించాక రాజకీయ నాయకులు, ఎవరైనా ఉన్నత స్థాయి వారిని కలిసినప్పుడు, ఆటలు ఒక్కటే కాదు చదువు కూడా ఉండాలి.. అని చెప్పేవారు. బంధువులు అయితే, స్పోర్ట్స్ ఆడితే ఏమొస్తుంది.. పీఈటీ మాస్టరో, కోచ్‌వో అవుతావ్ అంతేనా అని చులకనగా మాట్లాడేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. క్రీడాకారులకు ఇస్తున్న గౌరవం, వారికొచ్చే ఆదాయం కూడా పెరిగింది. పదేళ్ల కిందటే కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించా. ఒలింపిక్ పతకమే మిగిలిపోయింది. ఈసారి అదృష్టం ఎలా ఉందో చూడాలి.

***టీటీలో ఇటీవలి కాలంలో వచ్చిన మార్పులేంటి?***

టీటీ మౌలిక సదుపాయాల విషయంలో విదేశాలతో పోల్చితే మన దేశం ఇంకా వెనుకే ఉంది. ఆట విషయానికి వస్తే నా కెరీర్ ప్రారంభంలో స్కోరింగ్ విధానం 5 సెట్లు, 21 పాయింట్లకు ఉండేది. ఇప్పుడు 11 పాయింట్లకు తగ్గిపోయింది. ఇదివరకు బంతి 30 ఎంఎం మాత్రమే ఉండేది. ఇప్పుడు 40 ఎంఎంకుపైగా పెరిగింది. ఆకారంలో తేడా రావడంతో గేమ్‌లో ర్యాలీలు పెరిగాయి. నిబంధనలు, టెక్నాలజీలో కూడా చాలా మార్పులు వచ్చాయి.

***రాజమండ్రితో మీకున్న అనుబంధం గురించి..?***

నాన్న శ్రీనివాసరావుది రాజమండ్రి, అమ్మది మచిలీపట్నం. నాన్న ఉద్యోగరీత్యా చెన్నైలో స్థిరపడ్డాం. బంధువుల శుభకార్యాలకు నాన్నతో కలిసి రాజమండ్రి వెళుతుంటా. 2005లో అర్జున అవార్డు వచ్చినప్పుడు రాజమండ్రి టౌన్‌హాల్‌లో నాకు సన్మానం చేశారు.

***రిటైర్మెంట్ ఎప్పుడు?***

రిటైర్మెంట్ గురించి ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఆట నుంచి తప్పుకొన్నాక కూడా టీటీకి అనుబంధంగానే పనిచేస్తా. టాలెంట్ హంట్ నిర్వహించి ప్రతిభగల ఆటగాళ్లకు సహాయపడాలనే ఆలోచన ఉంది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆహ్వానిస్తే హైదరాబాద్, విశాఖపట్నంలో అకాడమీలు ఏర్పాటు చేస్తా.

*(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి- హైదరాబాద్)*

## పాక్‌లో బంగ్లా టూర్ వాయిదా

**కరాచీ:** పాకిస్థాన్‌లో పర్యటించాల్సిన బంగ్లాదేశ్ జట్టు తమ ప్రయాణాన్ని నిరవధికంగా వాయిదా వేసుకుంది. అక్కడ ఓ వన్డేతో పాటు రెండో టెస్టును ఆడాల్సి ఉంది. జనవరిలో బంగ్లా జట్టు మూడు టీ20లు, ఓ టెస్టును పాక్‌లో ఆడింది. అయితే మిగిలిన రెండో టెస్టుతో పాటు ఓ వన్డే మ్యాచ్ కోసం ఈనెల 29న పాక్‌కు వెళ్లాల్సి ఉంది. కానీ కొవిడ్ కారణంగా ఇరు జట్ల బోర్డులు ఇప్పట్లో ఈ మ్యాచ్‌లను నిర్వహించకూడదని నిర్ణయించుకున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 1న వన్డే, 5 నుంచి 9 వరకు రెండో టెస్టు జరగాల్సి ఉంది. గతనెలలో జరిగిన తొలి టెస్టులో పాక్ జట్టు ఇన్నింగ్స్-44 పరుగుల తేడాతో నెగ్గింది.

కరోనా ఎఫెక్ట్

## బీసీసీఐ ఆఫీస్ మూసివేత

**న్యూఢిల్లీ:** కొవిడ్-19 మహమ్మారి విస్తరిస్తున్న నేపథ్యంలో బీసీసీఐ కార్యాలయానికి తాళం పడింది. ముంబైలోని ప్రధాన కార్యాలయాన్ని మంగళవారం నుంచి మూసివేస్తున్నారు. అంతేకాదు.. ఆఫీసు ఉద్యోగులందరికీ ఇంటినుంచే పని చేసేలా ఆదేశాలు ఇచ్చినట్టు బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. 'వాంఖడే స్టేడియంలోని ప్రధాన కార్యాలయం ఉద్యోగులందరికీ ఇంటినుంచే విధులు నిర్వర్తించాల్సిందిగా సూచించాం. తదుపరి ఆదేశాలు వచ్చేదాకా వారిదంతా వర్క్ ఫ్రమ్ హోమ్' అని ఆ అధికారి తెలిపారు. ఇప్పటికే ఐపీఎల్ సహా దేశవాళీ టోర్నీలను

### ఐపీఎల్ శిబిరాలు వాయిదా

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ సందడి ఇప్పట్లో లేకపోవడంతో ఫ్రాంచైజీలు శిక్షణ శిబిరాలను వాయిదా వేసుకున్నాయి. షెడ్యూల్ ప్రకారం మార్చి 29 నుంచి జరగాల్సిన ఈ లీగ్‌ను ఏప్రిల్ 15 వరకు వాయిదా వేశారు. దీంతో 21 నుంచి జరగాల్సిన తమ క్యాంప్‌ను బెంగళూరు వాయిదా వేసుకుంది. ఇంతకుముందే ముంబై, చెన్నై, కోల్‌కతా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నాయి.

## స్థయిర్యం కోల్పోవద్దు

### క్రీడాకారులకు రిజిజు హితవు



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ ధాటికి టోర్నీలన్నీ వాయిదాపడ్డాయి. దీంతో క్రీడాకారులు డీలాపడ్డారు. అయితే ఆటగాళ్లెవరూ స్థయిర్యం కోల్పోవద్దని కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజు హితవు పలికారు. శిక్షణ కొనసాగించాలని సూచించారు. 'కొవిడ్-19తో క్రీడా పోటీలు తాత్కాలికంగా వాయిదాపడ్డాయి. కానీ క్రీడాకారులెవరూ ఆత్మస్థయిర్యం కోల్పోవద్దు. శిక్షణపై దృష్టిసారించండి' అని రిజిజు ట్వీట్ చేశారు.

### 'ఆసియాడ్'లో ఖోఖో..: ఐఓఏ ఆశాభావం

**న్యూఢిల్లీ:** జపాన్‌లోని నగోయాలో 2026లో జరిగే ఆసియా క్రీడల్లో ఖోఖోను ప్రవేశపెట్టగలరన్న ఆశాభావాన్ని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) వ్యక్తంజేస్తోంది. 'ఖోఖోను ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ అధికారికంగా గుర్తించింది. 2026లో జరిగే ఆసియా గేమ్స్‌లో ఈ క్రీడను పూర్తి స్థాయిలో ప్రవేశపెడతారనుకుంటున్నాం' అని ఐఓఏ సెక్రటరీ జనరల్ రాజీవ్ మెహతా సోమవారం అన్నారు.




AUTHORISED FORD DEALER: VIJAYAWADA: Prasadampadu, Lakshmi Ford, ☎: 9022913931.


Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.